www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దినపత్రిక
గురువారం 19 జూన్ 2025
సంపుటి :07 సంచిక : 23 , పేజీలు : 12 వెల:రూ.5/-



## బనకచర్లపై అవసరమైతే సుప్రీంకు వెళతాం

- గోదావరి- బనకచర్లను వ్యతిరేకిస్తూ కేంద్రాని తీర్మానం
- రాష్ట్రప్రయోజనాలు కాపాడడంలో రాజీపడం
- అఖిలపక్ష ఎంపిల భేటీ తరవాత మీడియాతో సిఎం రేవంత్

## జమ్మూ కాశ్మీర్‌లో మూడో జోక్యం సహించం


- ట్రంప్‌కు స్పష్టం చేసిన ప్రధాని మోడీ
- భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్త్రీ వెల్లడి



# హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ సెంటర్

### జీఎస్ఈసీ కేంద్రాన్ని ప్రారంభించిన సిఎం రేవంత్
### డిజిటల్ భద్రతే దీని ప్రధాన లక్ష్యమని వెల్లడి
### తెలంగాణ రైజింగ్‌లో గూగుల్ తోడ్పాటు అవసరమన్న సిఎం

**హైదరాబాద్,జూన్ 18(వెలుతురు):** ప్రపంచం మొత్తం డిజిటల్ యుగంగా మారుతోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. డిజిటల్ సమాచారం భద్రంగా ఉంటే ప్రజలు క్షేమంగా ఉన్నట్లే అని చెప్పారు. హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. జీఎస్ఈసీ కేంద్రాన్ని ప్రారంభించడం




సంతోషంగా ఉందన్నారు. డిజిటల్ భద్రతే దీని ప్రధాన లక్ష్యమని చెప్పారు. 'గూగుల్ ఇన్నోవేటివ్ కంపెనీ.. మాది ఇన్నోవేటివ్ ప్రభుత్వం. నైపుణ్యాలు పెంచేందుకు స్కిల్ వర్సిటీ ఏర్పాటు చేశాం. ఉత్తమ పెట్టుబడులకు గమ్యస్థానంగా తెలంగాణ మారుతోందని ఈ సందర్భంగా అన్నారు.. 2035 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ మారాలన్న లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని అన్నారు. తెలంగాణ రైజింగ్‌లో భాగంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మారుస్తున్నాం అన్నారు. ఇక్కడి మహిళలు ధనిక పెట్టుబడిదారులకు పోటీదారులుగా మారుతున్నారు. ప్రభుత్వంలో నూతన



ఆవిష్కరణలు, విధానాలు తీసుకొచ్చాం'అని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో గూగుల్ మొదటి సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఇది ప్రపంచంలో ఐదవది మాత్రమే అని తెలిపారు. గూగుల్ ప్రారంభించినప్పటి నుంచి ప్రపంచం మారిపోయిందని.. నేడు మన

## కేసీఆర్ దత్తత గ్రామం వాసాలమర్రిలో అర్హులందరికీ
# ఇందిరమ్మ ఇళ్లు

### నేడు మంజూరు పత్రాలు అందజేయనున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్ వెలుతురు జూన్ 18:** భవనగిరి జిల్లా వాసాలమర్రి గ్రామంలో ఇండ్ల నిర్మాణం పేరుతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేతిలో మోసపోయిన ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని రాష్ట్ర రెవెన్యూ. హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. "వాసాలమర్రి గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నట్లు 2020 నవంబర్ 1న ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ ఆనాడు ప్రకటించారు. 2021 జూన్ 22న గ్రామసభ నిర్వహించి స్థానికులతో

## నిబంధనల ప్రకారం పకడ్బందీగా గురుకులాల నిర్వహణ...

- డిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మల్లు
- గ్రామీణ ప్రాంతాలలో నూతన బస్సు రూట్ సర్వీస్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- గురుకులాల్లో మంజూరైన సీట్లను పూర్తి స్థాయిలో నింపాలి
- ప్రతి గురుకులంలో తప్పనిసరిగా దోమల మెష్ జాలి ఏర్పాటు చేయాలి
- గురుకులాలను రెగ్యులర్ గా ఉన్నతాధికారులు తనిఖీ చేయాలి
- ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి అధికారులతో వివిధ పథకాలపై రాష్ట్ర బిసి సంక్షేమం, రవాణా శాఖల మంత్రితో కలిసి సమీక్షించిన డిప్యూటీ సిఎం.

అధికారులతో వివిధ పథకాలపై రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖల మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్, ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ లతో కలిసి సమీక్షించారు.దగురుకులాల నిర్వహణ, స్టడీ సర్కిల్ పని తీరు, గ్రామీణాభివృద్ధి శాఖ, రవాణా శాఖ, విద్యుత్ శాఖ పని తీరు, చేపట్టిన అభివృద్ధి సంక్షేమ అభివృద్ధి

**ఖమ్మం వెలుతురు జూన్ 18:** ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం పక్కాగా గురుకులాలను నిర్వహించాలని డిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మల్లు అన్నారు.బుధవారం రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు, కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి




## బ్రహ్మోస్ ఏరోస్పేస్ విస్తరణ
### హైదరాబాద్ అనుకూలమన్న సిఎం రేవంత్



**హైదరాబాద్,జూన్ 18( వెలుతురు):** హైదరాబాద్ లో బ్రహ్మోస్ ఏరోస్పేస్ సంస్థను విస్తరించాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. హైదరాబాద్, బెంగుళూరు డిఫెన్స్ కారిడార్ ఏర్పాటు చేసేందుకు అనుకూలమైనవని రేవంత్ వివరించారు. ఇప్పటికే హైదరాబాద్ లో డిఫెన్స్ కు సంబంధించి వివిధ సంస్థలు ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి


## నూతన బస్ స్టేషన్‌కు శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్..



**మధిర వెలుతురు జూన్ 18:** తెలంగాణ ఆర్టీసీ మధిర నియోజకవర్గ కేంద్రంలో 10.00 కోట్ల రూపాయలతో నూతన బస్ స్టేషన్ కు భూమి పూజ చేసి శంకు స్థాపన & నూతన ఆర్టీసీ బస్సుల ప్రారంభోత్సవం చేసిన డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, అనంతరం బస్సులో ప్రయాణం చేసిన డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క,మంత్రి పొన్నం ప్రభాకర్ మధిర బస్ స్టేషన్ 35 సంవత్సరంలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ బస్ స్టేషన్ ను ఆధునికరించే ఉద్దేశంతో 10 ప్లాట్ ఫామ్ లతో సుమారు 10 కోట్ల ఖర్చుతో, 2 ఎకరాల 24 గుంటలలో నూతన బస్ స్టేషన్ నిర్మాణాన్ని చేపట్టబడుచున్నది. ఈ బస్ స్టేషన్ దగ్గర్లోనే ఉన్నటువంటి రైల్వే స్టేషన్ ను అనుసంధానం చేస్తూ ప్రయాణికులకు అనుగుణంగా వారి సౌకర్యార్థం నూతన బస్ స్టేషన్ నిర్మించబడుతున్నది. కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేషన్ చైర్మన్ లు నాయుడు సత్యనారాయణ, రాయల నాగేశ్వర రావు,జిల్లా కలెక్టర్ అనుదీప్ దురశెట్టి, ఆర్టీసీ అధికారులు.. మంత్రి పొన్నం ప్రభాకర్

## గోదావరి వృథా జలాలను వాడుకోవాల్సిందే

- ఆనాడు కెసిఆర్ అభిప్రాయం కూడా ఇదే
- బనకచర్లకు తరలించలన్న ప్రతిపాదన సమ్మతం కాదు
- బిసి రిజర్వేషన్ల కోసం 17న రైల్‌రోకో
- ఎమ్మెల్సీ కవిత వెల్లడి



**హైదరాబాద్, జూన్18(వెలుతురు):** తెలంగాణ రాజకీయాల్లో హీట్ పెరుగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన ఆమె, ముఖ్యమంత్రి చర్యలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపి, సమస్యకు పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని కోరారు. 'బనకచర్ల

## ఫోన్ ట్యాపింగ్‌లో కొత్త విషయాలు

- 4200 మందికి పైగా వ్యక్తుల ఫోన్లు ట్యాప్
- విచారణ జరిగే కొద్దీ వెలుగు చూస్తున్న అక్రమాలు



**హైదరాబాద్,జూన్18( వెలుతురు):** ఫోన్ ట్యాపింగ్ కేసు తెలంగాణ రాష్ట్రంలో తీవ్ర రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందే కొన్ని పార్టీలు లేదా వ్యక్తులు ఎన్నికల పక్రియను ప్రభావితం చేస్తున్నారన్న

## విద్యారంగంలో అనేక మార్పులు

- 9,600 మోడల్ ప్రైమరీ స్కూళ్లను ఏర్పాటు
- 'వన్ క్లాస్ - వన్ టీచర్' విధానం అమలు
- కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో లోకేశ్ భేటీ





## ఏపీలో అభివృద్ధి, సంక్షేమం పక్కకుపోయింది

- రాష్ట్రంలో ఇప్పుడు రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది
- రెంటపాళ్లలో నాగమల్లేశ్వర రావు కుటుంబానికి పరామర్శ
- ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై జగన్ ఘాటు విమర్శలు

## పీఎంఈజీపీ పథకంలో భాగంగా దేశమంతటా 11,480 సేవా రంగ లబ్ధిదారులకు రూ.300 కోట్లకు పైగా మార్జిన్ మనీ సబ్సిడీని అందించిన కేవీఐసీ

**ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో, ప్రతి పల్లెలో ఉపాధితో పాటు స్వయంఉపాధి పునాదులను పీఎంఈజీపీ పథకం బలపరచింది: కేవీఐసీ చైర్మన్ మనోజ్‌కుమార్**

**దక్షిణాది రాష్ట్రాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళ నాడు, కేరళ, పాండిచ్చేరిలలో 4565 ప్రాజెక్టులకు సంబంధించి రూ.116 కోట్ల సబ్సిడీని పంపిణీ చేశారు. ఈ ప్రాజెక్టులకు రూ.343 కోట్ల కన్నా ఎక్కువ రుణాలను మంజూరు చేశారు.**




**న్యూఢిల్లీ వెలుతురు 18 జూన్ 2025:** ప్రధానమంత్రి ఉద్యోగ కల్పన కార్యక్రమం (పీఎంఈజీపీ) లో భాగంగా దేశవ్యాప్తంగా 11,480 సేవా రంగాల లబ్ధిదారులకు రూ.300 కోట్ల రుణ సబ్సిడీని ఖాదీ, గ్రామ పరిశ్రమల సంఘం (కేవీఐసీ) పంపిణీ చేసింది. ఈ సబ్సిడీని రూ.906 కోట్ల రుణాలకు సంబంధించి అందించారు. న్యూఢిల్లీలోని రాజ్‌ఘాట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కేవీఐసీ చైర్మన్ శ్రీ మనోజ్ కుమార్ తన బృందంతో కలసి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో ఈ మొత్తాలను వర్చువల్ మాధ్యమం ద్వారా అందించారు. ఈ కార్యక్రమంలో కేవీఐసీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ) రూప్ రాశితో పాటు కేంద్ర కార్యాలయంలోని ఇతర ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా చైర్మన్ శ్రీ మనోజ్ కుమార్ మాట్లాడుతూ... ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో 'స్వయంసమృద్ధి సహిత, అభివృద్ధి చెందిన భారత్' దృష్టికోణానికి గుర్తింపు లభిస్తోందనీ, దీనికి ప్రధానమంత్రి ఉద్యోగ కల్పన కార్యక్రమం (పీఎంఈజీపీ) బలమైన స్తంభంగా మారిందంటూ అభివర్ణించారు. ఈ

https://epaper.velthuru.com

జనరల్ వార్తలు

# వెలుతురు

(మొదటి పేజీ తరువాయి..)

## బనకచర్లపై అవసరమైతే సుప్రీంకు వెళతాం

**హైదరాబాద్, జూన్18( వెలుతురు):**
జగన్‌తో మిలాఖత్ అయిన తరవాతనే ఆనాటి సిఎం కెసిఆర్ గోదావరి జలాలను రాయలసీమకు తరలించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆనాడు 2019 అక్టోబరులో కేసీఆర్, జగన్ కలిసి గోదావరి జలాలను రాయలసీమకు తరలించటంపై చర్చించు కున్నారని అన్నారు. . గోదావరి- బనకచర్ల ప్రాజెక్టుకు ఆనాడే అంకురార్పణ జరిగిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు విషయంపై అఖిలపక్ష ఎంపీలతో సమావేశం అనంతరం సీఎం మీడియాతో మాట్లాడారు. గోదావరి-బనకచర్లపై అవసరమైతే సుప్రీంకోర్టుకైనా వెళ్లాలని భావిస్తున్నట్లు వెల్లడించారు. నీటి ఒప్పందాలపై నిపుణులైన న్యాయవాదులను నియమించుకుంటాం. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తాం. గోదావరి- బనకచర్లను వ్యతిరేకిస్తూ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని నిర్ణయించాం. అన్ని పార్టీలను కలుపుకొని పోరాడుతాం అని వివరించారు. నిజానికి రాయలసీమకు గోదావరి జలాల తరలింపులో సహకరిస్తామని కేసీఆర్ అన్నట్టు నమస్తే తెలంగాణలో రాశారని సీఎం తెలిపారు. రాజకీయాలు ఎలా ఉన్నా రైతుల విషయంలో రాజీ పడేది లేదని స్పష్టం చేశారు. బనకచర్ల వ్యవహారంపై ఏ విధంగా ముందుకెళ్లాలనే అంశంపై విపక్షాలతో చర్చించినట్లు చెప్పారు. తెలంగాణకు గోదావరి, కృషా నదులే జీవనాధారమని, ఈ ప్రభుత్వానికి రైతుల ప్రయోజనాలే ముఖ్యమని పేర్కొన్నారు. '2192016న కేంద్ర ప్రభుత్వం అపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహించింది. ఏటా 3వేల టీఎంసీల నీరు వృథాగా గోదావరి నీరు సముద్రంలో కలుస్తోందని అపెక్స్ కౌన్సిల్ భేటీలో కేసీఆర్ అన్నారు. 3వేల టీఎంసీలు వృథాగా పోతున్నాయని మొదట మాట్లాడింది కేసీఆరే. అపెక్స్ కౌన్సిల్ భేటీలో ఎవరు ఏం మాట్లాడారో అంతా దస్త్రాల రూపంలో ఉంది. రాయలసీమకు గోదావరి జలాల తరలింపుపై చర్చించుకున్నామని ఆనాడు తెలంగాణ, ఏపీ మంత్రులు మీడియాకు చెప్పారు. తెలంగాణకు కృష్ణాలో 299 టీఎంసీలు సరిపోతాయని ఆనాడు కేసీఆర్ ఒప్పుకొని సంతకం చేశారు. ఆనాడు కేసీఆర్ చేసిన సంతకం ఇవాళ తెలంగాణకు ప్రతిబంధకంగా మారింది' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మీడియా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న భారాస ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అభ్యంతరం తెలిపారు. ఆనాడు తెలంగాణ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని కేసీఆర్ మాట్లాడారని వివరణ ఇచ్చారు. కృష్ణానదిని కలుపుతూ గోదావరి జలాలు తీసుకెళ్తే అభ్యంతరం లేదని కేసీఆర్ అన్నారని గుర్తు చేశారు. సమావేశం పూర్తిగా రాజకీయ దురుద్దేశంతో జరుగుతోందన్నారు.


## బ్రహ్మోస్ ఏరోస్పేస్ విస్తరణ

తెలిపారు. జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బ్రహ్మోస్ ఏరోస్పేస్ ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. బ్రహ్మోస్ ఏరోస్పేస్ ఎండీ / సీఈవో డా, జైతీర్థ్ ఆర్. జోషి, బ్రహ్మోస్ హైదరాబాద్ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ సూరంపూడి సాంబశివ ప్రసాద్, డీఆర్‌డీఎల్ డైరెక్టర్ జీ.ఏ. శ్రీనివాస మూర్తి, తదితరులు సీఎంతో భేటీ అయ్యారు. దేశంలో పెట్టుబడులకు తెలంగాణ అనుకూల ప్రదేశమని చెప్పారు.బ్రహ్మోస్ ఏరోస్పేస్ విస్తరణకు తెలంగాణ, హైదరాబాద్‌ను ఎంచుకోవాలని, ప్రభుత్వం వైపు నుంచి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు. సీఎం వాదనలపై బ్రహ్మోస్ ఏరోస్పేస్ బృందం సానుకూలంగా స్పందించింది. ఈ భేటీలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు.

## జమ్మూ కాశ్మీర్‌లో మూడో జోక్యం సహించం

**న్యూఢిల్లీ,జూన్ 18( వెలుతురు):**
జమ్మూ కాశ్మీర్ అంశంపై పాకిస్థాన్‌తో జరిపే చర్చల్లో మూడో పక్షం మధ్యవర్తిత్వం అవసరం లేదని.. అలా జరగాలని తాము కోరుకోవడం లేదని భారత్ కుండ బద్దలు కొట్టింది. ఈ విషయాన్ని యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఈ మేరకు భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ బుధవారం న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. జీ 7 సదస్సులో పాల్గొనేందుకు ప్రధాని మోదీ కెనడా వెళ్లారు. ఈ పర్యటనలో భాగంగా యూఎస్ అధ్యక్షుడు ట్రంప్‌కు జమ్మూ కశ్మీర్ అంశంపై ఫోన్ ద్వారా ప్రధాని మోదీ స్పష్టం చేశారని ఆయన వివరించారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో కాల్పుల విరమణ ఒప్పందాన్ని తొలుత తెరపైకి పాకిస్థాన్ తీసుకు వచ్చిందని ఈ సందర్భంగా ట్రంప్‌కు ప్రధాని మోదీ గుర్తు చేసినట్లు వివరించారు. మంగళవారం రాత్రి ప్రధాని మోదీతో ట్రంప్ ఫోన్‌ల్లో మాట్లాడారని చెప్పారు. ఆ క్రమంలో అపరేషన్ సిందూర్‌పై ట్రంప్ వివరాలు అడిగినప్పుడు.. అందుకు సంబంధించిన అంశాలను ఆయనకు ప్రధాని మోదీ సోదాహరణగా వివరించారని పేర్కొన్నారు. క్రమంలో జమ్మూ కశ్మీర్ విషయంలో మూడో పక్షం మధ్యవర్తిత్వాన్ని అంగీకరించే ప్రసక్తే లేదని ట్రంప్‌కు మోదీ స్పష్టం చేశారన్నారు. తద్వారా భారత్, పాకిస్థాన్ మధ్య పలు దఫాలుగా చర్చలు జరిపి.. ఇరుదేశాల మధ్య యుద్ధాన్ని తానే నిలువరించా నంటూ ట్రంప్ చేస్తున్న ప్రకటనలకు ప్రధాని మోదీ బలమైన సమాధానం ఇచ్చినట్లు అయిందని విక్రమ్ మిస్రీ వివరించారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం ప్రధాని మోదీ తొలిసారి జాతిని ఉద్దేశించి మాట్లాడుతూ.. పాకిస్థాన్‌లో చర్చలు జరిపే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పాక్ అక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలను నాశనం చేసి.. ఆ ప్రాంతాన్ని భారత్‌కు తిరిగి ఇవ్వాలని ఆయన స్పష్టం చేసిన విషయం విదితమే. ప్రిల్ 22వ తేదీ జమ్మూ కశ్మీర్ అనంతనాగ్ జిల్లాలోని పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది అమాయకులు మరణించారు. ఈ ఘటనకు తామే బాధ్యులమంటూ ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా అనుబంధ సంస్థ ది రెసిస్టెన్స్ ఫ్రంట్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్‌పై భారత్ తీవ్ర ఆంక్షలు విధించింది. అదే తరహాలో పాకిస్థాన్ సైతం భారత్‌కు వ్యతిరేకంగా కీలక నిర్ణయాలు తీసుకుంది. దీంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆ క్రమంలో పాకిస్థాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలను ఆపరేషన్ సిందూర్ పేరిట భారత్ సైన్యం దాడులు నిర్వహించి.. ధ్వంసం చేసింది. ఈ దాడుల్లో 100 మందికిపైగా ఉగ్రవాదులు మరణించారు. అనంతరం పాక్ సైతం భారత్ భూభాగంలోని క్షిపణులు, డ్రోనులతో దాడులకు దిగింది. వీటిని భారత్ అడ్డుకున్న సంగతి తెలిసిందే.

## కేసీఆర్ దత్తత గ్రామం వాసాలమర్రిలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



సహపంక్తి భోజనం చేశారు. బంగారు వాసాలమర్రిగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతి కుటుంబానికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టించి ఇస్తానని హామీ ఇచ్చారు. కానీ వాస్తవంగా ఆరోజు నుంచి ముఖ్యమంత్రి పదవి నుంచి దిగిపోయే 2023 డిసెంబర్ 7వ తేదీ వరకు వాసాలమర్రి వైపు కన్నెత్తి చూడలేదని బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో విమర్శించారు. ఆయన ఫాంహౌస్‌కు వెళ్లడానికి రోడ్డు విస్తరణ కోసం రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇండ్లను కూల్చివేసి నిలువ నీడ లేకుండా చేశారు. ఆ బాధితులు ఇండ్లు కోల్పోయి తాత్కాలికంగా గుడిసెలు, టెంట్లు వేసుకొని కాలం వెళ్లదీస్తున్నారు. బంగారు వాసాలమర్రి దేవుడెరుగు.. ఉన్న ఇండ్లను కోల్పోయామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరికి గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం అక్కున చేర్చుకుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారి ఆదేశాల మేరకు వాసాలమర్రి గ్రామంలో సర్వే నిర్వహించి ఇందిరమ్మ ఇండ్లకు అర్హులను గుర్తించడం జరిగింది. అర్హులైన 205 మందికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశాం. ఇందుకు సంబంధించిన మంజూరు పత్రాలను గురువారం నాడు నేనే స్వయంగా వారికి అందజేస్తున్నాను. దేశానికి దశ దిశ చూపిస్తా అని ప్రగల్భాలు పలికిన కేసీఆర్ దత్తత గ్రామ ప్రజలకు పంగనామాలు పెట్టారు. కొత్త ఇల్లు రాలేదు.. ఉన్న ఇల్లు పోయింది. ప్రజల అవసరాలను ఆశలను వారి రాజకీయ అవసరాలకు మాత్రమే వాడుకున్నారని చెప్పడానికి వాసాలమర్రి గ్రామమే ఒక నిదర్శనం" అని అన్నారు.

నేడు క్షేత్రస్థాయిలో పర్యటన

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పర్యవేక్షించడానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం నాడు రెండు జిల్లాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా బండ సోమారం, సూర్యాపేట జిల్లా మోతే మండలంలోని విభలాపూర్ లో ఇందిరమ్మ ఇండ్ల పనులను పరిశీలించనున్నారు.

# హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ సెంటర్

జీవితాలు పూర్తిగా డిజిటల్‌గా మారాయన్నారు. గోప్యత, భద్రత గురించి నేడు ఆందోళన చెందుతున్నామని తెలిపారు. మన ఆర్థిక వ్యవస్థ, మన ప్రభుత్వం, మన జీవితాలు డిజిటల్‌గా మారాయి. డిజిటల్ సురక్షితంగా ఉంటే, మనం మరింత అభివృద్ధి చెందుతామని చెప్పుకొచ్చారు. అధునాతన సైబర్ సెక్యూరిటీ, భద్రతా పరిష్కారాల కోసం గూగుల్ ఈ సైబర్ సెక్యూరిటీ హబ్‌ను ఉపయోగి స్తున్నందుకు గర్విస్తున్నట్లు తెలిపారు. ఇది నైపుణ్య అభివృద్ధిపై దృష్టి పెడుతుందన్నారు. ఉపాధిని సృష్టించడంతో పాటు దేశం సైబర్ భద్రతా సామర్థ్యాన్ని పెంచుతుందన్నారు. చెడు చేయవద్దన్నది గూగుల్ సంస్థ సిద్ధాంతమని.. ఈ విధానాన్ని తాను ఇష్టపడుతున్నట్లు తెలిపారు. గూగుల్‌లా, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా మంచిని మాత్రమే చేస్తుందని నమ్ముతున్నానన్నారు. ఈ విధానం వల్ల ప్రయోజనాలు కొంత నెమ్మదిగా కనిపిస్తాయని.. అయితే మనం దీర్ఘకాలికంగా దృష్టిపెట్టి పనిచేయాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సంస్థలు ఉత్తమ పెట్టుబడికి అనుకూల రాష్ట్రం కోసం శోధిస్తే దానికి సమాధానం తెలంగాణ అని వస్తుందన్నారు. సెర్చ్‌లో మొదటి లింక్ హైదరాబాద్ వస్తుందని సీఎం రేవంత్ అన్నారు. దీనిని తెలంగాణ రైజింగ్ అని పిలుస్తామని... 2035 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయాలనుకుంటున్నట్లు చెప్పారు. 1 కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. గూగుల్ ఆఫీస్ పక్కన రెండున్నర ఎకరాల్లో స్వయం సహాయక సంఘాల మహిళల కోసం స్టాల్స్ ఏర్పాటు చేశామని.. రైతులను సంపన్నులుగా తయారు చేయడంతో పాటు సంతోషంగా ఉంచాలను కుంటున్నామని తెలిపారు. యువతలో నైపుణ్యాలు పెంచడంతో పాటు వారికి ఉపాధి కల్పించాలని అనుకుంటున్నట్లు చెప్పారు. అందుకు గూగుల్ మద్దతు కావాలని.. తెలంగాణ రైజింగ్‌కు బ్రాండ్ అంబాసిడర్లుగా కావాలని కోరుకుంటున్నామన్నారు. గూగుల్, హైదరాబాద్ పాత స్నేహితులన్నారు. 2007లో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో గూగుల్ తన మొదటి కార్యాలయాన్ని ఇక్కడ ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. దాదాపు 7,000 మంది గూగుల్ ఉద్యోగులు నేడు హైదరాబాద్‌ను తమ ఇల్లుగా భావిస్తున్నా రన్నారు. విద్య, భద్రత, మ్యాప్‌లు, ట్రాఫిక్, స్టార్టప్‌లు, ఆరోగ్యం ఇలా అనేక రంగాలలో గూగుల్‌తో కలిసి పనిచేస్తున్నామన్నారు. గూగుల్ ఒక వినూత్న సంస్థ, తమది ఒక వినూత్న ప్రభుత్వమని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల హైదరాబాద్ ట్రాఫిక్ నియంత్రణ కోసం ట్రాన్స్‌జెండర్‌లను నియమించినట్లు చెప్పుకొచ్చారు. గత ప్రభుత్వాలు ట్రాన్సజెండర్స్‌ని నిర్లక్ష్యం చేశాయన్నారు. జీహెచ్‌ఎంసీ కూడా వివిధ పనుల కోసం ట్రాన్స్‌జెండర్‌లను నియమించుకుంటోందన్నారు. నాణ్యమైన విద్య తమ లక్ష్యమని.. ఇందుకోసం యంగ్ ఇండియా నైపుణ్య విశ్వవిద్యాలయం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను తీసుకువస్తున్నామని తెలిపారు. తెలంగాణలో ప్రతీ సంవత్సరం 1.10 లక్షల ఇంజనీర్స్ కాలేజ్‌ల నుంచి వస్తున్నారని... చాలా మంది విద్యార్థులకు నైపుణ్యం ఉండడం లేదన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపు కోసం ఆనంద్ మహీంద్రా నేతృత్వంలో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంలో యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అందరికీ ఆరోగ్యం తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇవే తన ప్రధాన ఆవిష్కరణలన్నారు. 'గూగుల్ లాగానే, నా ప్రభుత్వంలో భాగస్వాములైన మహిళలు, యువత, రైతులు, పేదలు, మధ్యతరగతి, సీనియర్ సిటిజన్లు, పిల్లలకు ఉన్నతమైన జీవన ప్రమాణాలు కల్పించాలని కోరుకుంటున్నాను. మనం కలిసి గొప్ప ప్రమాణాలను సృష్టిద్దాం. హైదరాబాద్‌లో మీ కొత్త సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ఏర్పాటు చేసినందుకు మరోసారి అభినందిస్తున్నాను. మేం గర్వపడేలా మీరు పనిచేస్తారని విశ్వసిస్తున్నాను' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు తదితరులు పాల్గొన్నారు. ఆసియా-పసిఫిక్ రీజియన్‌లో టోక్యో తర్వాత గూగుల్ మొదలుపెట్టిన రెండో సెంటర్ ఇది. ఇక ప్రపంచవ్యాప్తంగా చూస్తే ఇది ఐదవది కావడం గమనార్హం. గతేడాది ఆగస్టులో సీఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనలో గూగుల్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించి, హైదరాబాద్‌లో ఈ సెంటర్ ఏర్పాటు చేయాలని కంపెనీ ప్రతినిధులను కోరారు. ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత భద్రతా వ్యవస్థలు, ఆన్‌లైన్ సేఫ్టీ టూల్స్‌ను అభివృద్ధి చేయడంలో ఇది కీలకంగా పనిచేయనుంది. ప్రపంచ నిపుణులు, పరిశోధకులు ఇందులో భాగమవుతారు. ఈ కేంద్రం ద్వారా వేలాది ఉద్యోగ అవకాశాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా రాష్ట్ర యువతకు లభించే అవకాశముంది. ఐటీ రంగంలో తెలంగాణ మరింత ముందుకు దూసుకుపోతుందన్నది ఈ అభివృద్ధి సంకేతం.

## నిబంధనల ప్రకారం పకడ్బందీగా గురుకులాల నిర్వహణ...

కార్యక్రమాల పురోగతిపై సంబంధిత అధికారులు వివరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ గురుకులాల పాఠశాలల ప్రారంభం నాటికి పిల్లలకు అవసరమైన పాఠ్య పుస్తకాలు, ఏక రూప దుస్తులు పంపిణీ చేయాలని, దీనికి అవసరమైన నిధులు ముందుగానే విడుదల చేయడం జరిగిందని అన్నారు. సరైన వసతులు లేని గురుకులాల భవనాలను అవకాశం ఉన్నచోట ప్రత్యామ్నాయ భవనాలకు మార్చేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. గురుకుల పాఠశాలల్లో పిల్లలకు దోమలు కుట్టి ఇబ్బంది పడటానికి వీలు లేదని, ప్రతి గురుకులంలో పూర్తి స్థాయిలో మెష్ జాలీ లు ఏర్పాటు చేయాలని అన్నారు. హాస్టల్స్ లో అవసరమైన మరమ్మత్తు పనులు పూర్తి చేయాలని అన్నారు. 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్ చార్జీలను ప్రభుత్వం పెంచిందని అన్నారు. కామన్ డైట్ ప్రోగ్రాం సంబంధించి షెడ్యూల్ తప్పనిసరిగా డిస్ ప్లే చేయాలని అన్నారు. జిల్లాలో కలెక్టర్, అదనపు కలెక్టర్, ఉన్నతాధికారులు, స్థానిక ఎమ్మెల్యేలు ప్రజా ప్రతినిధులు గురుకులాలను రెగ్యులర్ గా తనిఖీ చేయాలని, దీనికి సంబంధించి షెడ్యూల్ తయారు చేయాలని అన్నారు. గురుకులాల పరిసరాల్లో పండ్ల మొక్కలను పెద్ద స్థాయిలో పెంచాలని, దీనివల్ల పచ్చదనం పెరగడంతో పాటు విద్యార్థులకు కూడా పౌష్టికాహారం అందుతుందని అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో కోటి మొక్కల వరకు పెంచుతున్నామని అన్నారు. ప్రతి మొక్క మీద ప్రభుత్వం కనీసం 300 రూపాయల వరకు ఖర్చు చేస్తుందని, ఒక జిల్లాలో సంవత్సరానికి 300 కోట్లు ఖర్చు చేస్తున్నామని అన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సర్వైవల్ పై శ్రద్ధ పెట్టాలని అన్నారు. గతంలో నాటిన మొక్కలలో ఎన్ని బ్రతికాయో వాస్తవిక రిపోర్ట్ అందించాలని అన్నారు. గురుకులాల భవనాలకు సంబంధించి రెంట్, డైట్ చార్జీల పెండింగ్ బిల్లులు ప్రభుత్వం విడుదల చేస్తుందని, పిల్లలకు నాణ్యమైన విద్య, భోజనం అందేలా అధికారులు పట్టిష్ట చర్యలు చేపట్టాలని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు అందించడంతో పాటు అది సౌకర్యవంతంగా ఉండేలా మనం చర్యలు చేపట్టామని, డిమాండ్ ఉన్న రూట్ లలో అదనపు బస్సులు నడపాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో నూతన బస్సు రూట్ లను గుర్తించి ప్రతిపాదనలు అందిస్తే నూతన బస్సులు కొనుగోలు చేసి పంపడం జరుగుతుందని అన్నారు. సమీక్ష లో రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో గురుకులాలలో చేపట్టిన చర్యలు, గీత కార్మికులకు కాటమయ్య రక్షక కిట్లను పంపిణీ, వన మహోత్సవం కార్యక్రమంలో తాటి, ఈత ఖర్జూర మొక్కల పెంపకం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటివి సమర్థవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. గురుకులాల్లో విద్యా ప్రమాణాలు మరింత మెరుగ్గ పర్చాల్సిన అవసరం ఉందని, ఐఐటి, నీట్ వంటి పరిక్షలలో మంచి ఫలితాలు సాధించేలా శిక్షణ అందించాలని అన్నారు. పెరిగిన డైట్ చార్జీలు వినియోగిస్తూ ప్రభుత్వం సూచించిన కామన్ డైట్ కార్యక్రమం పక్కాగా అమలు చేయాలని అన్నారు. గురుకులాలలో మంజూరైన సీట్లు పూర్తి స్థాయిలో నింపాలని, సొంత భవనాలు లేని గురుకులాలకు అవసరమైన భూమి గుర్తించాలని, ప్రభుత్వం దగ్గర అందుబాటులో ఉన్న నిధుల ప్రకారం నిర్మించడం జరుగుతుందని తెలిపారు. గ్రామీణ యువతకు ఖమ్మం జిల్లా హెడ్ క్వార్టర్ లో బీసీ స్టడీ సర్కిల్ నందు శిక్షణ పొంది ఉద్యోగాలు సాధించేలా చూడాలని అన్నారు. హైదరాబాద్ కు రావాల్సిన అవసరం లేకుండా అవసరమైన అన్ని రకాల పుస్తకాలు, శిక్షణ మన ఖమ్మంలో అందించాలని అన్నారు. ప్రస్తుత సంవత్సరం వన మహోత్సవం కార్యక్రమంలో 81 వేల ఈత మొక్కలు నాటేందుకు పక్కా కార్యాచరణ సిద్ధం చేయాలని, గీత కార్మికుల సోసైటీ లను వీటిలో భాగస్వామ్యం చేయాలని అన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి రివ్యూ చేస్తూ కాలువల వెంబడి, ఖాళీ ఉన్న ప్రభుత్వ స్థలాల్లో వీటిని పెద్ద ఎత్తున పెంచాలని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన తర్వాత నూతన బస్సు సర్వీసుల కోసం డిమాండ్ వస్తుందని,స్థానిక ఎమ్మెల్యేల నుంచి బస్సు సర్వీసుల ప్రతిపాదనలు తీసుకొని అందించాలని, డిమాండ్ కు అనుగుణంగా అదనపు బస్సులను కేటాయిస్తామని, రాబోయే రోజులలో హైదరాబాద్ కు ఎలక్ట్రిక్ బస్సులు వచ్చే నేపథ్యంలో జిల్లాలకు అదనపు బస్సులు అందుతాయని మంత్రి తెలిపారు. నగర పరిధిలో పీఎంఈ స్కీం కింద ఎలక్ట్రిక్ బస్సుల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని పరిశీలించాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో రూరల్ కనెక్టివిటీ బస్సుపై స్టడీ చేసి నూతన రూట్ లను ప్రతిపాదించాలని అన్నారు. లాండ్రీ లకు, దోబి ఘాట్, సెలూన్ లకు విద్యుత్ సరఫరా సజావుగా అందాలని అన్నారు. గురుకులాల పరిధిలో పారిశుధ్య నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్త కళా చైర్మన్ నాయుడు సత్యనారాయణ, నగర మేయర్ పునుకొల్లు నీరజ, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, ఉమ్మడి జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన బస్ స్టేషన్‌కు శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్..




మాట్లాడుతూ మీ అందరి ఆశీర్వాదంతో తెలంగాణ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ప్రజా పాలన ప్రభుత్వం అధికారంలోకి రాగానే 48 గంటల్లో ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించాం ఆర్టీసీ గత 10 సంవత్సరాలుగా ఒక కొత్త బస్సు కొనలేదు, ఒక ఉద్యోగ నియామకాలు చేపట్టలేదు, పీఏఫ్, సీసీఏస్ సొమ్ములు వాడుకొని ఆర్థిక ఇబ్బందులు కలుగజేసింది 55 రోజుల ఆర్టీసీ కార్మికులు సమ్మె చేసి కార్మికులు మరణిస్తున్న అప్పటి ప్రభుత్వం పట్టించుకున్న పాపానపోలేదు తెలంగాణ ఉద్యమంలో ఆర్టీసీ అన్నలు బస్ కా పయ్యా నై చెలగా అని పోరాడారు ఆర్టీసీ నీ నిర్వీర్యం చేసేలా నిర్బంధంగా ఒక రిటైర్డ్ ఈడి నీ ఎండి గా నియమించారు.. ఆర్టీసీ నీ అస్తవ్యస్తం చేశారు.మీ ఆశీర్వాదంతో ఏర్పడిన తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీ కి జీవం పోసింది ఇప్పుడు బస్సులకు డిమాండ్ పెరిగింది కొత్త బస్సులు కొంటున్నాం,నూతన నియామకాలు చేపట్టాం.. మహిళా సంఘాలు ద్వారా మహిళలే బస్సులకు యజమానులుగా మారుతున్నారు. ఇప్పటి వరకు 186 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారు..6235 కోట్లు మహిళలు అదా చేశారు.. అక్క చెల్లెలా ప్రయాణ చార్జీలు ఆర్టీసీ ప్రభుత్వం కడుతుంది ప్రయాణికుల సౌకర్యం కోసం నూతన బస్ స్టేషన్ ల నిర్మాణం చేస్తుంది ఆర్టీసీ డ్రైవర్ కండక్టర్ ల కృషి తో ఆర్టీసీ గ్రామగ్రామాన బస్సు వస్తుంది.. సంస్థ పరిరక్షణ ,ప్రయాణికుల సౌకర్యం,ఉద్యోగుల సంక్షేమం నినాదంతో ఆర్టీసీ సంస్థ ముందుకు పోతుంది.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, సహచర మంత్రుల సహకారంతో ఆర్టీసీ సంస్థ ముందుకు పోతుంది మధిర లో పక్కనే రైల్వే స్టేషన్ ఉంది..ఇప్పుడు బస్ స్టేషన్ నిర్మాణం జరుగుతుంది. ప్రయాణికులకు ఎక్కడ ఇబ్బందులు లేకుండా నూతన బస్ స్టేషన్ లో టాయిలెట్స్ నిర్మాణం , వెయిటింగ్ హాల్,షాపింగ్ కంప్లేస్ అధునాతన హంగులతో నిర్మాణం జరుగుతుంది.. ఈరోజు వరకు దాదాపు 5 వేల కోట్లు రైతు భరోసా కింద పంట సహాయం అందించింది.. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ 80 శాతం వాడుకుంటున్నారు 500 కి గ్యాస్ అందిస్తున్నాం.. సన్న బియ్యం పంపిణీ..సన్న వడ్ల కు 500 బోనస్ ఇస్తున్నాం ఇప్పటి వరకు 60 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. చదువుకునే పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించడానికి డైట్ కాస్మోటిక్ చార్జీలు పెంచాం.. నియోజకవర్గనికి 3500 ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నాం.. నేను ప్రాతినిధ్యం వహిస్తున్న హుస్నాబాద్ నియోజకవర్గం లో 10 ఏళ్లలో కనీసం 400 ఇళ్లు కూడా నిర్మించలేకపోయింది.. తెలంగాణ లోని ఇందిరమ్మ ఇళ్లు లేని ఊరు లేదు అనే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 7 డిపోలు ఉన్నాయి ఖమ్మం, మధిర, సత్తుపల్లి, భద్రాచలం, కొత్తగూడెం, మణుగూరు, ఇల్లందు డిపోలు కలవు. ఈ డిపోల నుండి ప్రతిరోజు మొత్తం 548 బస్సులు నడుపుతూ ప్రయాణికులను తమ తమ గమ్యస్థానాలకు చేరవేస్తున్నాము. ఈ 548 బస్సులలో 10 లహరి, 34 రాజధాని, 82 సూపర్ లగ్జరీ, 40 డీలక్స్ మరియు మహాలక్ష్మి ప్రయాణించే 81 ఎక్స్ ప్రెస్, 74 పల్లె వెలుగు ఆర్టీసీ బస్సులు మరియు 110 ఎక్స్ ప్రెస్. 117 పల్లె వెలుగు ప్రైవేట్ హైర్ బస్సులు కలవు. ఖమ్మం రీజియన్ నుండి ప్రతిరోజు సుమారు 2.62 లక్షల కిలోమీటర్లు నడుపుతూ సుమారు 2 లక్షల 10 వేల ప్రయాణికులను తమ తమ గమ్య స్థానాలకు చేరవేయబడుతున్నది. అందులో సుమారు 1 లక్ష 32 వేల మహాలక్ష్ములు ఎక్స్ ప్రెస్, పల్లె వెలుగు బస్సులలో ప్రయాణిస్తున్నారు. మదిర డిపో 4 మార్చ్ 1987లో ఆరు బస్సులతో ప్రారంభించబడినది. మధిర బస్ స్టేషన్ 4 ప్లాట్ ఫామ్ లతో 1990లో ప్రారంభించబడినది. ప్రస్తుతము డిపో నందు 218 మంది ఉద్యోగులతో 70 బస్సులు నడపబడుచున్నది. 70 బస్సులలో 7 సూపర్ లగ్జరీ, 7 డీలక్స్, 12 ఎక్స్ ప్రెస్, 17 పల్లె వెలుగు ఆర్టీసీ బస్సులు మరియు 15 ఎక్స్ ప్రెస్, 12 పల్లె వెలుగు ప్రైవేట్ హైర్ బస్సులు కలవు. మధిర డిపో నుండి ప్రతిరోజు సుమారు 29,430 కిలోమీటర్లు నడుపుతూ సుమారు 20 వేల ప్రయాణికులను తమ తమ గమ్య స్థానాలకు చేరవేయబడుతున్నది. అందులో సుమారు 12 వేల మహాలక్ష్ములు ఎక్స్ ప్రెస్, పల్లె వెలుగు బస్సులలో ప్రయాణిస్తున్నారు. ఈ బస్ స్టేషన్ నుండి ప్రధానంగా హైదరాబాద్, విజయవాడ మరియు ఖమ్మం రూట్ లలో రోజుకు సుమారు 170 ట్రిప్ లు నడపబడుచున్నవి. మధిర డిపో పరిధి లోని మధిర, ఎర్రుపాలెం, వైరా మరియు కల్లూరు మండలాలను అనుసందనిస్తూ ఆయా బస్ స్టేషన్ ల నుండి సుమారు 263 ట్రిప్ లతో వివిధ గ్రామాలకు బస్ సౌకర్యం కల్పించ బడుతున్నది.

## విద్యారంగంలో అనేక మార్పులు

**న్యూఢిల్లీ,జూన్18( వెలుతురు):**
విద్యారంగంలో అనేక మార్పులు తీసుకుని వస్తున్నామని, సంస్కరణలతో ప్రతి ఒక్కరికీ విద్యను అందించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యాప్రమాణాల మెరుగుదలకు 9,600 మోడల్ ప్రైమరీ స్కూళ్లను ఏర్పాటు చేసి, 'వన్ క్లాస్ - వన్ టీచర్' విధానాన్ని అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ కోసం నిర్మాణాత్మక సంస్కరణలు తీసుకొస్తున్నట్టు లోకేశ్ కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కి వివరించారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యా ప్రమాణాల మెరుగుదలకు చేపడుతున్న సంస్కరణలను కేంద్ర మంత్రి దృష్టికి తెచ్చారు. 'లెర్నింగ్ అవుట్ కమ్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాం. ఇందులో భాగంగా ఎడ్యుకేషన్ ఎకో సిస్టమ్ అభివృద్ధికి లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం అని వివరించారు. అత్యుత్తమ మౌలిక సదుపాయాలతో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 లీప్ స్కూళ్లను అభివృద్ధి చేస్తున్నాం. 700 యూపీ స్కూళ్లను హైస్కూళ్లుగా అప్ గ్రేడ్ చేశాం. అకడమిక్, ఇన్ ఫ్రాస్టక్చర్ ఆధారంగా పాఠశాలలకు స్టార్ రేటింగ్ ఇస్తున్నాం. ఎలాంటి రాజకీయం జోక్యం లేకుండా టీచర్ ట్రాన్స్‌ఫర్ యాక్ట్ తెచ్చి సీనియారిటీ ప్రాతిపదికన ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలను విజయవంతంగా పూర్తిచేశామన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో 125 ఆటిజం స్కూళ్ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నాం. విద్యాభివృద్ధిలో తల్లిదండ్రులను భాగస్వాములుగా చేసేందుకు జులై 5న రాష్ట్రవ్యాప్తంగా మెగా పేరెంట్స్ - టీచర్స్ మీట్ నిర్వహిస్తున్నాం. విద్యార్థుల పనితీరును వాట్సాప్ ద్వారా ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు తెలియజేస్తున్నాం. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనలో స్కూలు మేనేజ్ మెంట్ కమిటీలను భాగస్వాములను చేస్తున్నాం. విద్యారంగ అభివృద్ధికి సలహాల కోసం ప్రతివారం టీచర్స్ యూనియన్లు, ఉత్తమ ఉపాధ్యాయులతో సమావేశమవుతున్నాం' అని లోకేశ్ వివరించారు. జూలై 5న జరిగే మెగా పేరెంట్స్- టీచర్స్ మీట్ కార్యక్రమానికి హాజరుకావాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ఆహ్వానించారు. ఆగస్టులో విద్యాశాఖ మంత్రుల కాంక్లేవ్ ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్‌కు అవకాశం ఇవ్వాలని లోకేశ్ కోరగా అందుకు ధర్మేంద్ర ప్రధాన్ అంగీకరించారు.

## ప్రపంచ గ్రామీణాభివృద్ధి దినోత్సవ పోస్టర్‌ను విడుదల చేసిన ఆసియా-పసిఫిక్ సమాఖ్య గ్రామీణాభివృద్ధి కేంద్రం, జాతీయ గ్రామీణాభివృద్ధి మరియు పంచాయతీరాజ్ సంస్థ మరియు రూరల్ ఎకనామిక్ అండ్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ సొసైటీ





**హైదరాబాద్, వెలుతురు 18 జూన్ 2025:**

హైదరాబాద్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి మరియు పంచాయతీరాజ్ సంస్థ ప్రాంగణంలో, ఆసియా మరియు పసిఫిక్ ప్రాంతాల కోసం ఏర్పాటైన సమాఖ్య గ్రామీణాభివృద్ధి కేంద్రం, జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ, రూరల్ ఎకనామిక్ అండ్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ సొసైటీ కలిసి ప్రపంచ గ్రామీణాభివృద్ధి దినోత్సవ పోస్టర్‌ను విడుదల చేశాయి.

ఈ సందర్భంగా ముఖ్య అతిథి ప్రొఫెసర్ అనిల్ కె. గుప్తా మాట్లాడుతూ, ప్రస్తుత అభివృద్ధి మార్గంలో ఆదాయ అసమానతలు పెరిగిపోతున్నాయని, గ్రామీణ ఆవిష్కరణలు మరియు కొత్త వ్యవసాయ-ఆర్థిక వ్యాపారాలను ప్రోత్సహించడం ద్వారా ఈ అంతరాన్ని తగ్గించవచ్చని అన్నారు. పట్టణ స్టార్టప్‌లకు ఇచ్చే మద్దతు మాదిరిగానే గ్రామీణ స్టార్టప్‌లకు కూడా రిస్క్ పెట్టుబడులు అవసరమని చెప్పారు.

జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జి. నరేంద్ర కుమార్ మాట్లాడుతూ, గత దశాబ్దాలుగా గ్రామీణాభివృద్ధిపై అంతర్జాతీయ స్థాయిలో ఆసక్తి తగ్గినప్పటికీ, ఈ దినోత్సవం పట్ల శ్రద్ధ కలిగితే భారత్‌లో స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను స్థానికీకరించడానికి ఉపయుక్తమైన పాఠాలు నేర్చుకోవచ్చని తెలిపారు.

జూలై 6న జరగనున్న ప్రపంచ గ్రామీణాభివృద్ధి దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మద్దతుతో, రాజకీయ నాయకులు మరియు అధికారులు గ్రామీణ వర్గాల ప్రజలతో ముఖాముఖి చర్చలు జరుపుతున్నారని సమాఖ్య గ్రామీణాభివృద్ధి కేంద్రం డైరెక్టర్ జనరల్ డాక్టర్ పి. చంద్ర శేఖర తెలిపారు. సభ్యదేశాలన్నీ తమ దేశాల్లో సమగ్ర గ్రామీణాభివృద్ధికి ఉపకరించే కార్యక్రమాల ద్వారా ఈ దినోత్సవాన్ని జరుపుకోవాలని సూచించారు.

రూరల్ ఎకనామిక్ అండ్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ సొసైటీ గౌరవ కార్యదర్శి డాక్టర్ రవి రెడ్డి ఈ దినోత్సవం సందర్భంగా చేపట్టిన కార్యక్రమాల వివరాలను తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఇండోనేషియా, శ్రీలంక, మలేసియా, వియత్నాం, లావోస్ ప్రజాసత్తామ్య గణతంత్రం, మయన్మార్, థాయిలాండ్, ఫిజీ, ఫిలిప్పీన్స్, బంగ్లాదేశ్ మరియు భారతదేశం సహా 11 ఆసియా-పసిఫిక్ దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## గోదావరి వృధా జలాలను వాడుకోవాల్సిందే

ప్రాజెక్ట్ వల్ల తెలంగాణకు నష్టం జరగదని ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు చెబుతుండగా, గోదావరి జలాలను తరలించేందుకు కేసీఆర్ అప్పుడు ఒప్పుకున్నారని చెబుతున్నారు. ఈ విషయంపై స్పష్టత ఇవ్వాలనుకుంటున్నాను. కేసీఆర్ గోదావరి నీళ్లు సముద్రంలో వృథాగా పోకుండా వాడుకలోకి తేవాలని మాత్రమే అన్నాడు. కానీ, నదుల అనుసంధానం అంశానికి ఎప్పుడూ ఓకే చెప్పలేదు అని ఆమె వివరణ ఇచ్చారు. ఏపీ కోసం చంద్రబాబు పోరాటం చేస్తున్నారని చెబుతున్నారు. అలా అయితే మన సీఎం రేవంత్ రెడ్డి ఏం చేస్తున్నారు? చంద్రబాబుతో రేవంత్‌కు ఉన్న లాలూచీ ఏమిటి? అని ప్రశ్నించారు. నల్లమల టైగర్ అంటూ కాదు, పని చేసి చూపించండి 'రేవంత్ రెడ్డి నల్లమల టైగర్ అంటూ చెప్పుకుంటున్నారు. అది నిజమే అయితే బొల్లపల్లి రిజర్వాయర్ ప్రాజెక్ట్‌ను నిలిపివేయాలి. లేదంటే, మీరు కేవలం పేపర్ పులి అని ప్రజలకు తేటతెల్లం అవుతుంది,' అంటూ సెటైర్లు వేశారు. 'ఢిల్లీకి హాఫ్ సెంచరీ కొడుతున్నారు కానీ బీసీల కోసం అడగడంలేదు. బీసీ బిల్లు గురించి మోదీని అడగాలి,' అని స్పష్టం చేశారు. బీసీలకు రాజకీయం హక్కులు లభించేలా కేంద్రం వెంటనే బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ, జులై 17న రైలు రోకో నిర్వహిస్తామని ప్రకటించారు. ఢిల్లీకి వెళుతున్న సీఎం.. బీసీ బిల్లు పట్టుకుని తిరిగి హైదరాబాద్‌కు రావాలి అంటూ హెచ్చరించారు.

## ఫోన్ ట్యాపింగ్‌లో కొత్త విషయాలు

నెపంతో, పలువురు కీలక రాజకీయ నాయకుల ఫోన్‌లు ట్యాప్ చేసినట్లు వెల్లడవుతోంది. తాజాగా ఈ కేసులో 4200 మందికి పైగా వ్యక్తుల ఫోన్లు ట్యాప్ చేసినట్లు ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావుపై ఆరోపణలు వచ్చాయి. 2023 నవంబర్ 15 నుండి 30వ తేదీ మధ్యలోనే కనీసం 618 మంది నేతల ఫోన్లను ట్యాప్ చేశారట. ఇందులో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వైసీపీ నాయకులు కూడా ఉన్నారు. గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేశ్ రెడ్డి, కోటింరెడ్డి వినయ్ కుమార్ రెడ్డి వంటి నాయకుల ఫోన్లను కూడా ప్రభాకర్ రావు నేతృత్వంలోని బృందం ట్యాప్ చేసినట్లు సమాచారం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్‌తో పాటు కాంగ్రెస్, బీజేపీ సహా అనేక పార్టీల కీలక నేతలు, అనుచరుల ఫోన్లు కూడా ట్యాపింగ్ లక్ష్యంగా మారాయి. ఈ వ్యవహారంపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) వేగంగా దర్యాప్తు కొనసాగిస్తోంది. నిన్న ఒక్కరోజే తొమ్మిది మంది సాక్షుల స్టేట్‌మెంట్‌లు రికార్డు చేశారు. అందులో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, గద్వాల మాజీ జడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఆమె భర్త తిరుపతయ్య, గాంధీ భవన్‌కు చెందిన నలుగురు ఉద్యోగులు ఉన్నారు. ఇవన్నీ మొబైల్ సర్వీస్ ప్రొవైడర్లు ఇచ్చిన ఆధారాలతో వెలుగులోకి వచ్చాయి. ఈ రోజు పీసీసీ అధికార ప్రతినిధి జయపాల్ రెడ్డి సిట్ ముందు హాజరై స్టేట్‌మెంట్ ఇచ్చారు. అదే విధంగా ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్ రావును కూడా విచారించారు.

## ఏకశిలానగర్ లేఅవుట్‌ను పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్,జూన్18 వెలుతురు):**

మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా కొర్రెముల రెవెన్యూ పరిధిలోని ఏకశిలానగర్ లేఅవుట్‌ను హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. పైసా పైసా జమచేసి పిల్లల భవిష్యత్ కోసం ఇంటి స్థలాలు కొనుగోలు చేస్తే.. స్థిరాస్తి వ్యాపారి వెంకటేశ్ అనే వ్యక్తి కబ్జాలకు పాల్పడుతున్నారంటూ పలువురు కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన హైడ్రా కమిషనర్ ఏకశిలానగర్ లేఅవుట్‌ను పరిశీలించారు. ఇంటిస్థలం చుట్టూ ప్రహరీ నిర్మించుకున్నారని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నట్లు చెప్పారు. రెండ్రోజుల్లో ఇరువర్గాలతో భేటీ ఏర్పాటు చేసి తగిన చర్యలు తీసుకుంటామని రంగనాథ్ పేర్కొన్నారు.


# 83 శాతం తగ్గిన మావోయిస్టుల హింస

- ఈ మార్పు ప్రభుత్వ రణ నీతి , సుస్థిర పాలనా విధానాల ఫలితమే
- వచ్చే మార్చినాటికి "నక్సల్స్ రహిత భారత్"
- ఉగ్ర పోరులో ఎన్ఎస్జీ సేవలు భేష్...
- ఉగ్రవాదంపై ఖచ్చితమైన దాడులకు, హైజాక్ వ్యతిరేక ఆపరేషన్లకు కేరాఫ్ అడ్రస్
- పౌరుల రక్షణ, బాంబ్ నిర్వీర్యం, జాతీయ విపత్తు సహాయక చర్యల్లో ఎన్ఎస్జీ సేవలు అమూల్యం
- అంతర్గత భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నాం
- వికసిత్ భారత్ రాజకీయ నినాదం కాదు....140 కోట్ల భారతీయుల కల
- ఉగ్రవాదం, మత్తుపదార్థాల అక్రమ రవాణా
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడి
- హర్యానాలోని మానేసర్ లో ఎన్ఎస్జీ క్యాంపస్ కు విచ్చేసిన కేంద్ర మంత్రి
- ఎన్ఎస్జీ సిబ్బంది నివాస భవన సముదాయాల నిర్మాణానికి బండి సంజయ్ శంకుస్థాపన
- నూతనంగా నిర్మించిన స్టేడియం, స్విమ్మింగ్ పూల్ ప్రారంభం









**హర్యానా వెలుతురు జూన్ 18:**

2010తో పోలిస్తే వామపక్ష తీవ్రవాద హింస 83 శాతం మేరకు తగ్గిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. మోదీ ప్రభుత్వ రణ నీతి , సుస్థిర పాలన విధానాల ఫలితంగానే ఈ మార్పు వచ్చిందన్నారు. 2026 మార్చి నాటికి "నక్సల్స్-రహిత భారత్" (నక్సల్-ముక్త్ భారత్) లక్ష్యాన్ని సాధించేందుకు వంద శాతం పూర్తి నిబద్ధతతో ముందుకు సాగుతున్నామన్నారు. ఇది కేవలం ఒక సంకల్పమే కాదని, ఒక ఉద్యమంగా కొనసాగుతోందన్నారు. భారత్‌ను నక్సలిజం, టెర్రరిజం నుండి విముక్తి చేసి శాంతియుత, సుసంపన్న, అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు క్రుషి చేస్తున్నామన్నారు. 2047 నాటికి భారతదేశం "వికసిత భారత్" లక్ష్యాన్ని అధిగమించి విశ్వగురు స్థానంలో నిలవాలన్నదే మోదీ ప్రభుత్వ లక్ష్యమన్నారు.

బుధవారం రోజున హర్యానా రాష్ట్రంలోని మానేసర్ లోని నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ క్యాంపస్ కు విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ తొలుత శౌర్యస్థల్ వద్ద విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఎన్ఎస్జీ వీరులకు నివాళులు అర్పించారు. అనంతరం ఎన్ ఎస్జీ నివాస సముదాయాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. స్థానికంగా నిర్మించిన ఎన్ఎస్జీ స్టేడియాన్ని, స్విమ్మింగ్ పూల్ ను ప్రారంభించారు. ఎన్ఎస్జీ సిబ్బంది చేపట్టిన ఆపరేషనల్ డెమో ప్రదర్శనలను తిలకించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్ర మంత్రితోపాటు ఎన్ఎస్జీ డైరెక్టర్ జనరల్ బి.శ్రీనివాసన్, ఐజీలు దీపక్ కుమార్ కేడియా(హెడ్ క్వార్టర్స్), మేజర్ జనరల్ ప్రవీణ్ చాబ్రా(ఆపరేషన్స్), మేజర్ జనరల్ వికాస్ చౌదరి(ట్రైనింగ్), ప్రిన్సీ రాణి(ప్రొవిజనింగ్) తదితరులు పాల్గొన్నారు. అనంతరం బండి సంజయ్ మాట్లాడుతూ ఏమన్నారంటే...

నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (NSG ) పేరు వినగానే మన కళ్ల ముందు కనిపించేది బ్లాక్ క్యాట్ కమాండోలు వీరత్వమే. అంకితభావం, అసాధారణ నైపుణ్యాలకు ప్రతీక నేషనల్ సెక్యూరిటీ గార్డ్. ఎన్ఎస్జీ చూపిన ధైర్య సాహసాలు దేశమంతా ఎన్నోసార్లు గర్వపడేలా చేసింది. ఉగ్రవాదంపై ఖచ్చితమైన దాడులు, హైజాక్ వ్యతిరేక ఆపరేషన్ల ద్వారా పౌరుల రక్షణ, బాంబ్ నిర్వీర్య కార్యకలాపాలు, లేదా జాతీయ విపత్తుల సమయాల్లో చేపట్టే సహాయక చర్యల సమయంలో ఎన్ఎస్జీ అసాధారణ ప్రతిభను చాటుతోంది.

ఉగ్రవాద వ్యతిరేక పోరాటంలో ప్రపంచవ్యాప్తంగా జరిగిన ప్రయత్నాలకు సంపూర్ణ మద్దతు ఇవ్వడానికి మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉంది. శాంతియుత, సుసంస్కృత సమాజాన్ని నిర్మించేందుకు కంకణం కట్టుకుంది. ఇటీవల నిర్వహించిన ఆపరేషన్ సింధూర్ మన సక్సెస్ కు ప్రత్యక్ష ఉదాహరణ. పాకిస్తాన్ ప్రేరేపిత పహల్గాం ఉగ్రవాద దాడికి భారత్ ధీటైన జవాబిచ్చింది. మన సైన్యం పాకిస్తాన్ భూభాగంలోకి చొచ్చుకెళ్లి ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసింది. ఉగ్రవాదులను మట్టుపెట్టి వారి కుట్రలను కూలదోసింది.

మన శక్తి కేవలం ఆయుధాల్లోనో, టెక్నాలజీలోనే లేదు. మన జవాన్ల ధైర్యసాహసాలు, క్రమశిక్షణ, దేశభక్తిలో ఉంటుంది. ఎన్ఎస్జీ కమాండోల శిక్షణ, వారి మానసిక, శారీరక ధృఢత్వం, త్యాగపూరిత సేవాభావం మనందరికీ





ప్రేరణ.. ముంబై 26/11 దాడి నుండి ఇటీవలి ఉగ్రవాద చర్యల వరకు ప్రతి సందర్భంలోనూ భారత్ ఉగ్రవాదానికి గట్టి సమాధానమిస్తూ తన ప్రతిభను చాటుతున్న ఎన్ఎస్జీ కి హ్యాట్సాఫ్.

ప్రస్తుతం యుద్ధం కేవలం సరిహద్దుల్లోనే కాదు. సైబర్ స్పేస్‌లో, సమాచార రంగంలో, ఇంకా మన పట్టణాల మధ్యలో కూడా జరుగుతోంది. ఉగ్రవాదం, సైబర్ దాడులు, హైబ్రిడ్ వార్ వంటి కొత్త సవాళ్లు మనముందున్నాయి. ముందెన్నడూ లేనంతగా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఏర్పడింది. ఈ నేపథ్యంలో, ఎన్ఎస్జీ పాత్ర మరింత కీలకంగా మారింది. మీరు కేవలం మన దేశంలోని అంతర్గత భద్రతకు వెన్నెముక గానే కాకుండా, ఆధునిక యుద్ధాలలో ఉత్పన్నమయ్యే సంక్లిష్టతలను సైతం సమర్థంగా సమాధానం ఇచ్చే శక్తిగా నిలుస్తున్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా తీసుకున్న చర్యలు మన సైనికుల ఆత్మవిశ్వాసాన్ని ఎక్కడా తగ్గనివ్వలేదు.

భారతదేశం అనేక దశాబ్దాలుగా సరిహద్దు ఉగ్రవాదానికి బాధితురాలే. ఉగ్రదాడులతో ఎందరో అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఉగ్రవాదులు దాడి చేయాలనే ఆలోచన వస్తేనే వణుకుపుట్టేలా చేస్తున్నాం. ఉగ్రవాద నిర్మూలనలో రాజీ లేదు. దేశ భద్రత, గౌరవం ఇవే మాకు ప్రథమ ప్రాధాన్యత. నరేంద్రమోదీ ఆధ్వర్యంలో నవభారత్ నిర్మాణం కోసం అహర్నిశలు కేంద్రం క్రుషి చేస్తోంది.

ఎన్ని సవాళ్లు ఎదురైనా మన ఉక్కు సంకల్పం ముందు అవి నిలబడలేవు. మనవైపు కన్నెత్తి చూసే వాళ్లు, ఇకపై మళ్లీ చూసే పరిస్థితిలో ఉండరనే సంకేతాలను "ఆపరేషన్ సింధూర్" ద్వారా శత్రుదేశాలకు సమర్థవంతంగా పంపించగలిగాం. దేశ ప్రజల భద్రత కోసం అవసరమైన ప్రతీ అడుగును తీసుకుంటుందన్న స్పష్టమైన సందేశం ఇచ్చాం. సశస్త్ర దళాల శ్రేష్ఠత, అంకితభావానికి ఆపరేషన్ సింధూర్ నిదర్శనం. ప్రధానమంత్రి, హోం మంత్రి ఆదేశాల మేరకు అంతర్గత భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో ముందడుగు వేశాం. ఆధునిక ఆయుధాల వినియోగం మొదలుకొని, రహస్య దర్యాప్తు సంస్థల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం వరకూ అనేక ఏజెన్సీల సహకారంతో ఒక సమగ్ర వ్యవస్థను సిద్ధం చేశాం.

మోదీ ప్రభుత్వం రక్షణ, భద్రతా రంగాలలో ఆత్మనిర్భరతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోంది. అందుకే 2025వ సంవత్సరాన్ని 'రక్షణ సంస్కరణల సంవత్సరం'గా ప్రకటించినం. తద్వారా సశస్త్ర దళాలను సాంకేతికంగా అభివృద్ధి చేయడంతోపాటు యుద్ధానికి సన్నద్ధంగా తయారుచేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఎన్ఎస్జీ దళాలను కూడా కృత్రిమ మేధస్సు (AI), డ్రోన్ టెక్నాలజీ, ఆధునిక ఆయుధ వ్యవస్థలతో సమృద్ధిగా అనుసంధానిస్తున్నాం దీనివల్ల వారు ఏ పరిస్థితిలోనైనా మరింత సమర్థవంతంగా స్పందించగలుగుతారు. ఆత్మనిర్భరత ఒక ఎంపిక కాదు, ఈ కాలానికి అత్యవసరం కూడా. నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ ఆత్మనిర్భరత వైపు దృఢంగా అడుగులు వేస్తోంది. ఈ ప్రయాణంలో మన కేంద్ర ఆర్మ్‌డ్ పోలీస్ బలగాలు కూడా కీలక పాత్ర పోషిస్తున్నాయి. మా లక్ష్యం దేశాన్ని రక్షించడం మాత్రమే కాదు ు మన జవాన్లు, వారి కుటుంబాలకు మెరుగైన భద్రత, గౌరవనీయమైన జీవితం గడిపేలా చూడడం కూడా. ఎన్ఎస్జీతోపాటు భద్రతా బలగాలకు కేంద్రం అన్ని విధాలా అండగా ఉంటుంది. వారి సంక్షేమం కోసం, వారి కుటుంబాల భవిష్యత్తు కోసం, భద్రమైన భారతదేశ నిర్మాణం కోసం పనిచేస్తోంది. అందులో భాగంగానే ఈ రోజు మానేసర్‌లోని ఎన్ఎస్జీ సిబ్బందికి మెరుగైన సౌకర్యాలు కల్పనకోసం వివిధ అభివ్రుద్ధి పనులు చేపడుతున్నాం. ఇప్పటికే ఎన్ఎస్జీ ప్రాంగణంలో ప్రపంచ స్థాయి సదుపాయాలు ఉన్నాయి. దీనిని మరింత అభివృద్ధి చేయడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

ప్రధాని నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో, భారత ప్రభుత్వం వామపక్ష ఉగ్రవాదం (Left Wing Extremism) వంటి తీవ్రమైన సమస్యను మూలాలతో సహా నిర్మూలించేందుకు వేగంగా ముందుకు పోతోంది. 2010తో పోలిస్తే వామపక్ష తీవ్రవాద హింస 83 శాతం తగ్గింది. హింసలో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్యలో 85 శాతం తగ్గుదల నమోదైంది. ఈ మార్పు అనేది ప్రభుత్వ రణ నీతి , సుస్థిర పాలన విధానాల ఫలితం. 2026 మార్చి నాటికి "నక్సల్స్-రహిత భారత్" (నక్సల్-ముక్త్ భారత్) లక్ష్యాన్ని సాధించేందుకు వంద శాతం పూర్తి నిబద్ధతతో ముందుకు సాగుతున్నాం. ఇది కేవలం ఒక సంకల్పం కాదు. ఇది ఒక ఉద్యమం. భారత్‌ను నక్సలిజం, టెర్రరిజం నుండి విముక్తి చేసి శాంతియుత, సుసంపన్న, అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే ఉద్యమం. 2047 నాటికి భారతదేశం "వికసిత భారత్" లక్ష్యాన్ని అధిగమించి విశ్వగురు స్థానంలో నిలవాలన్నదే ప్రభుత్వ లక్ష్యం.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో భారత్ ఆశాజనక పురోగతిని సాధించింది. మనం అభివృద్ధి చెందుతున్న దేశం అనే దృక్పథం నుండి బయట పడి వికసిత దేశంపైపు అడుగులు వేస్తోంది. "వికసిత భారత్ 2047" కేవలం ఒక రాజకీయ నినాదం కాదు. ఇది 143 కోట్ల భారతీయుల కలల సంగమం, వారి ఆకాంక్ష. వికసిత భారత్ కేవలం ఆర్థికంగా మాత్రమే శక్తివంతంగా ఉండడమే కాకుండా అక్కడ ఉగ్రవాదం, మత్తుపదార్థాల అక్రమ రవాణా, గందరగోళానికి చోటు ఉండదు. 2047 నాటికి భారతదేశం ఒక సురక్షితమైన, శక్తివంతమైన, సమ్మిళిత దేశంగా మారడం తథ్యం.

"రండి...మనమందరం కలిసికట్టుగా ఒక కొత్త భారత్‌ను నిర్మిద్దాం. దేశం సాంకేతికంగా, ఆర్థికంగా శక్తిమంతంగా ఉండటమే కాదు. నైతికతలోను, సాంస్కృతికంగా కూడా ప్రపంచానికి మార్గనిర్దేశం చేసే చర్యల్లో అందరం భాగస్వాములు కావాలని ఆకాంక్షిస్తున్నా.





# వెలుతురు ఎడిటోరియల్

https://epaper.velthuru.com


# సంపాదకీయం..

## ఆపరేషన్ కగార్‌దే పైచేయి !

ఆపరేషన్ కగార్‌కు నిరసనగా ఇందిరాపార్కు వద్ద అఖిల పక్షాలు మహాధర్నా చేపట్టాయి. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను ఎత్తివేయాలని పలువురు ఈ మహాధర్నాలో డిమాండ్ చేశారు. వెంటనే మావోయిస్టులతో శాంతి చర్చలు ప్రారంభించాలని కోరారు. ఈ ధర్నాలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, తమ్మినేని వీరభద్రం, నారాయణమూర్తి, ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ ధర్నా జరిగి 24 గంటలు కూడా గడవక ముందే మరో భారీ ఎన్‌కౌంటర్ జరిగి అగ్రనేతలు ముగ్గురు నేలకొరిగారు. ఈ ఎన్‌కౌంటర్‌తో జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని వెలిశాల ఉలిక్కిపడింది. నాడు విప్లవ ఉద్యమానికి ఊతమిచ్చిన వెలిశాల.. నేడు శోకసంద్రంలో మునిగింది. ఇదే గ్రామానికి చెందిన మావోయిస్ట్ పార్టీ అగ్రనేత గాజర్ల రవి అలియాస్ ఉదయ్, ఆంధ్రప్రదేశ్ లోని అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్ లో మృతిచెందారు. నాలుగు దశాబ్దాల క్రితం పీపుల్స్ వార్ ఉద్యమంలోకి వెళ్లిన గాజర్ల రవి అంచెలంచెలుగా ఎదిగారు. దళ సభ్యుడి స్థాయి నుంచి కేంద్ర కమిటీ స్థాయికి ఎదిగారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వంతో మావోయిస్టులు జరిపిన శాంతి చర్చల్లో ప్రతినిధిగా ఉన్నారు. గాజర్ల రవిపై 25 లక్షల రివార్డు ఉంది. మొత్తంగా అగ్రనేతలు అంతా హతమవుతన్నారు. కేంద్రం ఏదైతే కోరుకుంటందో అదే జరుగుతోంది. నిజానికి పీపుల్స్ వార్ రాకతోనే గ్రామాల్లో పెత్తందారీ వ్యవస్థ అంతరించింది. దొరల సామ్రాజ్యానికి చెక్ పడింది. గడీల పాలన అంతమొందింది. ఊర్లో భూస్వాముల అఘాయిత్యాలు ఆగాయి. రాజకీయ నేతల దూకుడు తగ్గింది. ఏదైనా పనిచేయాలంటే రాజకీయ నాయకులు భయపడేవారు. కానీ ఇప్పుడు రాజకీయ నాయకుల పెత్తనం పెరిగింది. భయమన్నది లేకండా పోయింది. అఇకారంలోకి వచ్చి భూములను కబ్జా చేస్తున్నారు. అప్పనంగా అమ్ముకుంటున్నారు. తప్పుడు పనులు చేసే రాజకీయ నాయకులకు, బూకబ్జాదారులకు పీపుల్స్ వార్ హయాలో భయం ఉండేది. కానీ ఇప్పుడా పరిస్థితి లేకుండా పోయింది. ఎందుకంటే దళాలను చుట్టుముట్టి మట్టుబెడుతున్న కారణంగా మావోలు అంతరించి పోతున్నారు. ముఖ్యంగా మావోలను అంతమొందించాలని కేంద్రం కంకణం కట్టుకుంది. ఈ సమయంలో ఇక చర్చలకు తావు లేదన్న విధంగా కేంద్రం మొండిగా ఉంది. మావోలపైనే ఎందుకనో దూకుడుగా వ్యవహరిస్తోంది. కాశ్మీర్‌లో ఉగ్రవాదుల ఏరివేత కానీ, మణిపూర్‌లో అల్లర్లు అణచివేయడంలో కానీ ఇంత దూకుడు కనిపించడం లేదు. అందుకే ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధంగా కేంద్రం వ్యవహరి స్తోందని మహాధర్నాలు పలువురు నేతలు విమర్శించారు. ఆపరేషన్ కగార్‌లో ఎక్కువ మంది ఆదివాసీలే చనిపోతున్నారని కూడా ఆందోళన వ్యక్తం చేశారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి శాంతియుత చర్చలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ తమ పార్టీ దృష్టిలో ఆపరేషన్ కార్పొరేట్ కబ్జా అని.. మానవత్వానికి ఇది ఒక మచ్చ అని పలువురు విమర్శించారు. అణచివేయాల్సింది మావోయిస్టులను కాదు.. దోపిడీనని ఈ ధర్నాలో పాల్గొన్న వారు గళమెత్తారు. మావోయిస్టులను చంపడం కాదు.. జల్, జంగిల్, జమీన్ నినాదానికి పరిష్కారం చూపించాలని కోరారు. ఆదివాసీ, పౌర సంఘాలతో భారత రాజ్యాంగం ఆధారంగా చర్చలు జరపాలన్నారు. శాంతి చర్చలు జరపకపోవడం వల్లే ఆదివాసీ ప్రాంతాల్లో అల్లకల్లోలం నెలకొందని చెప్పారు. 'మావోయిస్టులతో చర్చలు జరపాలని మేం అంటే.. మమ్మల్ని మావోయిస్టులు అంటున్నారు. మేం మావోయిస్టులు అయితే మైకులు ఎందుకు పట్టుకుంటాం.. తుపాకులు పట్టుకునే వాళ్లం'అని కూడా అన్నారు. ప్రజాస్వామ్యంలో ఏ సమస్య నైనా చర్చల ద్వారా పరిష్కారం చేసుకోవచ్చని రాజ్యాంగం చెబుతోందని ,నక్సలైట్లు చర్చలకు సిద్ధంగా ఉంటే..ప్రభుత్వం చర్చలు జరపాలని కోరారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో మావోయిస్టులతో చర్చలు జరిపారని, మోదీ ప్రభుత్వం మాత్రం మావోలతో చర్చలకు సిద్ధంగా ఉన్నా చంపేస్తోందని విమర్శించారు. మావోయిస్టులను చంపడం తాత్కాలిక ఉపశమన మేనని శాశ్వత పరిష్కారం కాదని గుర్తు చేశారు. శాంతిచర్చలు జరిపితే పరిష్కారం దొరుకుతుందని మోదీ, అమిత్‌షా గ్రహించాలని చెప్పారు. అడవుల్లోని ఖనిజ సంపదను అంబానీ,అదానీలకు దోచిపెట్టేందుకే అమిత్ షా ..నక్సలైట్ రహిత దేశంగా చేస్తామంటున్నారని కూడా విమర్శలు గుప్పించారు. పాకిస్తాన్ తో చర్చలు జరిపిన కేంద్రం.. భరత మాత ముద్దు బిడ్డలైన మావోయిస్టులతో ఎందుకు చర్చలు జరపడం లేదని ప్రశ్నించారు. అన్యాయాన్ని అడిగిన వాడు నక్సలైట్.. అడగని వాడు ఆల్ రైట్ అనే ఉద్దేశంతో కేంద్రం వ్యవహరిస్తుందని విమర్శించారు. అణిచివేయాల్సింది మావోయిస్టులను కాదు దోపిడీని అని అన్నారు. మావోలతో చర్చలు జరపకున్నా సరే... ఆదివాసీ సంఘాలతో చర్చలు జరపాలని సూచించారు. భారత రాజ్యాంగం ఆధారంగా చర్చలు జరపండి. దేశంలోని సహజ వనరులను ప్రజల అభివృద్ధి కోసమే వాడాలని రాజ్యాంగంలో తెలిపిందన్నారు. చర్చలు జరిపితే ఆదివాసీ ప్రాంతాల్లో అల్లకల్లోలం ఆగుతుందన్నారు. చర్చలు జరగకుంటే మావోయిస్టులకు ఇబ్బంది లేదు... ప్రభుత్వానికి ఇబ్బంది లేదు. కానీ ఆదివాసీ బిడ్డలకు కష్టం వస్తుంది.. వారి హక్కుల భంగం కలుగుతుందని హెచ్చరించారు. కార్పొరేట్ సంస్థలకు అటవీ సంపదను కట్టబెట్టే కుట్రలో భాగంగానే ఆదివాసీలపై కేంద్రం యుద్ధం చేస్తుందన్నారు. అడవిలోకి కేంద్రం ఎందుకు వెళ్తోంది. ఆపరేషన్ కగార్ ప్రైవేట్ సంస్థల కోసమే అని విమర్శించారు. మొత్తంగా ఇప్పుడు కేంద్రం అనుకున్న విధంగా మావోలు అంతమొందించే ప్రక్రియ తుదిదశకు చేరుకుంది. అయితే దోపిడీ ఉన్నంతకాలం పోరాటం ఉంటుంది. రాజకీయ దోపిడీ ఉంటే తిరుగుబాటు తప్పదని చరిత్ర రుజువు చేసింది. రాజకీయ దోపిడీని అరికట్టాలి. జబ్బుకు చికిత్స చేయడం కన్నా అసలు జబ్బులే రాకుండా నిరోధించ గలగడం ముఖ్యమని వైద్యశాస్త్రంలో చెబుతారు. అందుకోసం కృషి చేయడం మంచిది. సమాజంలో ఉత్పన్నమయ్యే అశాంతికి, ఇతర సమస్యలకు పరిష్కారం చూపకుండా కేవలం మావోలను అణచివేస్తే సమస్య సమిసి పోదని గుర్తించాలి. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోకుండా, ప్రజలు అసంతృప్తితో చేసే ఆందోళనలపై ప్రభుత్వం తమ బలాన్ని, బలగాలను ప్రయోగించడం వల్ల లాభం లేదు. ఉద్యమాలను, ఆందోళనలను ప్రతిష్ఠగా తీసుకొని ఎంత గొప్పగా వాటిని అణచివేశామో చెప్పుకోవడం సరికాదు. మార్చి 31 వరకు సంపూర్ణంగా నక్సలిజాన్ని నిర్మూలిస్తామని అమిత్ షా పేర్కొన్నారు. మావోయిస్టు పార్టీ ప్రస్తుతం ఎక్కడైతే కేంద్రీకరించి పని చేస్తుందో ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి వారిని మట్టుపెడుతున్న తీరుతో వారు అంతమొందడం ఖాయం కానీ...ప్రజల్లో గూడుకట్టుకున్న ఆందోళనలను మాత్రం అణచివేయడం సాధ్యం కాదని గుర్తించాలి.

# ఇరాన్ అనుమూలాలాలు లక్ష్యంగా దాడులు

## సెంట్రిఫ్యూజ్‌ల తయారీ కేంద్రంపై ఫైటర్ జెట్లు దాడి

**న్యూఢిల్లీ,జూన్ 18( వెలుతురు):**
ఇరాన్ అణుమూలాలాలను దెబ్బతీయడమే లక్ష్యంగా ఇజ్రాయిల్ దాడులు సాగిస్తోంది. ఇప్పటికే ఈ విషయం ఇజ్రాయిల్ స్పష్టం చేసింది. ఇరాన్ నుంచి ఎన్ని ఎదురుదెబ్బలు తగిలినా.. దాని అణు కార్యక్రమాన్ని దెబ్బతీసేంతవరకు ఇజ్రాయెల్ ఆగేటట్లు లేదు. తాజాగా టెహ్రాన్ అణు కార్యక్రమానికి అత్యంత కీలక పరికరమైన సెంట్రిఫ్యూజ్‌ల తయారీకేంద్రంపై ఐడీఎఫ్ ఫైటర్ జెట్లు దాడి చేశాయి. ఆ దేశ రాజధాని సమీపంలోని ఈ కేంద్రంపై దాదాపు 50 యుద్ధ విమానాలు ఏకకాలంలో విరుచుకుపడ్డట్లు ఐడీఎఫ్ వెల్లడించింది. దీంతోపాటు చాలా ఆయుధ తయారీ కేంద్రాలను కూడా ధ్వంసం చేసినట్లు వెల్లడించింది. అణుబాంబుల తయారీలో సెంట్రిఫ్యూజ్‌లు కీలక పాత్ర పోషిస్తాయి. వాస్తవానికి అణుబాంబులో యురేనియం 238ను ప్రాసెస్ చేసి వెలికితీసిన యూరేనియం 235 మూలకాన్ని వినియోగిస్తారు. ఇందుకోసం సెంట్రిఫ్యూజ్ అనే పరికరాన్ని వాడతారు. యురేనియం 238 కొన్ని రసాయనిక



చర్యలతో.. యురేనియం హెక్సాఎ÷–లోరైడ్ గ్యాస్‌గా మారుస్తారు. దీనిని సెంట్రిఫ్యూజులోకి పంపించి ప్రాసెస్ చేస్తారు. ఈ క్రమంలో అవి దాదాపు 50,000 ఆర్పీఎంకు పైబడిన వేగంతో తిరిగి భారంగా ఉండే యురేనియం 238కి దూరంగా చేరతాయి. ఇక యురేనియం 235 మూలకాలన్నీ మధ్యభాగానికి చేరతాయి. ఇలా పదేపదే చేసి అణుబాంబుకు యురేనియం సేకరిస్తారు. ఇజ్రాయెల్ దళాలు ఇప్పటికే చేసిన వైమానిక దాడుల్లో ఇరాన్‌లోని అతిపెద్ద అణుకేంద్రమైన నతాంజ్ తీవ్రంగా దెబ్బతిన్నట్లు అంతర్జాతీయ అణుశక్తి సంస్థ నిన్న రాత్రి ధ్రువీకరించింది. దీంతో ఆ సంస్థ ప్రాథమిక అంచనాలను సవరించిన్లటైంది. గతంలో ఈ సంస్థ అధిపతి గ్రోసి స్పందిస్తూ.. ఈ కేంద్రం అండర్‌గ్రౌండ్ నిర్మాణాలకు పెద్దగా నష్టం లేదని పేర్కొన్నారు. కానీ, ఆ తర్వాత అంచనాలను మార్చుకోవాల్సి వచ్చింది. ఉపగ్రహాల నుంచి సేకరించిన హైరిజల్యూషన్ చిత్రాలను విశ్లేషించిన తర్వాత ఈ నిర్ణయానికి వచ్చారు. న్యూక్లియర్ థ్రెట్ ఇనీషియేటివ్ కథనం ప్రకారం ఈ కేంద్రంలో సుమారు 50,000కు పైగా సెంట్రి ఫ్యూజ్‌లను అమర్చే అవకాశం ఉంది. ప్రస్తుతం దీనిలో 14,000కు పైగా అమర్చారు. వాటిల్లో చాలావరకు ఈ దాడిలో దెబ్బతిని ఉండొచ్చని అంచనా.

# హిందీ బోధన తప్పనిసరి కాదు

- మరో భాషను ఎంచుకునే అవకాశం ఉంది
- హిందీపై వెనక్కి తగ్గిన మహారాష్ట్ర ప్రభుత్వం



**ముంబై,జూన్ 18( వెలుతురు)::**
ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి చదివే పిల్లలందరికీ హిందీ విధిగా బోధించాలని ఇటీవల మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై తాజాగా రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. వ్యతిరేకత రావడంతోనే వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. అయితే తప్పనిసరి అనే పదాన్ని నోటిఫికేషన్ నుంచి తొలగించింది. ప్రభుత్వ నిర్ణయంపై వ్యతిరేకత వ్యక్తమైన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. బుధవారం మహారాష్ట్ర పాఠశాలల విద్యాశాఖ ఓ ప్రకటనను విడుదల చేసింది. అందులో 'తప్పనిసరి' అనే పదాన్ని తొలగించింది. హిందీకి బదులు మరో భాషను ఎంచుకునే అవకాశం విద్యార్థులకు కల్పించింది. అయితే, ఆ భాష నేర్చుకోవాల నుకునే తరగతిలో కనీసం 20 మంది విద్యార్థులు తప్పనిసరిగా ఉండాలని పేర్కొంది. అప్పుడే ఆ సబ్జెక్టు పాఠశాలలో అందుబాటులో ఉంటుందని స్పష్టం చేసింది. ఆ భాషకు సంబంధించిన ఉపాధ్యాయుడి నియామకం కుదరకపోతే ఆన్‌లైన్ ద్వారా తరగతులు జరుగుతాయని వెల్లడించింది. జాతీయ విద్యా విధానంలో భాగమైన త్రిభాషా సూత్రంలో భాగంగా దేశవ్యాప్తంగా విద్యార్థులు హిందీ, ఇంగ్లీషు, ఒక స్థానిక భాషను నేర్చుకోవాలని కేంద్రం పేర్కొంది. ఈ విధానాన్ని తమిళనాడు ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ద్విభాషా సూత్రానికే కట్టుబడి ఉంటామని, హిందీని బలవంతంగా రుద్దితే ఊరుకోబోమని డీఎంకే స్పష్టం చేస్తోంది. ఈ క్రమంలోనే హిందీని తప్పనిసరి చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది. దీనిపై 'మహారాష్ట్ర నవ నిర్మాణ్ సేన' అధ్యక్షుడు రాజ్ ఠాక్రేతో పాటు ఉద్ధవ్ ఠాక్రే నుంచి కూడా తీవ్రంగా వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ క్రమంలో దీనిపై పోరాడేందుకు ఠాక్రేలు ఏకం కానున్నారనే చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది.

# డిఎన్ఏ పరీక్షలతో మృతుల గుర్తింపు

- గుర్తించిన వారి మృతదేహాల అప్పగింత




**అహ్మదాబాద్,జూన్ 18( వెలుతురు):**
అహ్మదాబాద్‌లోప్రమాదానికి గురైన ఎయిరిండియా బోయింగ్ విమాన మృతుల గుర్తింపు ప్రక్రియ కొలిక్కి వచ్చింది. డిఎన్ఏ టెస్టుల ద్వారా గుర్తించిన వారి శరీరీ భాగాలను వారి కుటుంబాలకు అప్పగించారు. విపరీతమైన వేడిలో కాలిన శరీరాలను డెన్ఏ ద్వారా గుర్తించడం కష్టసాధ్యం గా మారినా చివరకు ప్రక్రియను ముగించారు. ప్రమాదం వాటిల్లిన ఐదు రోజుల తర్వాత 163 మృతదేహాల గుర్తింపు పక్రియ పూర్తయింది. దీనికోసం డీఎన్ఏ పరీక్షలపై ఆధారపడిన విషయం తెలిసిందే. 124 భౌతికకాయాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. విమానంలో ఉన్న 242 మందిలో ఒక్కరు మినహా అందరూ, బయట మరో 29 మంది ఈ ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఎయిరిండియా పైలట్ సుమిత్ సభర్వాల్‌కు మంగవారం ముంబయిలో అంత్యక్రియలు నిర్వహించారు. 35 ఏళ్లుగా పనిచేస్తూ ఎంతోమందిని ఆయన తీర్చిదిద్దారని సహచరులు చెమర్చిన కళ్లతో గుర్తుచేసుకున్నారు. మృతిచెందిన సిబ్బందిలో మరికొందరి అంత్యక్రియలు కూడా పూర్తయ్యాయి. ప్రమాదంపై విచారణ చేపట్టిన బృందం మూడు నెలల్లో నివేదిక సమర్పించనుందని పౌరవిమానయాన శాఖ సహాయమంత్రి మురళీధర్ మొహోల్ తెలిపారు. ఎయిరిండియా వద్దనున్న 34 బోయింగ్-787 డ్రీమ్‌లైనర్ విమానాల్లో 12 వాటికి తనిఖీలు పూర్తయ్యాయని, వాటిలో ఎలాంటి లోపాలు బయటపడలేదని పుణెలో విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ నెల 12న బీజే వైద్య కళాశాల హాస్టల్ భవనంపై విమానం కుప్పకూలి, మంటలు చెలరేగడంతో.. అందులోని విద్యార్థులు భయాందోళనకు గురికావడంపై మరో వీడియోలో వెలుగులోకి వచ్చింది. ప్రాణాలు కాపాడుకునేందుకు కొందరు విద్యార్థులు రెండు, మూడు అంతస్తుల్లోని బాల్కనీల నుంచి బెడ్‌షీట్లు, తాళ్ల సాయంతో కిందికి దూకడం అందులో కనిపించింది. భవనానికి ఒకవైపు భారీగా మంటలు చెలరేగగా.. మరోవైపు నుంచి వీరు కిందికి దూకుతున్నట్లు వీడియోలో ఉంది. ప్రమాద బాధితులకు అవసరమైన న్యాయసాయం అందించడానికి గుజరాత్ రాష్ట్ర న్యాయసేవల సంస్థ ముందుకు వచ్చింది. మానసిక చికిత్స అవసరమైనా తగిన ఏర్పాట్లు చేస్తామని తెలిపింది.

## బనకచర్లతో వచ్చే నష్టమేమిటో

- ఉత్తమ్‌కు ఎంపి అర్వింద్ సూటిప్రశ్న

**హైదరాబాద్,జూన్ 18( వెలుతురు):**
బనకచర్లతో తెలంగాణకు జరిగే అన్యాయమేంటో చెప్పమంటే మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దగ్గర సమాధానం లేదని భాజపా ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. డైవర్షన్ రాజకీయాల కోసం ఆయన పవర్‌పాయింట్ ప్రజంటేషన్ కార్యక్రమం పెట్టారని విమర్శించారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'భాజపా భరోసా కార్యక్రమంలో భాగంగా వినతిపత్రాలను స్వీకరించాం. అనేక మంది దివ్యాంగులు వచ్చి తమ సమస్యలు తెలిపారు. వారికి ఇచ్చిన హామీలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదు. ప్రతి ప్లలెలో కాంగ్రెస్ ఇమేజ్ భూస్థాపితం అయింది. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సగం కాంగ్రెస్.. సగం భారాస. కేసీఆర్ డైరెక్షన్‌లో తెలంగాణ సెంటిమెంట్‌ను రెచ్చగొట్టేందుకు ఆయన చేస్తున్న పని పవర్ పాయింట్ ప్రజంటేషన్. స్థానిక సంస్థల ఎన్నికల కోసమే నాటకాలాడుతున్నారు. భాజపాపై బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారు. నన్ను సిట్ పిలవలేదు. మహేశ్‌కుమార్ గౌడ్ ఫోన్ ఎందుకు ట్యాపింగ్ చేశారో అర్థం కావడం లేదని అర్వింద్ వ్యాఖ్యానించారు.



# మావోలకు మరో ఎదురుదెబ్బ

- రంపచోడవరం ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మృతి
- మృతుల్లో అరుణ,గాజర్ల రవి, అంజు ఉన్నట్లు గుర్తింపు



**రంపచోడవరం,జూన్ 18( వెలుతురు):**
మావోయిస్టులకు మరో భారీ ఎదరుదెబ్బ తగిలింది. మరో అగ్రనేత హతమయ్యాడు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎదురుకాల్పులు జరిగాయి. దేవీపట్నం మండలం కొండమొదలు అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టు కీలక నేతలు మృతిచెందారు. వీరిలో ఇటీవల మృతిచెందిన మావోయిస్టు అగ్రనేత చలపతిరావు భార్య, స్పెషల్ జోన్ కమిటీ సభ్యురాలు అరుణతో పాటు కేంద్ర కమిటీ సభ్యుడుయ గాజర్ల రవి అలియాస్ ఉదయ్, ఏవోబీ స్పెషల్ జోన్ కమిటీ ఏసీఎం అంజు ఉన్నట్లు గుర్తించారు. ఘటనాస్థలంలో మూడు ఏకే 47 రైఫిల్స్‌ను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. 2018లో డుంబ్రిగుడ సమీపంలో జరిగిన ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సివేరి సోమ హత్య కేసులో అరుణ నిందితురాలిగా ఉన్నారు. ఆమె స్వస్థలం విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలం కరకవానిపాలెం. ఉదయ్‌పై రూ.25లక్షలు, అరుణపై రూ.20లక్షల రివార్డు ఉంది. మావోయిస్టుల మృతదేహాలను రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తీసుకురానున్నారు. కాల్పులు జరిగిన ప్రాంతానికి మారేడుమిల్లి సీఐ, దేవీపట్నం ఎస్సై, పోలీసు సిబ్బంది బయల్దేరారు.

# ఇక ఫాస్టాగ్ పాస్‌లు రానున్నాయి

- 3వేల పాస్‌తో 200 ట్రిప్పులు ఫ్రీ
- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రకటన




**న్యూఢిల్లీ,జూన్ 18( వెలుతురు):**
ఫాస్టాగ్ యూజర్లకు కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. కేవలం రూ. 3వేలు రీచార్జ్‌తో ఫాస్టాగ్ వార్షిక పాస్ అందుబాటులోకి తెస్తున్నట్లు ప్రకటించింది. ఈ పాస్ తీసుకుంటే 200 ట్రిప్పుల వరకు ప్రయాణించే అవకాశం ఉన్నట్లు ఈ మేరకు కేంద్ర మంత్రి గడ్కరీ ఒక ప్రకటన విడుదల చేశారు. ఏడాదికి రూ. 3వేలు రీచార్జ్ చేసుకుని దేశంలో ఎక్కడైనా తిరిగే అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అగష్టు 15 నుంచి ఈ విధానాన్ని అమలులోకి తీసుకువస్తున్నట్లు గడ్కరీ ప్రకటించారు. ఇక ఈ పాస్ దేశవ్యాప్తంగా ఏ రహదారిపైన ప్రయాణించినా చెల్లుబాటు అవుతుంది. దేశంలో జాతీయ రహదారులపై నిర్బంధ రహిత ప్రయాణాన్ని లక్ష్యంగా పెట్టుకుని, ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్‌ను ప్రవేశపెడుతున్నట్లు కేంద్ర మంత్రి ప్రకటించారు. వాణిజ్యేతర, వ్యక్తిగత వాహనాలకు ఈ అవకాశం కల్పిస్తున్నట్లు ఎక్స్ లో పేర్కొన్నారు. ఫాస్ట్‌ట్యాగ్ అనేది ఒక చిన్న ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్ సిస్టమ్. ఇది రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ సాంకేతికతను ఉపయోగించి వాహనాల టోల్ రుసుములను ఆటోమేటిక్‌గా చెల్లించడానికి వీలు కల్పిస్తుంది. దీనిని వాహనం విండ్‌స్క్రీన్‌పై అటాచ్ చేసుకుంటారు. టోల్ ఎ÷–లాజాల వద్ద ఎక్కువ సేపు ఆగకుండా టోల్ చెల్లించడానికి అనుమతిస్తుంది. అయితే, ఈ ఇయర్ పాస్‌తో టోల్ ఎ÷–లాజాల వద్ద వేచి ఉండే సమయం తగ్గిపోతుంది. దీంతో ప్రయాణం మరింత సులభతరం అవుతుంది. అంతేకాకుండా ఆర్థికంగా కూడా ప్రయోజనకరంగా ఉంటుంది.

## ప్రైవేట్ జూనియర్ కాలేజీల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి

- రాష్ట్ర ప్రభుత్వమే ఇంటర్ కాలేజీ ఫీజులను నిర్ణయించాలి.
- బీసీ నేత జాజుల లింగంగౌడ్



**హైదరాబాద్ వెలుతురు జూన్ 18:** ప్రైవేట్ జూనియర్ కాలేజీలు ఇష్టారీతిన ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులను అడ్డగోలుగా దోచుకుంటున్నాయని, రాష్ట్ర ప్రభుత్వమే ఇంటర్ కాలేజీల ఫీజులను నిర్ణయించాలని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలేజీల్లో ఫీజులు 60 శాతం కడితేనే విద్యార్థులకు ఐడి వస్తుందని చెప్పి కనీస వాయిదాలలో చెల్లించే అవకాశం ఇవ్వకుండా తల్లిదండ్రులను బెదిరింపులకు గురిచేస్తున్నారని,ఒక్క కాలేజీకి మాత్రమే అనుమతి తీసుకుని పది కాలేజీ లు నడుపుతున్న ఇంటర్మీడియట్ అధికారులు నిద్ర మత్తులో ఉండి పట్టించుకోవడం లేదన్నారు.రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ జూనియర్ కాలేజీ లు షాపింగ్ కాంప్లెక్స్ లో నడుస్తున్నాయని ఒక్కరికి అగ్నిమాపక శాఖకు సంబంధించిన పర్మిషన్లు ఉండవు.కానీ ఇంటర్మీడియట్ అధికారులు నిబంధనలు ఉల్లంఘించి ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు ఇంటర్మీడియట్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలని లింగంగౌడ్ ఇంటర్మీడియట్ బోర్డ్ కార్యదర్శి కృష్ణ ఆదిత్య గారికి విజ్ఞప్తి చేశారు.

## పాఠశాల విద్యాభివృద్ధి సామాజిక బాధ్యత

- ఎమ్మెల్యే కాలె యాదయ్య







**శంకర్ పల్లి వెలుతురు జూన్ 18**

శంకర్ పల్లి పట్టణంలోని మోడల్ పాఠశాలలో నిర్వహించిన 100 రోజుల ప్రణాళిక (విద్యార్థుల విద్యాపరమైన అభివృద్ధిని వేగవంతం చేయడానికి ఉద్దేశించిన ఒక ప్రత్యేక కార్యక్రమం) లో పాల్గొన్న చేవెళ్ల స్థానిక శాసనసభ్యులు కాలే యాదయ్య. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వివిధ ఆటలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సన్న బియ్యం పంపిణీ చేయలేని బీజేపీ నాయకులు విమర్శలు చేసే అర్హత లేదు..

- కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు గాదె శివచౌదరి

**కూకట్ పల్లి జూన్ 18 వెలుతురు:**



తెలంగాణ ప్రజలు చెల్లించే పన్నుల ద్వారా వచ్చిన ఆదాయంలో కొంత భాగాన్ని కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలకే తిరిగి ఇవ్వడం విధితమే ఈ విషయాన్ని కేంద్ర మంత్రి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ తెలుసుకోవాలని కూకట్‌పల్లి యువ కాంగ్రెస్ నాయకుడు గాదె శివచౌదరి సూచించారు. బుధవారం ఓ ప్రకటనలో శివ చౌదరి మాట్లాడుతూ తెలంగాణకు కేంద్ర బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించడం లేదని, ఆ విషయాన్ని పార్లమెంటులో బండి సంజయ్ ప్రశ్నించాలని కోరారు. తెలంగాణలో సన్న బియ్యం పథకం కేంద్ర సహాయంతోనో లేదో ప్రశ్నించకుండా దేశంలో బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా కూడా సన్న బియ్యం పంపిణీ జరగడం లేదు. ఇది బీజేపీకి చెందిన రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యం కాదా? అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణలో మాత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ సర్కారు సన్న బియ్యం పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తోందన్నారు. ఇది పేదలపై గల ప్రేమను, సంక్షేమంపై కాంగ్రెస్ ప్రభుత్వ నిబద్ధతను చూపించే ఉదాహరణ. బీజేపీ నాయకులు ఇలాంటి ధైర్యవంతమైన నిర్ణయాలు తీసుకోలేకపోతే, కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం అనవసరం అన్నారు. మీరు మేమే పంచుతున్నాం అని చెప్పడమే కాదు.. నిజంగా పంచగల గుణం ఉండాలి. మాటలు కాదు.. చేతల్లో విశ్వాసం ఉండాలి అంటూ బీజేపీపై శివ చౌదరి విమర్శలు గుప్పించారు.

## వనమహోత్సవాన్ని విజయవంతం చేయండి

- ఎంపీడీవో వెంకయ్య గౌడ్





**శంకర్ పల్లి వెలుతురు జూన్ 18**

శంకర్పల్లి మండలంలో వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో వెంకయ్య గౌడ్ ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి హామీ మీట్లకు మండల కార్యాలయ సమావేశ మందిరంలో ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని సమగ్రంగా అవగాహన చేసుకోవాలని పథకాన్ని మీ మీ గ్రామాలలో విజయవంతంగా అమలు చేయాలని సూచించారు వన మహోత్సవాన్ని మండలాల్లో విజయవంతం చేయాలని పండ్లతోటలు పెంచుకునే రైతులను గుర్తించి దరఖాస్తు చేయించాలని టేకుమొక్కలు బండ్ బ్లాక్ ప్లాంటేషన్ చేయించాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఎంపీఓ గిరిరాజు ఏపీఓ నాగభూషణం పంచాయతీ కార్యదర్శులు ఫీల్డ్ అసిస్టెంట్లు మెట్లు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన చేవెళ్ల డిక్లరేషన్ అమలు చేయాలి.

- మారుపాక అనిల్ కుమార్ డి హెచ్ పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.

**జనగామ వెలుతురు జూన్ 18:**



కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన చేవెళ్ల డిక్లరేషన్ అమలు చేయాలని,ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డి హెచ్ పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళిత హక్కుల పోరాట సమితి (డి హెచ్ పి ఎస్) జనుగామ జిల్లా 2 వ మహా సభలు సీపీఐ జిల్లా కార్యాలయంలో పైసా రాములు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశం ముఖ్యఅతిథిగా హాజరైన దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ మాట్లాడుతూ దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలో దళితులకు రక్షణ లేకుండా పోతుందని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులపై దాడులు, వేధింపులు పెరిగిపోతున్నాయని తెలిపారు. రాజ్యాంగన్ని రద్దు చేసి మణుధర్మ శాస్త్రన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని అన్నారు.ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మివేసి రిజర్వేషన్స్ రద్దు చేయాలని చూస్తుందని అన్నారు. నరేంద్రమోడీ ప్రభుత్వ ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు కుట్రలు చేస్తుందని అన్నారు. ప్రయివేట్ రంగం లో రిజర్వేషన్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్య, వైద్యం పేదలకు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఉపాధి హామీ పథకానికి నిధుల కోత పెట్టి పథకాన్ని రద్దు చేయడానికి చేస్తున్న కుట్రలను అడ్డుకుంటామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 18 నెలలు అవుతున్న చేవెళ్ల డిక్లరేషన్ ఎందుకు అమలు చేయడం లేదని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో దళితులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇండ్లలో రాజకీయ జోక్యం లేకుండా చూడాలని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ గురుకులాలను రద్దు చేయడానికి కుట్రలు చేస్తుందని అన్నారు. దళిత హక్కుల పోరాట సమితి రెండవ రాష్ట్ర మహాసభలు జులై 7, 8 తేదీల్లో పి ఆర్ ఆర్ ఏ సి కన్వెన్షన్ , హంటర్ రోడ్ వరంగల్ లో జరగనున్నాయి ఈ మహాసభలకు రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రతినిధులు పాల్గొన్నారు జరగనున్నాయి. ఈ మహాసభల్లో దేశవ్యాప్తంగా రాష్ట్రంలో దళితులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను చర్చించి భవిష్యత్తు పోరాటాలనురూపొందించుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో బి చంద్రయ్య, మేకల రేణుక, పురుగు నరసయ్య , జీడి ఎల్లయ్య ఇల్లందుల లింగయ్య పరుశరాములు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్టంలో అసలైన 'సన్యాసులు' కేసీఆర్, కేటిఆర్, హరీష్ రావులే

- టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం.

**కూకట్ పల్లి జూన్ 18 వెలుతురు:**




వంద ఏండ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్ కండువా తోనే ఎవరైనా నేతలు వచ్చినప్పుడు కేవలం కాంగ్రెస్ కండువాలు మాత్రమే కప్పాలని దేవాలయాల్లో కప్పే కండువాలు రాజకీయ వేదికపై పెట్టొద్దని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం అన్నారు. బుధవారం గాంధీ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సత్యం శ్రీరంగం మాట్లాడుతూ ఫార్ములా ఈ- కార్ రేసులో అడ్డంగా బుక్కైన కేటీఆర్ ఇప్పుడు ఎన్ని కేసులైనా పెట్టుకోండి... జైలుకైనా వెళ్లడానికి సిద్ధం అని సిగ్గు లేకుండా వ్యవహరించడం పై మండిపడ్డారు. ఏసీబీ అడిగే ప్రశ్నలకు జవాబు చెప్పలేక నీళ్లు నములుతున్న కేటీఆర్! ఫార్ములా రేసు పేరుతో కోట్లు దొబ్బినవ్..జైలుకు వెళ్లక తప్పదు అన్నారు. నువ్వు ఏమైనా స్వాతంత్ర్య సమరయోధుడివా కేటీఆర్? మీరు అవినీతి చేస్తే, కేసులు వస్తాయ్.. ఇవి లొట్టపీసు కేసులు కావు అని బావ-బామ్మర్దులతో కలిసి లొట్ట పీసు కేసులకు భయపడుతున్నారని చుచ్చు ధ్వజమెత్తారు. కేటిఆర్ పేరు ఇకపై లొట్టపీసు కేటిఆర్ గా పిలవాలి అన్నారు. ఫార్ములా ఈ కార్ రేస్ స్కాంలో నేను అడిగాకే అరవింద్ కుమార్ డబ్బులు ట్రాన్స్ఫర్ చేశారని కేటిఆర్ అంటున్నారు. విచారణకు వస్తే భయపడి పోతున్నారని పేర్కొన్నారు. ఏసీబీ అధికారులకు సెల్‌ఫోన్లు ఇచ్చి నిజాయితీ నిరూపించుకోవాలి అన్నారు. దోచుకుని దబాయి స్తామంటే కుదరదు కేటీఆర్..కాంగ్రెస్ పార్టీ లేకుంటే మీకు పుట్టగతులే ఉండేవి కావు, కాంగ్రెస్ చేసిన మేలును మరిచారు. తెలంగాణ ప్రజల ధనాన్ని దోచుకున్న దొంగలు మీరు. రేవంత్ రెడ్డి పై వేసిన కేసులన్నీ ఆయన ఒక్కడే ఎదుర్కొన్నాడు. ఇప్పుడు సన్యాసి పరిపాలన సాగిస్తున్నది రేవంత్ రెడ్డి అని కేటీఆర్ వ్యాక్యాలు చేస్తున్నారు వాస్తవానికి అసలైన 'సన్యాసులు' కేసీఆర్, కేటిఆర్, హరీష్ రావులే అని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ దుర్మార్గమైన చర్య, ఇతరుల హక్కులు హరించే ధైర్యం మీకు ఎవరు ఇచ్చారు అని ప్రశ్నించారు.? 15 రోజుల్లో 618 లీడర్ల ఫోన్లను ట్యాప్ చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం..! ఇది ప్రజాస్వామ్యమా..? ఇది గోప్యత హక్కుల మీద దాడికాదా..? కేటీఆర్ ..ఇలాంటి చిల్లర పనులు చేయాలని ఆలోచన ఎలా వచ్చింది మీకు? అధికారంలో ఉండగా మీరు చేసింది అభివృద్ధి కాదు. ఓటమిని భయపడి రాజకీయ కుట్రలు. తెలంగాణ సమాజం మీ దుర్బుద్ధిని ఎప్పటికీ క్షమించదు అన్నారు. ఇప్పటికే ప్రజలు బుద్ధి చెప్పేశారు. ఇంకెన్ని పాపాలు బయట పడతాయో చూడాలి అన్నారు. దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తుందని కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు ఎన్నోసార్లు చెప్పాడు కానీ అది అభివృద్ధి వైపు కాదు వీళ్ళు చేసిన అరాచకాల వైపు అని ఇప్పుడు అర్థమైందన్నారు. పదేళ్ల మీ అవినీతి, అరాచకాలు, దాడులు, దౌర్జన్యాలు, సెటిల్మెంట్లు ఒక ఎత్తైతే. పోలీస్ మాఫియా, ఫోన్ ట్యాపింగ్, బెదిరింపులు, అక్రమ కేసులు, బలవంతపు పార్టీ ఫండింగులు మరో ఎత్తు అన్నారు. అభివృద్ధిలో, ప్రజా సంపాదన సృష్టిలో ముందు వరసలో ఉండాల్సిన రాష్ట్రం ఈరోజు మీ వల్ల బజారులో నిలబడిందని నాటి రాచరిక వ్యవస్థలను తలదాన్నేలా కల్వకుంట్ల రాచరిక వ్యవస్థను ఏర్పాటు చేయడం మీ కుటుంబానికే సాధ్యమైందన్నారు. 2023 ఎన్నికలకు ముందు దాదాపు 650 మంది సినీ, రాజకీయ, వ్యాపార ప్రముఖులు ఫోన్లు ట్యాప్ అయ్యాయి. ఫోన్లు ట్యాప్ చేసి ప్రతిపక్ష నేతలు మాత్రమే కాదు..సొంత పార్టీ మహిళల వ్యక్తిగత సంభాషణలు సైతం విన్నారు అని అన్నారు. దేశ చరిత్రలో మునుపెన్నడూ లేని అధికార దుర్వినియోగానికి కేసీఆర్ ఫ్యామిలీ పాల్పడినట్లుగా దేశవ్యాప్తంగా చర్చ జరుగుతుంది అన్నారు. అలాగే కాంగ్రెస్ శ్రేణులు ఎవరైనా నేతలు మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షులు వచ్చినప్పుడు, కేవలం కాంగ్రెస్ కండువాలు మాత్రమే కప్పాలి అని, రామరాజు కాటన్, దేవాలయాల్లో కప్పే కండువాలు రాజకీయ వేదికపై పెట్టొద్దు అని మనది వందేళ్ల చరిత్ర ఉన్న కండువా దాన్ని మనం గౌరవించాలి అని మనపై జరుగుతున్నవి రాజకీయ దాడులే ప్రతి కార్యకర్త గుర్తుంచుకోవాలని కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

## ఉద్యోగుల యాక్షన్ కమిటీ చైర్మెన్ బి రవి ప్రకాష్ బృందం తరపున జిల్లా కలెక్టర్ మను చౌదరికి ఐఏఎస్ గారికి స్వాగతం, అభినందనలతో ఘన సన్మానం



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా 18:**

ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ మరియు తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు శ్రీ బి. రవి ప్రకాష్ గారు, జిల్లా కార్యదర్శి శ్రీ భరత్ కుమార్, జిల్లా కోశాధికారి శ్రీ శేషసాయి గిరికాంత్ గారు నూతనంగా నియమితులైన కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్ శ్రీ మను చౌదరి, ఐ.ఏ.ఎస్ గారిని మర్యాదపూర్వకంగా కలసి, ఘనంగా సన్మానించి, సాదరంగా స్వాగతం తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ జిల్లా కార్యవర్గ సభ్యులు అశ్విని, అత్తారి, నాగరాజు, వినయ్‌కాంత్, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షులు: కార్తీక్ కార్యదర్శి: కిషోర్, ఉపాఅధ్యక్షులు: లక్ష్మయ్య, కోశాధికారి: లింగాల అక్షయ్ కుమార్, పబ్లిసిటీ సెక్రటరీ: ఉమా కాంత్, జాయింట్ సెక్రటరీ: చంద్రకాంత్, ఆర్గనైజింగ్ సెక్రటరీ: లక్ష్మి ప్రసన్న, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



## కలెక్టర్ హరిచంద్ర దాసరి ఐఏఎస్ గారికి పుష్పగుచ్చం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేసిన టీజీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎంబి కృష్ణ యాదవ్



**హైదరాబాద్ వెలుతురు జూన్ 18:**

హైదరాబాద్ జిల్లాకు నూతనంగా పదవి బాధ్యతలు తీసుకున్న గౌరవ కలెక్టర్ శ్రీమతి హరిచంద్ర దాసరి ఐఏఎస్ గారికి పుష్పగుచ్చం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేసిన టీజీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎం బి కృష్ణ యాదవ్ కార్యదర్శి ఏమే ఖాదర్ అసోసియేట్ అధ్యక్షులు ఆశన్న వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎన్ సురేందర్. ట్రెజరర్ ఎంవి రమణ శ్రీరాములు డివో రోహిణి నర్సింలు చారి ఆర్గనైన్ సెక్రటరీ గౌస్ హుస్సేన్ అలీ. ఏ రాజశేఖర్. తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ గారు మాట్లాడుతూ హైదరాబాద్ అభివృద్ధిలో ముందు వరుసలో నిలబడేందుకు కృషి చేస్తానని తెలియజేశారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కలెక్టర్ గారికి జిల్లాలో పనిచేస్తున్న అధికారులు అందరూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తూ మేడం గారికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకొస్తామని తెలియజేశారు..

## నిలువు దోపిడీ చేస్తున్న నారాయణ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

- పాఠశాలలోనే యదేచ్చగా పుస్తకాలు, యూనిఫామ్ అమ్మకాలు
- లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యం
- కార్పొరేట్ దోపిడీకి అండగా విద్యాశాఖ అధికారులు
- విద్యా హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి
- బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్

**వనపర్తి వెలుతురు జూన్ 18:**




చదువుల పేరుతో అమాయక ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్న నారాయణ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని నారాయణ పాఠశాలను బిసి పొలిటికల్ జేఏసీ నాయకులతో కలిసి సందర్శించారు. లక్షలు వసూలు చేస్తున్న ఫీజుల గురించి విద్యార్థుల తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోనే పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్, టై బెల్టులు అమ్ముతున్నారని తెలిసి స్టోర్ రూమును సందర్శించగా... వాస్తవంగానే స్టోర్ రూములో స్కూల్ యూనిఫామ్, టై, బెల్టులు ఉండటాన్ని గుర్తించి జిల్లా విద్యాశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యా వ్యవస్థను పటిష్టం చేసి, పేద మధ్యతరగతి విద్యార్థులకు చదువును అక్కున చేర్చడం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుంటే, మరో పక్క నారాయణ లాంటి కార్పొరేట్ విద్యాసంస్థలు పేద ప్రజలకు విద్యను దూరం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సరీ నుంచి పదవ తరగతి వరకు లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని, పుస్తకాలు, యూనిఫాంల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. పాఠశాలలో విద్యాహక్కు చట్టానికి వ్యతిరేకంగా పుస్తకాలు, విద్యార్థుల యూనిఫాం, టై, బెల్టులు అమ్ముతున్నారని, సమాచారం విద్యాశాఖ అధికారులకు తెలిపినా ఎంతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న విద్యాశాఖ అధికారులు నారాయణ పాఠశాల నుంచి ఎంత ముడుపులు తీసుకున్నారని ఆయన సూటిగా ప్రశ్నించారు. నిజాయితీ నిబద్ధత కలిగిన అధికారులకు బిసి పొలిటికల్ జేఏసీ ఎప్పటికీ అండగా ఉంటుందని, అదేవిధంగా అవినీతి అధికారుల భరతం పట్టేందుకు కూడా ఏమాత్రం వెనకాడబోమని హెచ్చరించారు. తక్షణమే నారాయణ పాఠశాలను సీజ్ చేయాలని, లేదంటే రాష్ట్రస్థాయిలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. రాచాల ఆగ్రహంతో ఎట్టకేలకు స్కూల్ యూనిఫాం నిలువ ఉంచిన గదిని విద్యాశాఖ అధికారులు సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెవిసి వనపర్తి పట్టణ అధ్యక్షుడు దేవర శివ, రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పాండురంగ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, మదనాపూర్ మండల అధ్యక్షుడు మహేందర్ నాయుడు, ఆర్టీఐ విభాగం ఉపాధ్యక్షులు గుర్రం రాఘవేందర్, ఆత్మకూరు మండల ప్రధాన కార్యదర్శి అక్కల మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# అద్వానంగా ఉన్న ఆసుపత్రి సమస్యలు పరిష్కారం చేసే వరకు సిపిఎం పోరాటం ఆపదు

- రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రి సమస్యల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు.
- రామన్నపేట ప్రభుత్వాసుపత్రి సమస్యలపై సిపిఎం మహాధర్నా
- ఎండను సైతం లెక్కచేయకుండా రోడ్డుపై బైఠాయింపు

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 18**

ప్రభుత్వాసుపత్రిలో నెలకొన్న మౌలిక సమస్యలు పరిష్కరించి, వంద పడకల ఆసుపత్రిగా మార్చి మండల ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జల్లల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక ఆసుపత్రి ముందు 350 మందితో మహాధర్నా నిర్వహించి అనంతరం రోడ్డుపై బైఠాయించి, నిరసన తెలపడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ 50 ఏళ్లుగా ప్రజలకు సేవలు అందిస్తూ దినదినాభివృద్ధి కావలసిన ప్రజా వైద్యశాల నేడు శిథిలావస్థకు చేరి కనీస సౌకర్యాలు లేకుండా తిరోగమనం చెంది పేదలకు వైద్యం పెనుభారంగా మారుతుంది అన్నారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన పాలకవర్గాలు ఏరియా ఆసుపత్రిగా మార్చి డాక్టర్ల సంఖ్య పెంచి నూతన భవనం నిర్మిస్తామన్న వాగ్దానం కలగానే మిగిలిపోతుందని, పాలకులు మారుతున్న పరిస్థితులు మారుతలేవని ఆవేదన వ్యక్తం చేశారు. దశలవారీగా రాజకీయ పార్టీలు



ప్రజలు ఉద్యమిస్తున్న అనేకమార్లు ప్రజా ప్రతినిధులకు అధికారులకు విన్నవించిన పట్టించుకునే నాధుడే కరువయ్యారని ప్రజలే స్వచ్ఛందంగా రోడ్లమీద కొచ్చి నిరసన తెలుపుతున్న పరిస్థితి వచ్చిందని అన్నారు. గైనిక్ డాక్టర్లు అందుబాటులో లేక ప్రసవాల సంఖ్య గరిష్టంగా తగ్గిందని దీనికి గల కారణాలను వైద్యాధికారులు చెప్పాలని డిమాండ్ చేశారు. పరిశుద్యం నిర్వాణ లేక తాగడానికి మంచినీళ్లు, మరుగుదొడ్ల సౌకర్యం, ఆధునిక సాంకేతిక వైద్య పరికరాలు అందుబాటులో రోగులు అనేక అవస్థలు పడుతున్నారని ప్రభుత్వాసుపత్రి పై ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ యంత్రాంగం పర్యవేక్షణ లోపించడం మూలంగానే ఈ పరిస్థితికి కారణమైందని వెంటనే పునరాలచన చేసుకోవాలని అన్నారు. వెంటనే సమస్యలు పరిష్కారం చేయకపోతే మండల వ్యాప్తంగా ప్రజల్ని కదిలించి మండల బంధు నిర్వహించి అన్ని రాజకీయ పార్టీలతో ప్రజలు ఉద్యతం చేస్తామని హెచ్చరించారు.

ప్రజానాట్యమండలి కళాకారులు ఆటపాటలతో ఆకట్టుకున్నారు. ధర్నా అనంతరం ప్రభుత్వ అధికారులు స్పందించకపోవడంతో సిపిఎం శ్రేణులు స్థానిక సుభాష్ సెంటర్లో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలపడం జరిగింది స్థానిక పోలీసులు జోక్యం చేసుకొని సూపరిండెంట్ డాక్టర్ చిన్నా నాయక్ తో చర్చలు జరపగా ధర్నా వద్దకు వచ్చి సమస్యలు తెలుసుకొని పది రోజుల్లో సూపరిండెంట్ స్థాయిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కారం చేస్తానని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మనం ఉపేందర్ బల్గూరి అంజయ్య మండల కార్యదర్శి వర్గ సభ్యులు బోయిని ఆనందం కందుల హనుమంతు, కల్లూరి నాగేష్,జంపాల అండాలు, మండల కమిటీ సభ్యులు నాగటి ఉపేందర్ గన్నబోయిన విజయభాస్కర్ గొరిగెసోములు,మీర్ ఖాజా అలీ, భావనలపల్లి బాలరాజు, ఆమనగంటి




నాగేష్, బొడిగె రజిత ఎండి రషీద్, గాదె నరేందర్,మైడి గణేష్,వేముల సైదులు, తోలుపునూరి శ్రీనివాస్, శాఖా కార్యదర్శులు మణికుంట్ల లెనిన్ తాళ్లపల్లి జితేందర్ పులిబిక్షం శానగోండ వెంకటేశ్వర్లు కోనూరు మల్లేశం అంబటి మల్లారెడ్డి గన్నెబోయిన శ్రీనివాస్, గుండాల ప్రసాద్,గోగు లింగస్వామి, పావిరాల మత్స్యగిరి, గంగాదేవి మల్లేశం, మాజీ ఎంపిటిసి బడుగు రమేష్,సింగిల్ విండో డైరెక్టర్ కొమ్ము అంజమ్మ, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు గంటెపాక శివకుమార్,డివైఎఫ్ఐ,ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష,కార్యదర్శులు శానగొండ రామచంద్రం,మెట్టు శ్రవణ్ కుమార్,పుట్టల ఉదయ్ కుమార్, గటపాక శ్రీకృష్ణ,నరేష్, సంపతు తదితరులు పాల్గొన్నారు.

# తన పదవి త్యాగంతో ఏర్పడిన గట్టుప్పల్ మండల అభివృద్ధి కోసం ప్రణాళికలు

- గట్టుపల్ మండల కేంద్రంలో నలుమూలల కలియతిరిగి పరిశీలన
- గట్టుప్పల్ మండల సర్వతో ముఖాభివృద్ధికి త్వరలోనే మాస్టర్ ప్లాన్
- కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

**గట్టుప్పల్ వెలుతురు జూన్ 18:**

తన పదవీ త్యాగంతో ఏర్పడిన గట్టుప్పల్ మండల కేంద్రాన్ని సర్వతోముఖాభివృద్ధి చేయడానికి ప్రణాళిక లు రూపొందిస్తున్నారు గౌరవ మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి





రాజ్ గోపాల్ రెడ్డి మండల కేంద్రంలో జరగాల్సిన అభివృద్ధి పైన స్థానిక నాయకులతో కలిసి మండల కేంద్రం మొత్తం కలియతిరిగారు. పుట్టపాక రోడ్డు నుండి సెంటర్ గుండా పోలీస్ స్టేషన్ వరకు, అక్కడినుండి నామాపురం తెరట్టుపల్లి రోడ్డు వరకు పరిశీలించారు. నారాయణపురం మండల కేంద్రం నుండి గట్టుప్పల్ మండల కేంద్రం వరకు రోడ్డు విస్తరణ పనులు, గట్టుప్పల్ మండల కేంద్రంలో రోడ్డును విస్తరించాలన్నారు... స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిలిచిపోయిన తరగతి గదుల భవన నిర్మాణాలను, వంటగది నిర్మాణాలను పరిశీలించారు.. విద్యార్థులకు అవసరమయ్యే మౌలిక వసతులను కల్పించే విధంగా భవన నిర్మాణాలు చేపడతామన్నారు... కొందరు నిరుపేదలు ఇందిరమ్మ ఇల్లులు కావాలని కోరగా మంత్రిగారితో మాట్లాడి ప్రతి ఒక్క నిరుపేదకు ఇందిరమ్మ ఇల్లులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు... గట్టుపల్ మండల కేంద్రంలో అన్ని శాఖల కార్యాలయాలు విధులు నిర్వహించే విధంగా ఇప్పటికే ఉన్నతాధికారులతో పలుమార్లు మాట్లాడారు.. త్వరలోనే





ఇక్కడి పోలీస్ స్టేషన్కు ఎఫ్ఐఆర్ అథారిటీ వస్తుందని స్థానిక నాయకులకు తెలిపారు... గట్టుపల్ మండల కేంద్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన త్వరలోనే అధికారులతో కూర్చుని అభివృద్ధి కోసం మాస్టర్ ప్లాన్ తయారు చేస్తామని... ఆ ప్లాన్ ప్రకారం గట్టుప్పల్ మండలం అభివృద్ధి చేసుకుందామని స్థానికులకు హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో గట్టుప్పల్ మండలం ముఖ్య నాయకులతో పాటు, అధికారులు పాల్గొన్నారు....

## కన్నుల పండుగగాశ్రీ పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయ వార్షికోత్సవ వేడుకలు...








**తిమ్మాపూర్ వెలుతురు జూన్ 18:**

తిమ్మాపూర్ మండలం అలుగునూర్ పరిధిలోని శ్రీ వెంకటేశ్వర కాలనీలో గల శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి, శ్రీరామ సాయి , శ్రీ సంతాన నాగేంద్ర స్వామి దేవాలయ 14వ వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా, కన్నుల పండుగ జరిగాయి. వేద పండితులు శ్రీ తిరునగిరి వెంకటాద్రి స్వామి, శ్రీ తిరునగిరి చక్రధర స్వామి ల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు , అభిషేకం , హెూమ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ధర్మకర్తల సేవా సమితి అధ్యక్షులు చిందం నరసయ్య, దేవాలయ కమిటీ బాధ్యులు గడప శేఖర్, సిరిపురం శ్రీనివాస్, సల్ల మల్లేశం, ఐతం వెంకన్న, బండి కుమార్, నూనె మధు , కొట్టాల శ్రీనివాస్ , వరాల నరసింగం, వకుళభరణం శ్రీనివాస్, బూట్ల కరుణాకర్, నారాయణ , సుధాకర్ రెడ్డి, రాజిరెడ్డి, చిందం అంజి , కొత్తూరి శ్రీనివాస్, జంగపల్లి వినయ్, ప్రశాంత్, స్వామి, రమేష్, వెంకటేష్ తదితరులతోపాటు శ్రీ వెంకటేశ్వర కాలనీ మహిళలు , అశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా మారిన ఆసిఫ్ నహర్ కాల్వ కట్టను ముందస్తు మరమ్మత్తు చేయాలి

- సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం
- మునిపంపుల గ్రామస్తులతో తహసిల్దార్ కార్యాలయం ముందు ఆందోళన వినతి



**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 18**

మునిపంపుల గ్రామ పరిధిలో ఆసిఫ్ నగర్ కాలువ(రాచకాల్వ) శిథిలావస్థకు చేరి అధిక వర్షాలు వస్తే తెగిపోయే ప్రమాదం ఉందని కట్టను వెంటనే మరమ్మత్తులు చేసి పరిష్కృతంగా,పేరుకుపోయిన కంపచెట్లను తొలగించి ముందస్తు చర్యలు చేపట్టాలని సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం డిమాండ్ చేశారు. మునిపంపుల సిపిఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో స్థానిక నాయకులతో కలిసి తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అనంతరం తాసిల్దార్ లాల్ బహుదూర్ కు వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 100 సంవత్సరాల క్రితం నిర్మించిన ఆసిఫ్ నగర్ కాలువ కట్ట పూర్తిగా శిథిలావస్థకు చేరి భారీ వర్షాలు వచ్చినప్పుడు నీటి సామర్థ్యం పెరిగి కట్టమీద పొంగిపోవడంతో సమీపంలో ఉన్న దళిత కాలనీ బిక్కుబిక్కుమంటూ కాలమెల్ల తీయాల్సి వస్తుంది అన్నారు. ఈ సంవత్సరం అధిక వర్షాలు ఉన్నాయని వాతావరణ సూచనలు దృష్టిలో పెట్టుకొని ముందస్తు చర్యలు చేపట్టి ప్రమాదాన్ని అరికట్టాలని అన్నారు. కట్టపై విపరీతంగా పేరుకుపోయి రైతులకు వ్యవసాయ కూలీలకు గీత కార్మికులకు రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్న కంపచెట్లను ఉపాధి హామీ పథకం ద్వారా తొలగించి సమస్య పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యురాలు జంపాల అండాలు మండల కమిటీ సభ్యులు తొలుపునూరి శ్రీనివాస్ శాఖ కార్యదర్శి తాళ్లపల్లి జితేందర్, పావురాల మచ్చ గిరి,నాయకులు జోగులశ్రీనివాస్, జంపాల ఉమాపతి,బూడిద బిక్షం,గంటపాక శివకుమార్, అప్పం సురేందర్ సిరిశాల యాదగిరి జోగుల సాయికుమార్ కనుకుంట్ల ఉపేందర్, తుర్కపల్లి నరేష్,జంపాల మహేష్,ఎడ్ల ధనమ్మ,బొడ్డుపల్లి సంధ్య, నోముల మంగమ్మ,గంటపాక అశ్విని,గంప పద్మ,మమతా, షఫీ తదితరులు పాల్గొన్నారు.

## కృషి, పట్టుదల, క్రమశిక్షణే మీ విజయానికి కారణం

**మేడ్చల్-మల్కాజ్‌గిరి వెలుతురు న్యూస్ జూన్ 18**

కృషి, పట్టుదల, క్రమశిక్షణే మీ విజయానికి కారణమని, పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించి, భవిష్యత్తు లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఇదే స్ఫూర్తితో చదువుకోవాలని మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి విద్యార్థులకు బోధించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు మిక్కిలినేని మను చౌదరి ఆకస్మికంగా జిల్లాలోని బాచుపల్లి, బౌరంపేట్ లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసారు. భవిష్యత్తులో ఏమి చదువుతారని, ఏగ్రూపు తీసుకుంటారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని, విద్యతోనే భవిష్యత్తు



బాగుంటుందని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టరు నేరుగా పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ స్కూల్ లో అన్ని సౌకర్యాలు ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు కలెక్టరుకు బదులిస్తూ స్కూల్ లో స్పోర్ట్స్ ఏర్పాటు చేయాలని, అదేవిధంగా ఎగుడుదిగుడుగా ఉన్న గ్రౌండును లెవల్ చేయించాలని అడిగారు. విద్యార్థులు అడిగిన అంశాలను తప్పకుండా పూర్తి చేస్తామని కలెక్టరు తెలిపారు. స్కూలుకు అవసరమైన అంశాలతో నివేదిక తయారు చేసి తనకు అందించాలని స్కూలు ప్రధానోపాధ్యాయుడిని ఆదేశించారు. గతంలోనే అదనపు గదుల కొరకు నివేదిక పంపామని ప్రిన్సిపల్ తెలుపగా మళ్లీ నోటు పెట్టండి అవసరమైన వసతులను కల్పిస్తామని కలెక్టరు తెలిపారు.

# ప్రభుత్వం నిర్బంధ పాలన కొనసాగించడం మానుకోవాలి

- పోలీసులు అదుపులోకి తీసుకున్న నాయకులను వెంటనే విడుదల చేయాలి.
- కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర నాయకులు ముదునూరి లక్ష్మీనారాయణ

**వెలుతురు న్యూస్, అమ్రాబాద్ జూన్ 18:**

జోగులాంబ గద్వాల జిల్లా రాజోలు మండలం పెద్ద ధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీని చాలా సీరియస్ గా చుట్టు ప్రక్కల గ్రామాల రైతులు వ్యతిరేకిస్తున్న సందర్భంలో ఇట్టి విషయాన్ని తెలుసుకునేందుకు నిజనిర్ధారణకు కు వెళుతున్న పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్,ప్రధాన కార్యదర్శి. నారాయణ రావు.ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా పౌర హక్కుల సంఘం అధ్యక్షుడు సుభాన్,ప్రధాన కార్యదర్శి, జక్క బాలయ్యలను పోలీసులు బుధవారం రోజు అదుపులోకి తీసుకుని ,నిజానిర్ధారణ జరగకుండా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకోవడం రాజ్యాంగ విరుద్ధం, ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం, వెంటనే అదుపులోకి తీసుకున్న నాయకుల ను విడుదల చేయాలని,డిసెంబర్ 2023 ఎన్నికల సందర్భంగా 7వ, గ్యారెంటీ అయిన ప్రజాస్వామిక పాలనని ఇస్తామని రెవెంత్ రెడ్డి హామీ ఇచ్చి, ఇప్పుడు గత నిర్బంధ పాలనను కొనసాగించడం మానుకోవాలని కులనిర్మూలనా పోరాట సమితి రాష్ట్ర నాయకులు ముద్దు నూరి లక్ష్మినారాయణ, తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కో కన్వీనర్ ఎడ్ల అంబన్న, తెలంగాణ నిర్వాసిత వ్యతిరేక వేదిక నాయకులు గోరటి అనిల్ కుమార్,లు డిమాండ్ చేశారు.

## ఘనంగా మంద ఉదయ్ జన్మదిన వేడుకలు



**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 18**

మండలం టిఆర్ఎస్ యువజన విభాగం మండల ప్రధాన కార్యదర్శి మంద ఉదయ్ జన్మదిన వేడుకలు నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో ఘనంగా జరిగినవి. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కంభంపాటి శ్రీనివాసులు, గౌడ్ ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షులు కళ్లెం స్వామి, టిఆర్ఎస్ యువ నాయకులు పావురాల నరసింహ యాదవ్, కళ్లెం ఆంజనేయులు, రుద్రవరం రాకేష్, ఉప్పలపల్లి గణేష్, తదితరులు పాల్గొన్నారు.

## నందనం నీరా ఉత్పత్తుల కేంద్రం వెంటనే ప్రారంభించాలి

- రాష్ట్ర గౌడ కల్లుగీత సంఘాల డిమాండ్



**భువనగిరి వెలుతురు జూన్ 18:**

బుధవారం రోజున యాదాద్రి భువనగిరి జిల్లా నందనం నీరా ఉత్పత్తి కేంద్రం సందర్శన చేయడం జరిగింది. ఈ సందర్భం గా నీరా ఉత్పత్తుల కేంద్రం వెంటనే ప్రారంబించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గౌడ ఐక్య సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు అంబాల నారాయణ గౌడ్ గౌడకల్లుగీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అయిలి వెంకన్న గౌడ్, గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వంగ సధనందం గౌడ్, గౌడ సంఘం నాయకులు తాళ్ల శ్రీశైలం గౌడ్ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## పేదోళ్లకి అన్యాయం చేసి అభివృద్ధి చేయం, పేదోళ్లకు న్యాయం చేసుకుంటూనే అభివృద్ధి చేస్తా,

- కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి



**మునుగోడు, చండూరు వెలుతురు జూన్ 18:**



కనగల్ టు మాల్ ఆర్ అండ్ బి రోడ్డు విస్తరణలో భాగంగా చండూరు మండలం బంగారిగడ్డ గ్రామంలో రోడ్డు విస్తరణలో కోల్పోతున్న ఇండ్లను పరిశీలించిన మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి బంగారుగడ్డ గ్రామ పరిధిలో డ్రైనేజీ నిర్మాణంతో కలుపుకొని 66 ఫీట్ల వెడల్పుతో రోడ్డును అభివృద్ధి చేస్తున్న సందర్భంగా రోడ్డు వెడల్పులో పూర్తిగా ఎన్ని గృహాలు పోతున్నాయి, పాక్షికంగా ఎన్ని గృహాలకు ఇబ్బంది అవుతుందని బంగారుగడ్డ గ్రామంలో తిరిగి పరిశీలించిన గౌరవ ఎమ్మెల్యే... అంతకుముందు మునుగోడు లోని క్యాంపు కార్యాలయంలో గౌరవ ఎమ్మెల్యే గారిని కలిసిన బంగారుగడ్డ రోడ్డు వెడల్పులో గృహాలు కోల్పోతున్న బాధితులు బాధితుల సమస్యలు విని స్వయంగా వచ్చి పరిశీలిస్తానని వెంటనే బయలుదేరి వచ్చి బంగారుగడ్డలో ఇండ్లను పరిశీలించారు... రోడ్డు విస్తరణలో గృహాలు కోల్పోతున్న బంగారిగడ్డ గ్రామానికి



చెందిన బాధితులు మునుగోడు లోని క్యాంపు కార్యాలయంలో గౌరవ శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారిని కలిసి తమ సమస్యలను విన్నవించారు... తమ సమస్యలను సావధానంగా విన్న గౌరవ ఎమ్మెల్యే పేదోళ్లకు అన్యాయం జరిగే అభివృద్ధి చేయమని, పేదలకు న్యాయం చేస్తూనే అభివృద్ధి జరుపుతామని హామీ ఇచ్చారు.. బంగారుగడ్డ గ్రామ పరిధిలో డ్రైనేజీ నిర్మాణంతోపాటు 66 ఫీట్ల వెడల్పుతో రోడ్డు నిర్మాణ పనులు జరగబోతున్న నేపథ్యంలో ఇల్లులు కోల్పోతున్న నిరుపేదలకు ఏదో ఒకరకంగా న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు... అనంతరం మర్రిగూడ మండలం లెంకలపల్లి గ్రామ పరిధిలో జరుగుతున్న రోడ్డు పనులను పరిశీలించారు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

# ప్రభుత్వ ఆదేశాలకు లోబడి ప్రైవేటు పాఠశాలలు పనిచేయాలి.

- మండల విద్యాధికారి శ్రీ పర్వతి సత్యనారాయణ.

**తూప్రాన్ వెలుతురు న్యూస్ జూన్ 18 :**
మెదక్ జిల్ల తూప్రాన్ మండల పరిధిలోగల ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ ఆదేశాలకు లోబడి పని చేయాలని, అందుకు వ్యతిరేకంగా వ్యవహరించిన పాఠశాలల పట్ల చర్యలు తీసుకొనుటకు ఉన్నతాధికారులకు సమాచారం అందించడం జరుగుతుందని తూప్రాన్ మండల విద్యాధికారి శ్రీ పర్వతి సత్యనారాయణ తెలిపారు. బుధవారం రోజున తూప్రాన్ మండల వనరుల కేంద్రంలో మండల పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాల్స్ తో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలు తమ ఇష్టానుసారంగా వ్యవహరించకూడదని విద్యార్థుల పట్ల కఠినంగా వ్యవహరిస్తే తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పాఠశాలలు ప్రభుత్వం సూచించిన సమయ సారిణి పాటించాలని, ప్రైవేట్ పాఠశాలలు తరగతుల వారిగా విద్యార్థుల నుండి తీసుకుంటున్న ఫీజు వివరాలను




కార్యాలయంలో సమర్పించాల్సిందిగా కోరారు. విద్యార్థులకు డబుల్ ప్రమోషన్స్ ఇవ్వడం సరైనది కాదని ఆ విధంగా ఎవరైనా చేసిన సరిదిద్దుకోవాలని తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థులకు అధిక ధరలకు పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్నట్లు సమాచారం అందిందని, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను విక్రయించడం చట్టరీత్యా నేరమని ఈ విషయంలో ప్రిన్సిపల్స్ తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు శుద్ధి చేసిన త్రాగునీరు అందేలాగా చర్యలు తీసుకోవాలని, బాల బాలికలకు ప్రత్యేకమైన బాత్రూం సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు. విద్యార్థులు డ్రాప్ బాక్స్ లో ఎవరు ఉండకుండా వారి పట్ల శ్రద్ధ తీసుకొని ప్రతి ఒక్కరూ పాఠశాలలో చదువుకునే విధంగా యాజమాన్యం, ప్రిన్సిపాల్ శ్రద్ధ వహించాలని కోరారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమని మానసిక, శారీరక వికాసం సమపాళ్లలో ఉన్నప్పుడే విద్యార్థులు ఉన్నతంగా రాణిస్తారని క్రీడల పట్ల ప్రైవేట్ పాఠశాలలు నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వం సూచించిన విధంగా క్రీడా పీరియడ్స్ విద్యార్థులకు అందించాలని తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు సమస్యలు ఎదురైనప్పుడు ముందుగా వారి తల్లిదండ్రులకు సమాచారం అందించాలని సూచించారు. వాహనాలలో విద్యార్థులను గ్రామాల నుండి తీసుకొచ్చే సమయంలో వాహనాల యొక్క భద్రత,డ్రైవర్ల అనుభవం పరిగణలోనికి తీసుకొని, ప్రత్యేక రక్షణ చర్యలు విద్యార్థులకు కల్పించాలని మండల విద్యాధికారి శ్రీ పర్వతి సత్యనారాయణ సూచించారు. సమావేశంలో మండల పరిధిలో గల ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాల్స్, మండల వనరుల కేంద్రం సిబ్బంది, సి.ఆర్.పి. లు పాల్గొన్నారు.

## కూచిపూడి కళాకారిణి నిర్వి రెడ్డి ని అభినందించిన బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



**హుజురాబాద్ వెలుతురు జూన్ 18:**
హుజరాబాద్ పట్టణానికి చెందిన ఐదవ తరగతి విద్యార్థిని, కూచిపూడి కళాకారిణి నిర్విరెడ్డి ని బుధవారం రోజున బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అభినందించి సన్మానించారు. తూర్పుగోదావరి జిల్లాలో జూన్ 12 నుండి 15 వరకు జరిగిన కూచిపూడి నృత్య పోటీల్లో నిర్విరెడ్డి ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ మేరకు కూచిపూడి పోటీలు నిర్వహించిన రాజమండ్రి శ్రీ రాధాకృష్ణ కళాక్షేత్ర నిర్వాహకులు నిర్వి రెడ్డికి ప్రథమ స్థానంలో నిలిచిన సర్టిఫికెట్ తో పాటు, మెమొంటోను ప్రధానం చేశారు . హుజురాబాద్ వాస్తవ్యులైన కూచిపూడి కళాకారుని నిర్విరెడ్డి , ఆమె తల్లిదండ్రులు మహేందర్ రెడ్డి, వినోద లు బుధవారం రోజున బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డిని కలిశారు . ఈ సందర్భంగా గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రాచీన కళలో అతి ప్రాముఖ్యమైన కూచిపూడి లో నిర్విరెడ్డి రాణించడం, రాజమండ్రిలో జరిగిన పోటీల్లో ప్రథమ విజేతగా నిలవడం సంతోషంగా ఉందన్నారు. కూచిపూడి లో నిర్వి రెడ్డి మరింత ఉన్నత స్థానానికి వెళ్లాలని, భవిష్యత్తులో జాతీయస్థాయిలో జరిగే పోటీల్లో సైతం పాల్గొని తగిన గుర్తింపు తెచ్చుకోవాలని నిర్విరెడ్డికి సూచించారు.ఈ కార్యక్రమంలో బిజెపి మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు చిదురాల రాణి శ్రీనివాస్ బిజెపి పట్టణ అధ్యక్షులు తూర్పాటి రాజు జిల్లా కౌన్సిల్ మెంబర్ రావుల వేణు తదితరులు పాల్గొన్నారు.

## సదాశివ పల్లి శివాలయం వద్ద బోర్ వెల్ వేయించిన కేంద్రమంత్రి బండి సంజయ్...



**కరీంనగర్ వెలుతురు జూన్ 18:**
కరీంనగర్ నగరపాలక సంస్థ 7వ డివిజన్ పరిధిలో గల సదాశివపల్లిలోని శివాలయానికి కేంద్రమంత్రి బండి సంజయ్ బోర్ వెల్ వేయించారు. శివాలయం కు నీటి సమస్య ఉండడంతో స్థానిక ప్రజలు ఇటీవల ఏడవ డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ , బీజేపీ నేత తోట సాగర్ దృష్టికి సమస్యను తీసుక వెళ్లారు. ఈ విషయాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లి శివాలయానికి బోర్ వెల్ వేయించడానికి తోట సాగర్ కృషి చేశారు. శివాలయానికి వచ్చే భక్తుల నీటి అవసరాల సౌకర్యార్థం అడిగిన వెంటనే బోరు వేయించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కు ఏడవ డివిజన్ సదాశివ పల్లి ప్రజల పక్షాన తోట సాగర్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు . ఈ కార్యక్రమంలో బీజేపీ నేత తోట సాగర్ తోపాటు కోటి నర్సింహారెడ్డి, రాజశేఖర్, సంపత్, సంజీవ్, శ్రీనివాస్, సతీష్, సంతోష్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు ఎలాంటి పక్షపాతం లేకుండా నిజమైన నిరుపేదలకు కేటాయించాలి

- పంజాల అశోక్ గౌడ్ బిజెపి మండల అధ్యక్షులు గజ్వేల్



**గజ్వేల్ వెలుతురు జూన్ 18:**
ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకం ఇందిరమ్మ ఇళ్లు నిజమైన నిరుపేదలకు కేటాయించాలి అని గజ్వేల్ ఎంపీడీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ అనిత మేడం గారికి వినతి పత్రం అందజెయడం జరిగింది అని కేంద్ర ప్రభుత్వం అవాస్ యోజన క్రింద నిరుపేదలకు ఇళ్లు నిర్మించాలి అని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కు 32,426 వేల కోట్ల రూపాయలు చెల్లిస్తే ఇక్కడ మాత్రం నిరుపేదలకు కెటయించకుండా కేవలం అధికార పార్టీ కార్యకర్తలకు ఇవ్వడం కాంగ్రెస్ నాయకులు చెప్పిన పేర్లు మాత్రం మే లీస్ట్ అవుట్ చేయడాని తీవ్రంగా ఖండిస్తున్నమని నిజమైన నిరుపేదలను గుర్తించి వారికి మాత్రమే కెటయించాలని లేని భారతీయ జనతా పార్టీ అధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని తెలపడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు మణె శేఖర్,మండల సీనియర్ నాయకులు వాంజరి రాజు,మండల ప్రధానకార్యదర్శి లు ఇప్ప స్వామి,బారు అరవింద్,మండల ఉపాధ్యక్షులు భీనమైన ప్రభాకర్,శివమల్లు శ్రీకాంత్ గౌడ్,శాతం స్వామి, కార్యదర్శి కూర స్వామి,మండల లీగల్ సెల్ కన్వీనర్ కర్నాల శ్రీనివాస్,యువ నాయకులు అనిల్, మండల నాయకులు గణేష్, నర్సింలు, మదుసుధన్ తదితరులు పాల్గొన్నారు.

## సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ ఇవ్వడం కుదరదు

- ఎసిబికి లేఖ ద్వారా కెటిఆర్ స్పష్టీకరణ

**హైదరాబాద్,జూన్18( వెలుతురు):**
సెల్‌ఫోన్ అప్పగించాలన్న అంశంపై ఏసీబీ నోటీసుకు భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ లేఖ ద్వారా సమాధానం పంపారు. తన వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించే ఈ చర్యను అంగీకరించేది లేదని తెలిపినట్లు సమాచారం. ఫార్ములా-ఈ కార్ రేసు కేసులో కేటీఆర్ విచారణ ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయన సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ ఇవ్వాలని ఏసీబీ అధికారులు ఆదేశించారు. సెల్‌ఫోన్ స్వాధీనం ప్రాథమిక హక్కులకు, వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగిస్తుందని, ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు కూడా చెప్పిందని కేటీఆర్ లేఖలో పేర్కొన్నారు. ఏసీబీ అధికారుల ఆదేశాలపై కేటీఆర్ తన న్యాయవాదులతో చర్చించారు. అనిశా అధికారులు ఆదేశించినట్లుగా మొబైల్ ఫోన్‌ను, ల్యాప్‌టాప్‌ను వారికి ఇవ్వాల్సిన అవసరం లేదని న్యాయవాదులు కేటీఆర్‌కు చెప్పినట్టు సమాచారం.

## ప్రధాని మోదీ హయాంలోనే గ్రామాల అభివృద్ధి

### బీజేపీ మండల అధ్యక్షులు బక్క వెంకటేష్ గౌడ్



**మనోహరాబాద్ వెలుతురు జూన్ 18:**
మెదక్ పార్లమెంట్ సభ్యులు శ్రీ మాధవనేని రఘునందన్ రావు గారు మరియు జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ గారి ఆదేశానుసారం నేడు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 11సంవత్సరాల పాలన లోనే గ్రామాల అభివృద్ధి జరిగిందని మనోహరాబాద్ మండల బిజెపి అధ్యక్షులు వెంకటేష్ గౌడ్ అన్నారు బుధవారం రోజున మండలంలోని వెంకటాపూర్ అగ్రహారం గ్రామంలో మండల ఉపాధ్యక్షులు చెర్లపల్లి రాజేష్ గౌడ్, ఆంజనేయులు ముదిరాజ్ గారి ఆధ్వర్యంలో మోదీ 11 సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన రచ్చ బండ కార్యక్రమంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ నిధుల తోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని, సిసి రోడ్ల తో పాటు ప్రకృతి వనాలు, స్మశాన వాటికల నిర్మాణం, ఉపాధి హామీ రోడ్ల పనులు చేపట్టడం జరిగిందని అన్నారు. రేషన్ బియ్యం ఒక్కొక్కరికి 5కిలోలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం లో కేంద్రం వాటా ఉందన్నారు. పాలన పై ఇంటిటా ప్రచారాన్ని చేపట్టాలన్నారు. కార్యక్రమం లో జిల్లా కౌన్సిల్ సభ్యులు కమ్మరి నరేంద్ర చారి, సీనియర్ నాయకులు పురం మహేష్ ముదిరాజ్, కొల్తూరి నరేష్ గౌడ్, కుంట మహేష్, మండల ప్రధాన కార్యదర్శి వెంకటోళ్ల సాయి కిరణ్ గౌడ్, మండల ఉపాధ్యక్షులు, చాకలి మల్లేష్, మండల నాయకులు మామిండ్ల ప్రణయ్, చెట్టి రాజు ముదిరాజ్, ప్రవీణ్ చారి, నాగు ముదిరాజ్,వివేక్, సున్నం ప్రవీణ్, పంజా బిక్షపతి, రవి, సున్నం మల్లేష్, కురుమ మల్లేష్, దోమల పోచయ్య శంకరయ్య, కిష్టయ్య, చిన్న నర్సయ్య తదితరులు పాల్గొన్నారు

## రైతు భరోసా కొరకు దరఖాస్తుల స్వీకరణ

- జిల్లా వ్యవసాయ అధికారి కల్పన

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 18**



రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన రైతుభరోసా పథకం కొరకు అర్హులైన రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. రైతు భరోసా వానాకాలం-2025 కొరకు నూతనంగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు ఈ వానాకాలం రైతు భరోసాలో నమోదు చేసుకునేందుకు అర్హులు అని, గత సంవత్సరం దరఖాస్తు చేసుకోని రైతులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇందు కొరకు దరఖాస్తు ఫారం, పట్టా పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా పుస్తకం నకలు ప్రతులతో ఆయా గ్రామాలకు సంబంధించిన వ్యవసాయ విస్తరణ అధికారులను రైతు వేదికలో సంప్రదించి ఈ నెల 20వ తేదీలోగా ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని తెలిపారు. జిల్లాలోని 18 మండలాలలోని 419 గ్రామాలలో 1 లక్షా 71 వేల 307 మంది రైతులకు 205 కోట్ల రూపాయల రైతు భరోసా అందించవలసి ఉండగా 1 లక్షా 37 వేల 604 మంది రైతులకు సంబంధించిన 142 కోట్ల రూపాయలు ప్రభుత్వ ఖజానాకు పంపించడం జరిగిందని, 1 లక్షా 13 వేల 886 మంది రైతుల ఖాతాలలో 86 కోట్ల 42 లక్షల రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు. అర్హత గల రైతులు ఈ నెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకొని ప్రభుత్వం అందిస్తున్న రైతుభరోసా పథకం ఫలాలు పొందాలని తెలిపారు.

## భూసమస్యల పరిష్కారం కోసం భూభారతి చట్టం

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 18**
భూసమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి నూతన ఆర్.ఓ.ఆర్. చట్టంలో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల ద్వారా భూసమస్యలపై అందిన దరఖాస్తులను పరిష్కరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని లక్షెట్టిపేట మండల కేంద్రంలోని ఉత్కూర్ చౌరస్తాలోని ప్రభుత్వ భవనంలో తహశీల్దార్ దిలీప్ కుమార్ తో కలిసి, వెంకట్రావుపేట గ్రామంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులను సందర్శించి దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి నూతన ఆర్.ఓ.ఆర్. చట్టంలో భాగంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూసమస్యలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఈ దరఖాస్తులను రికార్డులతో సరి చూసి, క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే దిశగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 20వ తేదీ వరకు జిల్లాలోని అన్ని మండలాలలో (పైలెట్ మండలం అయిన భీమారం మినహా) కార్యచరణ ప్రకారం రెవెన్యూ సదస్సులు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. నూతన చట్టంలో రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం కల్పించడం జరిగిందని, రిజిస్ట్రేషన్, ముటేషన్ చేసేందుకు ముందు భూముల వివరాలు పూర్తి స్థాయిలో సర్వే చేసి, మ్యాప్ తయారు చేయడం జరుగుతుందని, పెండింగ్ సాదా బైనామా దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిష్కరించడం జరుగుతుందని, వారసత్వంగా వచ్చిన భూములకు విరాసత్ చేసే ముందు నిర్ణీత కాలంలో సమగ్ర విచారణ చేయడం, సంబంధిత వారసులకు నోటీసులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తుతో పాటు రిజిస్టర్డ్ దస్తావేజులు, రెవెన్యూ రికార్డులు జతపరిచినట్లయితే త్వరగా పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూరిభా గాంధీ బాలికల ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యార్థినీ, విద్యార్థులకు



ప్రభుత్వం ఉచితంగా అందించే పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, వర్క్ పుస్తకాలు, ఏకరూప దుస్తులను పంపిణీ చేయాలని తెలిపారు. పాఠశాలలో తరగతి గదులు, వంట శాల, పరిసరాలలో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బంధీగా చేపట్టాలని, విద్యార్థులకు శుద్ధమైన త్రాగునీటితో పాటు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలని తెలిపారు. ఎంతో మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలలో చేరుతున్నారని, ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్యను పెంపొందించాలని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని, వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన గ్రామాలలో మౌళిక వసతుల కల్పనకు చర్యలు

- జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జనార్ధన్

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 18**
ప్రధానమంత్రి ధర్తీ అభ జనభాగీదరి అభియాన్ కార్యక్రమం క్రింద జిల్లాలోని గిరిజన గ్రామాలలో మౌళిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జనార్ధన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొదటి విడతగా 500 మంది గల గ్రామాలను 50 శాతం గిరిజన జనాభా గల 7 మండలాలలోని 11 గ్రామాలను ఎంపిక చేసి రాబోయే 5 సంవత్సరాలకు ప్రణాళిక ప్రకారం అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 19న కాసిపేట మండలం వెంకటాపూర్ గ్రామపంచాయతీ వెంకటాపూర్ గ్రామంలో, నెన్నెల మండలం జంగల్పేట్ గ్రామపంచాయతీ జంగల్పేట గ్రామంలో, 20వ తేదీన కాసిపేట మండలం పల్లంగూడ గ్రామపంచాయతీ పల్లంగూడ గ్రామంలో, నెన్నెల మండలం కొత్తూరు గ్రామపంచాయతీ కొత్తూరు గ్రామంలో, జన్నారం మండలం ఇంధనపల్లి గ్రామపంచాయతీ కొత్తపేట గ్రామంలో, 21వ తేదీన భీమారం మండలం బూరుగుపల్లి గ్రామపంచాయతీ బూరుగుపల్లి గ్రామంలో, దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామపంచాయతీ లింగాపూర్ గ్రామంలో, 23న హాజీపూర్ మడలం గడ్పూర్ గ్రామపంచాయతీ నాగారం గ్రామంలో కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆయా గ్రామాలలో మౌళిక వసతులైన విద్య, వైద్యం, రవాణా, రోడ్ల నిర్మాణం, సంక్షేమం, ప్రభుత్వ పథకాల అమలు ముఖ్య ఉద్దేశ్యంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, గిరిజన సంక్షేమశాఖ అధికారుల సమక్షంలో కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. గిరిజన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## తొలకరి కంటె తొందరగా రైతు భరోసాతో రైతుల ఖాతాల్లోకి నిధులు

**మేడ్చల్-మల్కాజ్‌గిరి వెలుతురు జూన్ 18:**



తొలకరి కంటె తొందరగా రైతు భరోసాతో రైతుల ఖాతాల్లోకి నిధులు అందించి రైతుల ముఖాల్లో సంతోషాన్ని చూస్తున్న ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు మిక్కిలినేని మను చౌదరి అన్నారు. బుధవారం రైతు భరోసా పథకం ద్వారా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా లో 4291 మంది రైతుల ఖాతాల్లో 2.57 కోట్లు జమ అయిన సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ రైతుల ముఖాల్లో సంతోషం కోసం రాష్ట్ర ప్రభుత్వం యాసంగి సీజన్ కంటె ముందుగానే రైతుల ఖాతల్లో నిధులు జమ చేయడం రైతుల మంచి భవిష్యత్తుకు మచ్చు తునక అన్నారు. విడతల వారిగా రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా నిధులు పడతాయని, వ్యవసాయానికి పెట్టుబడి భారం తగ్గించి, వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించేందుకు రైతు భరోసా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. వానాకాలం సాగు ప్రారంభానికి ముందే ప్రభుత్వము రైతు భరోసా నిధులు అందించడం పై అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## మరోమారు ఢిల్లీ పర్యటనకు సిఎం రేవంత్

- నేడు ఇంగ్లండ్ మాజీ పిఎం టోనీ బ్లెయిర్‌తో భేటీ

**హైదరాబాద్,జూన్18( వెలుతురు):**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోమారు ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారు. గురువారం ఢిల్లీలో ఇంగ్లండ్ మాజీ ప్రధాని టోనీ బ్లేయర్ తో రేవంత్ రెడ్డి భేటీ కానున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు సంబంధించి కీలక భేటీలో పాల్గొంటారని సమాచారం. అలాగే ఏఐసీసీ పెద్దలను కలిసి పెండింగ్ పదవులు, నామినేటెడ్ పదవుల భర్తీపై చర్చించే అవకాశం ఉన్నట్లు తెలియవచ్చింది. గురు, శుక్రవారాలు రెండు రోజులపాటు ఢిల్లీలోనే ఉండనున్నట్లు తెలియవచ్చింది. అలాగే పార్టీ అధిష్టానాన్ని, పలువురు కేంద్ర మంత్రులను సీఎం రేవంత్ రెడ్డి కలుస్తారు. టోనీ బ్లెయిర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ చేంజ్ (టీబీఐ) అనే ఎన్‌జీవోను నడిపిస్తున్నారు. ఇది అనేక దేశాల్లో పనిచేస్తోంది. ఈ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి తన భేటీలో టోనీ÷-లబెయిర్‌తో పలు విషయాలపై చర్చించనున్నట్లు సమాచారం. కాగా ఏపీ విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ కూడా టోనీ÷-లబెయిర్‌తో సమావేశమవుతారని తెలియవచ్చింది.రేవంత్‌రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక ఏడాదిన్నరలో చాలా సార్లు ఢిల్లీ పర్యటనకు వెళ్ళివచ్చారు. వివిధ సందర్భాల్లో అధిష్టానం పెద్దల్ని కలిసి మంతనాలు జరిపారు. కాగా ఈ మధ్య తాజాగా ఢిల్లీ వెళ్ళి వచ్చాక రేవంత్ రెడ్డి వైఖరిలో మార్పు కొట్టొచ్చినట్టు కనిపిస్తోందని ఆయనను దగ్గరగా గమనిస్తున్నారు అంటున్నారు. ఇంకా చెప్పాలంటే.. కొత్త బలం వచ్చినట్టుందని, కాన్ఫిడెన్స్ లెవల్స్ కూడా పెరిగాయని చెప్పుకుంటున్నారు. గడిచిన 18 నెలలుగా.. ఇటు ప్రభుత్వంలో, అటు పార్టీలో ఎవరేం చేసినా.. ఏం మాట్లాడినా చూసీ చూడనట్టే సీఎం ఉన్నారు. కేబినెట్ మంత్రుల మీద రకరకాల ఆరోపణలు వచ్చినా.. అంత సీరియస్‌గా తీసుకున్నట్టు కనిపించడంలేదు. కానీ, ఇప్పుడు ఆయన వైఖరి చూస్తుంటే.. అదంతా గతం. ఇక మీదట అలాంటివేవీ నడవవ్ అన్నట్టుగా ఉందని అనుకుంటున్నారు.

## పీఎంఈజీపీ పథకంలో భాగంగా దేశమంతటా 11,480 సేవా రంగ లబ్ధిదారులకు రూ.300 కోట్లకు పైగా మార్జిన్ మనీ సబ్సిడీని అందించిన కేవీఐసీ

పథకం ఆర్థిక సహాయాన్ని అందించడానికి మాత్రమే పరిమితం కాదనీ, ఇది ఒక సామాజిక ఉద్యమంగా కూడా రూపుదిద్దుకొందనీ, లక్షలమంది యువతీ యువకులకు, మహిళలకు, చేతివృత్తిదారులకు స్వతంత్రోపాధిని కల్పించడంతో పాటు పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ఉపకరిస్తుందన్నారు. ప్రతి గ్రామంలో ఉపాధినీ, స్వయంసమృద్ధినీ అంకురింప చేయడంలో ఈ పథకం పోషిస్తున్న పాత్ర ప్రధానమైందని ఆయన అన్నారు. దేశంలోని మొత్తం ఆరు జోన్లు ఉత్సాహంగా ఈ ఆర్థిక సహాయ పథకంలో భాగం పంచుకొన్నాయి. కేంద్రీయ మండలంలో 2403 ప్రాజెక్టుల కోసం రూ.72 కోట్ల సబ్సిడీని పంపిణీ చేశారు. ఈ ప్రాజెక్టులు ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్‌లలో ఉన్నాయి. ఈ ప్రాజెక్టులకు మొత్తం రూ.218 కోట్ల రుణాన్ని మంజూరు చేశారు. తూర్పు మండలంలో బీహార్, ఝార?ండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, అండమాన్-నికోబార్ దీవులలోని 996 ప్రాజెక్టులకు సుమారు రూ.71 కోట్లను రుణాల రూపంలో మంజూరు చేసి, రూ.22 కోట్లను సబ్సిడీగా ఇచ్చారు. ఉత్తర భారతదేశంలోని పంజాబ్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ-కాశ్మీర్, లద్దాఖ్, రాజస్థాన్ రాష్ట్రాలతో పాటు కేంద్ర పాలిత చండీగఢ్ ప్రాంతానికి మొత్తం 2713 ప్రాజెక్టులకు గాను రూ.61 కోట్ల సబ్సిడీని ఇచ్చారు. వాటికే రుణాల రూపంలో రూ.184 కోట్లను మంజూరు చేశారు. ఈశాన్య ప్రాంతంలో 81 ప్రాజెక్టులకు రూ.2 కోట్ల సబ్సిడీని ఇచ్చారు. ఈ ప్రాంతంలో అసోమ్, మణిపుర్, మేఘాలయ, మిజోరమ్, నాగాల్యాండ్, సిక్కిమ్, త్రిపురలు ఉన్నాయి. దక్షిణాది రాష్ట్రాలు తెలంగాణ,ఆంధ్ర ప్రదేశ్, కర్నాటక, తమిళ నాడు, కేరళ, పాండిచ్చేరిలలో 4565 ప్రాజెక్టులకు సంబంధించి రూ.116 కోట్ల సబ్సిడీని పంపిణీ చేశారు. ఈ ప్రాజెక్టులకు రూ.343 కోట్ల కన్నా ఎక్కువ రుణాలను మంజూరు చేశారు. పశ్చిమ మండలానికి చెందిన మహారాష్ట్ర, గుజరాత్, గోవాలలో 722 ప్రాజెక్టులకు గాను రూ.26 కోట్ల కన్నా ఎక్కువ సబ్సిడీని, రూ.82 కోట్ల రుణాన్ని మంజూరు చేశారు.ప్రధానమంత్రి ఉద్యోగ కల్పన కార్యక్రమాన్ని (పీఎంఈజీపీ) 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొదలుపెట్టిన తరువాత ఇది గ్రామీణ భారతంతో పాటు మన దేశంలోని పట్టణ ప్రాంతాలలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు, స్వావలంబనకు ఒక దృఢమైన స్తంభంగా నిలిచింది. ఈ పథకంలో భాగంగా ఇంతవరకు మొత్తం 10,18,185 సూక్ష్మ వాణిజ్య సంస్థలను ఏర్పాటు చేయగా, ఇందుకోసం భారత ప్రభుత్వం ఇంతవరకు రూ. 73,348 కోట్ల రుణాలను మంజూరు చేసింది. దీనికిగాను రూ.27,166 కోట్లకు పైగా మార్జిన్ మనీ సబ్సిడీని లబ్ధిదారులకు అందించారు. ఇప్పటి వరకు, దేశవ్యాప్తంగా 90,04,541 మంది ఈ పథకం ద్వారా ప్రత్యక్ష ఉపాధినీ, పరోక్ష ఉపాధినీ అందుకొన్నారు. దీంతో ఇది దేశంలో స్వయంఉపాధి పథకాలన్నిటిలోకీ అత్యంత ప్రభావాన్ని కలగజేసిన పథకంగా మారింది. ఈ కార్యక్రమం స్వయంఉపాధిని ప్రోత్సహించడం ఒక్కటే కాకుండా, ప్రధానమంత్రి చెబుతున్న స్వయంసమృద్ధి యుక్త భారత్ దార్శనికతను క్షేత్ర స్థాయిలో సాకారం చేయడంలో కూడా ముఖ్య పాత్రను పోషిస్తోంది.

## ఏపీలో అభివృద్ధి, సంక్షేమం పక్కకుపోయింది

**పల్నాడు,జూన్18 వెలుతురు:**

ఏపీలో అభివృద్ధి, సంక్షేమం పక్కకుపోయి.. రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతుందని వైకాపా అధినేత జగన్ విమర్శించారు. అందుకు నిదర్శనం నాగమల్లేశ్వరావు ఘటనే అన్నారు. రెంటపాళ్ల నా పర్యటన అందుకు కారణం అన్నారు జగన్.. జిల్లా పర్యటనలో రెంటపాళ్ళ వెళ్లిన వైసీపీ అధినేత వైఎస్ జగన్న.. ఆత్మహత్య చేసుకున్న వైసీపీ నేత నాగమల్లేశ్వరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు.. పోలీసుల వేధింపులతో ఆత్మహత్య చేసుకున్న వైసీపీ నేత నాగమల్లేశ్వరావు విగ్రహాన్ని ఆవిష్కరించారు.. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు.. ఇక, నాగమల్లేశ్వరరావు ఆత్మహత్యపై వివరిస్తూ.. రెంటపాళ్లలో నాగమల్లేశ్వరావు వైసీపీ నాయకుడు.. గ్రామ ఉప సర్పంచ్.. పోలింగ్ రోజునుంచి రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేశారు. వారికి అనుకూలంగా వున్నవారికి పోస్టింగ్ ఇప్పించుకున్నారు.. 2024 జూన్ లో కౌంటింగ్ రోజున తప్పుడు ఆరోపణలు చేసి నాగమల్లేశ్వరావు ను స్టేషన్ కు తీసుకెళ్ళారు.. ఫలితాలు వచ్చాక నాగమల్లేశ్వరావును ఊర్లోకి రావడానికి వీల్లేదని సీఐ రాజేష్ చెప్పారు.. కాల్చి చంపుతామని బెదిరించారు.. జూన్ 5 వరకూ స్టేషన్ లో ఉంచి అవమానించారు, బెదిరించారని ఆవేదన వ్యక్తం చేశారు. నాగమల్లేశ్వరావు గుంటూరులో ఉన్న సోదరుడు ఇంటికి వెళ్లాడు.. అక్కడనుంచి తండ్రి వెంకటేశ్వర్లుకు ఫోన్ చేశాడు.. తనను పోలీసులు ఏ విధంగా వేధించింది చెప్పారని వెల్లడించారు వైఎస్ జగన్.. తన కొడుకును కాపాడుకునేందుకు కొడుకును ఆసుపత్రిలో చేర్పించారు.. నాగమల్లేశ్వరావుకు భార్య, కూతురు ఉంది. ఇప్పుడు వారికి ఏం సమాధానం చెబుతారు చంద్రబాబు అంటూ సీఎంను నిలదీశారు.. కులప్రస్తావన తీసుకొచ్చి ఒకమనిషి చావుకునకారణమయ్యారు.. ఏడాదిగా కుటుంబం విషాదంలో ఉంది.. నాగమల్లేశ్వరావు ఇంటిపై రాళ్లతో దాడి చేసిన వారిపై ఏం చర్యలు తీసుకున్నారు..? నాగమల్లేశ్వరావు తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదని ఆరోపించారు..పెదనెమలిపురికి చెందిన లక్ష్మీనారాయణ ప్రాణాలకోసం ఆసుపత్రిలో కొట్టుమిట్టాడు తున్నాడు.. సీఐ, ఎస్సై లక్ష్మీనారాయణ ను స్టేషన్ కు పిలిచి వేధించారని మండిపడ్డారు జగన్.. రెండు నెలల తర్వాత డీఎస్పీ పిలిపించారు.. మీరు చట్టం కాపాడడానికి ఉన్నారా? లేదా? అని నిదీశారు.. కమ్మ పుటుక పుట్టావా అని అవమానించారు.. దీంతో, లక్ష్మీనారాయణ పురుగుమందుతాగి సూసైడ్ వీడియో తీసుకున్నారు.. తన చావుకు ఎవరు కారణమో అంతా చెప్పేశాడు.. నాగమల్లేశ్వరావు విషయంలో, లక్ష్మీనారాయణ విషయంలో చంద్రబాబు ఏం సమాధానం చెబుతారు? కమ్మవారు మా పార్టీలో ఉండకూడదా? అని ప్రశ్నించారు.. వ్యతిరేకంగా మాట్లాడితే వెంటాడి వేధించి చివరకుబప్రాణాలు తీసుకునేలా చెస్తారు.. ఏం పాపం చేశారని వారి ప్రాణాలు బలితీసుకున్నారు చంద్రబాబు అంటూ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం భూభారతి చట్టం

**రంగారెడ్డి జిల్లా వెలుతురు జూన్ 18:**




భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం జిల్లాలో సమర్ధవంతంగా అమలయ్యేలా, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను వెంటనే సంబంధిత వెబ్ సైట్ లో అప్లోడ్ చేయాలని జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి రెవెన్యూ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ సి నారాయణ రెడ్డి భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారం పై సంబంధిత ఆర్డీవోలు, తహసిల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను వెంట వెంటనే పరిశీలిస్తూ, నిర్ణీత గడువు లోపు పరిష్కారం అయ్యేలా చొరవ చూపాలన్నారు. భూభారతి చట్టంపై పూర్తి అవగాహన ఏర్పర్చుకుంటే దరఖాస్తులను సకాలంలో, సులభంగా పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా, భూభారతి చట్టంలోని నిబంధనలను తు.చ తప్పకుండా పాటిస్తూ, పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. పెండింగ్ లో ఉన్న మండలాల్లో వెంటనే పరిశీలించి వెబ్ సైట్ లో అప్లోడ్ చేయాలని, లేనియెడల తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలిస్తూ, అందుబాటులో ఉన్న రెవెన్యూ రికార్డుల వివరాలతో సరిపోల్చుకుని, క్షేత్రస్థాయి విచారణను పకడ్బందీగా జరపాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, ఆర్డీవోలు, తహసిల్దార్లు, సంబంధిత రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గౌరవం, భద్రతను అందించేందుకు సామాజిక భద్రత పెన్షన్ పథకం

## - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 18**





సమాజంలో గౌరవం, సామాజిక భద్రత అందించడంతో పాటు రోజువారి కనీస అవసరాలను తీర్చేందుకు సామాజిక భద్రత పథకం అమలు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేయూత ఫించన్లపై అవగాహన కార్యక్రమంలో సెర్ప్ సంచాలకులు గోపాల్రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి కిషన్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్రావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి లతో కలిసి మున్సిపల్ కమీషనర్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వార్డు అధికారులు, తపాలా శాఖ అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వృద్ధులు, దివ్యాంగులు, ఎయిడ్స్ బాధితులు, డయాలసిస్, ఫైలేరియా రోగులు, వితంతువులు, దివ్యాంగ నేత కార్మికులు, కల్లుగీత కార్మికులను రక్షించేందుకు, కష్టతరమైన జీవితాన్ని గడుపుతున్న బీడీ కార్మికులు, బీడీ థెకదార్లు, ఒంటరి మహిళల అవసరాలు తీర్చేందుకు ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని తెలిపారు. 3 ఎకరాల కంటే ఎక్కువ తడి / నీటిపారుదల పొడి, 7.5 ఎకరాల కంటే ఎక్కువ పొడి భూమి కలిగిన వారు, ప్రభుత్వ, ప్రైవేటు రంగ ఉద్యోగాలు చేస్తున్న పిల్లలు ఉన్నా, వైద్యులు, కాంట్రాక్టర్లు, ప్రొఫెషనల్ స్వయం ఉపాధి పొందుతున్న పిల్లలు ఉన్నా, పెద్ద వ్యాపార సంస్థలు కలిగిన వారు, ఇప్పటికే ప్రభుత్వ పెన్షన్లు / స్వాతంత్ర సమరయోధుల పెన్షన్లు పొందుతున్న వారు, ఆటోమొబైల్స్ యజమానులు, గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో నిర్ణీత వార్షిక ఆదాయం కన్నా అధికంగా కలిగిన వారు అర్హులు కాదని తెలిపారు. నెలవారి చేయూత పింఛన్ పంపిణీ 2 పద్ధతులలో జరుగుతుందని, తపాలా శాఖ ద్వారా ఆధార్ ఉపయోగించి బయోమెట్రిక్ ప్రామాణీకరణ, బయోమెట్రిక్ వైఫల్యాలకు పంచాయతీ కార్యదర్శి ప్రామాణీకరణ ద్వారా చెల్లింపులు జరుగుతాయని, బ్యాంకుల ద్వారా ఐ.ఎఫ్.ఎస్.సి. కోడ్, బ్యాంకు ఖాతా నంబరు ఉపయోగించి చెల్లించడం జరుగుతుందని తెలిపారు. పెన్షన్ కొరకు అందిన దరఖాస్తులను అర్హత ప్రమాణాల పరంగా పరిశీలించి అర్హులైన వారికి పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనర్హుల తొలగింపులో భాగంగా వితంతువుల పునర్వివాహం, చెల్లింపు ఫిర్యాదుల పరిష్కారంపై సంబంధిత పెన్షనర్లకు సమాచారం అందించి, మరణించిన పెన్షన్ లబ్ధిదారుల జాబితాను క్రమం తప్పకుండా నవీకరించాలని, ఆధార్ కోసం కె.వై.సి. నవీకరణపై పెన్షన్ లబ్ధిదారులకు సమాచారం అందించాలని తెలిపారు. అర్హులైన పెన్షన్ లబ్ధిదారుల వివరాలను పోర్టల్ లో స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని, విచారణ ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయిలో భౌతిక ధృవీకరణ అనంతరం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. పెన్షన్ పంపిణీ ప్రక్రియను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని, పెన్షన్ పంపిణీలో ఎదురయ్యే సమస్యలను సంబంధిత అధికారుల సమన్వయంతో తక్షణమే పరిష్కరించాలని, లబ్దిదారులు తమ పెన్షన్లను ఎలాంటి ఇబ్బందులు లేకుండా పొందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వితంతువులకు పెన్షన్ బదలాయింపులో నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. 3 నెలలుగా వరుసగా పెన్షన్ తీసుకోకపోతే శాశ్వత వలసగా పరిగణించడం జరుగుతుందని, క్షేత్రస్థాయి సిబ్బంది శాశ్వత వలసలను ధృవీకరించి వివరాలను పోర్టల్లో నమోదు చేయాలని, మరణించిన వారి పెన్షన్ వివరాలను సేకరించి క్రమం తప్పకుండా పోర్టల్లో నవీకరించాలని తెలిపారు. పెన్షన్లకు సంబంధించి ప్రజలు అందించే దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి సంబంధిత అధికారులు త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ కమీషనర్లు, తహశిల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు వారి స్థాయిలలో చేయవలసిన అభివృద్ధి పనులు, రేషన్ కార్డు దరఖాస్తుల పరిష్కారం త్వరితగతిన పూర్తి చేయాలని, రేషన్కార్డులో సభ్యుల జోడింపు / తొలగింపు లపై ప్రజలకు వివరించాలని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు అర్హత గల ప్రతి ఒక్కరికి రాయితీ గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం జరిగిందని, దివ్యాంగుల సంబంధిత ఆన్లైన్ దరఖాస్తులను సదరం శిబిరాల ద్వారా పరిశీలించి అర్హులకు ధృవపత్రాలు జారీ చేయాలని తెలిపారు. మండల, జిల్లా స్థాయిలలో దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని, భూములకు సంబంధించి నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేసి తదుపరి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను 100 శాతం పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, మొక్కలు నాటేందుకు భూములను గుర్తించాలని తెలిపారు. మున్సిపల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలోని పన్నులను 100 శాతం వసూలు చేయాలని తెలిపారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద 20 వేల రూపాయలను ఒకేసారి ఆర్థిక సహాయంగా అందించడం జరుగుతుందని, దారిద్ర రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సామాజిక భద్రత పెన్షన్ పథకం ద్వారా అర్హులైన ప్రతి లబ్దిదారులకు పెన్షన్ అందించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యతో పాటు నైతిక విలువలు నేర్పాలి: డీఈవో




**సంస్థాన్ నారాయణపురం వెలుతురు జూన్ 18:**



చిన్నతనం నుంచి విద్యతో పాటు క్రమశిక్షణ, సేవా భావం, పరోపకార గుణం పెంపొందించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని జిల్లా విద్యాశాఖ అధికారి కే. సత్యనారాయణ ఉపాధ్యాయులకు సూచించారు. రిలయబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో




సంస్థాన్ నారాయణపురం లోని జెడ్పి బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో 350 మంది విద్యార్థులకు రూ.3.50 లక్షలు విలువైన స్టూడెంట్ కిట్స్ ను రిలయబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ తుపాకుల రవి తో కలిసి ఆయన బుధవారం పంపిణీ చేశారు. విద్యార్థి భవిష్యత్తు తరగతి గదిలోనే తీర్చిదిద్ద బడుతుందని, ఉత్తమ విద్యార్థులు దేశానికి ఉపయోగపడతారని అన్నారు. ఒకనాటి నవోదయ విద్యార్థి తుపాకుల రవి ట్రస్టును ఏర్పాటు చేసి నేడు వేల మంది అనాథ, నిరుపేద, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు నోట్ బుక్స్, స్కూల్ బ్యాగులు, బూట్లు, ఆట వస్తువులు, లంచ్ బాక్సులు, పలు రకాల వస్తువులను అందించడం గొప్ప విషయమని అభినందించారు. విద్యాభివృద్ధికి రిలయబుల్ ట్రస్టు మరింత సహకారం అందించాలని కోరారు. ప్రభుత్వ బడులను చదువులమ్మ ఒడిగా మార్చేందుకు సమిష్టిగా కృషి చేయాలన్నారు. దాత రిలయబుల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ తుపాకుల రవిని ఆయన శాలువాతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

**చదువుతోనే ఉన్నత స్థాయికి ఎదుగుతాం: రవి**

సాధారణ కుటుంబానికి చెందిన నేను ప్రభుత్వ జవహర్ నవోదయ విద్యాలయంలో చదువుకున్నానని రిలయబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ తుపాకుల రవి తెలిపారు. తన తల్లిదండ్రులు ఎంతో కష్టపడి తనను ఉన్నత స్థానంలో చూడాలనే కోరికతో చదివించారని, వారి కలలను నిజం చేయాలని పట్టుదలతో తాను చదువుకున్నానని వివరించారు. అబ్దుల్ కలాం, మహాత్మా గాంధీ స్ఫూర్తితో విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని దాన్ని సాధించేందుకు పట్టుదలతో విద్యాభ్యాసం కొనసాగించాలని సూచించారు.








ప్రతి ఒక్కరూ తాము సంపాదించిన దాంట్లో కొంత అవసరమైన వారికి సహాయం చేయాలని కోరారు. ఎన్ని కోట్ల సంపద ఉన్న చనిపోయినప్పుడు వెంట రాదని, తాను చేసిన మంచి పనులే ప్రజల మనసులో ఉంటాయని చెప్పారు. తాను, తన మిత్రులు సంపాదించిన డబ్బులో కొంత రిలయబుల్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నామని వెల్లడించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి కే. ప్రమోద్ కుమార్, మండల విద్యాధికారి గోలి శ్రీనివాస్, సాహితీవేత్త బడుగు శ్రీరాములు, ప్రధానోపాధ్యాయులు రమాదేవి, ఉష, ఉదయ, శివరంజని తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో వేగంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పనులు

**రంగారెడ్డి జిల్లా వెలుతురు జూన్ 18:**




జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పనులను వేగంగా గ్రౌండింగ్, బేస్మెంట్ లెవెల్ నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, బేస్మెంట్ లెవెల్ పూర్తయిన వాటికి బిల్లులు చెల్లించాలని జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఇందిరమ్మ ఇండ్లు గ్రామ, మున్సిపల్ పరిధిలో పారిశుధ్యం పై, వనమహోత్సవం కార్యక్రమం పై జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 56.33% ఇండ్ల గ్రౌండింగ్ అయ్యాయని, 43% ఇంకా కావలసి ఉందని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ పథకానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. జూన్ 25 వరకు ఎలాంటి ఇండ్లు పెండింగ్ లేకుండా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు చేపట్టాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో అతి బీద కుటుంబం మహిళకు బ్యాంక్ లింక్ రుణాలు మంజూరు చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ పూర్తి అయిన 15 రోజులలో రెంటల్ లెవెల్ కు వెళ్లే విధంగా పనిచేయాలని తెలిపారు. ఈనెల 25 లోపు ఇంకా ప్రారంభించని ఇండ్ల జాబితాను రద్దుచేసి కొత్త వారికి అవకాశం ఇవ్వాలని అన్నారు. ఇప్పటి వరకు తక్కువ గ్రౌండ్ చూపించిన మొయినాబాద్, నార్సింగ్ ఇబ్రహీంపట్నం, ఆదిభట్ల మున్సిపాలిటీల అధికారులను వెంటనే చేయించాలని లేనియెడల తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఇండ్ల నిర్మాణంలో ఇసుకకు సంబంధించి అందుబాటులో ఉన్న ఇసుకను ఎక్కడి నుంచైనా తీసుకోవచ్చు అని తెలిపారు. వర్షాకాలం ప్రారంభమైనందున గ్రామ మున్సిపల్ పరిధిలో ఈనెల 20 నుండి 28 వరకు పారిశుద్ధం పై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డ్రైన్లు క్లీన్ చేయించి రోడ్లకు ఇరువైపుల పిచ్చి మొక్కలు లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని తాగునీరు కలుషితం కాకుండా లీకేజీ లేకుండా చూడాలని గ్రామపంచాయతీ మున్సిపల్ లలో అన్ని గుంతలు కల్వర్టులు పూడ్చాలని గ్రామాలలో వీధి దీపాలు లేని ప్రాంతాల్లో కొత్తవి ఏర్పాటు చేయాలని ఈ విషయంపై పెద్ద ఎత్తున స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దీన్ని పరిశీలించుటకు జులై 1 2 3 తేదీల్లో గ్రామాలకు మున్సిపాలిటీలకు ఆడిట్ టీమ్లు సందర్శించి పరిశీలిస్తారని కలెక్టర్ తెలిపారు. ఈ డ్రైవ్ లో సరిగా పని చేయని అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు. వన మహోత్సవం పై కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిర్దేశించిన లక్ష్యాలను అధికారులు పని చేయాలని సూచించారు. మొక్కలు నాటేందుకు అనువైన స్థలాలను గుర్తించాలని, గుంతలు ఏర్పాటు చేయాలని, అవసరమైన మొక్కలు నర్సీలలో అందుబాటులో ఉండే విధంగా చూడాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ సంగీత, జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, సోషల్ వెల్ఫేర్ అధికారి రామారావు, డిపిఓ సురేష్ మోహన్, మైనార్టీ వెల్ఫేర్ అధికారి నవీన్ కుమార్ రెడ్డి, బీసీ సంక్షేమ అధికారి కేషరామ్, పిడి హౌసింగ్ హనుమంతు నాయక్, గ్రామీణ అభివృద్ధి శాఖ పిడి శ్రీలత మెప్మా పిడి మల్లీశ్వరి, డిఈఓ సుశీందర్రావు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పహల్గమ్ లో పెరుగుతున్న రద్దీ




**శ్రీనగర్, జూన్ 17, ( వెలుతురు)**

జమ్మూ కశ్మీర్‌లోని పహల్‌గామ్‌లో జరిగిన ఉగ్రదాడి తరువాత అక్కడి పర్యాటక ప్రదేశాలన్నీ మూతపడ్డాయి. భద్రతా చర్యల కారణంగా మూసివేసిన పర్యాటక ప్రాంతాలను జమ్మూకశ్మీర్ ప్రభుత్వం మళ్లీ తెరిచింది. దాదాపు రెండు నెలల తర్వాత పహల్‌గామ్ పరిసర ప్రాంతాల్లో పర్యాటకుల రద్దీ కనిపిస్తోంది. రహదారులపై వాహనాలు తిరుగుతున్నాయి. మార్గమధ్యంలో ప్రజలు ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ సెల్ఫీలు దిగుతున్నారు. పహల్గాంతో సహా చుట్టు పక్కల ప్రాంతాలకు పర్యాటకుల తాకిడి పెరిగింది. పర్యాటకుల రద్దీతో పలు చోట్ల వాహనాల రద్దీ ఏర్పడింది. పర్యాటక శాఖ పునరుద్ధరణకు చర్యలు వేగవంతం చేసింది. జమ్మూ-కశ్మీర్‌లో ఎలాంటి వాతావరణ పరిస్థితులు ఉన్నప్పటికీ ఎప్పుడూ పర్యాటకులతో రద్దీగా ఉండేది. అక్కడి స్థానికులు దాదాపు టూరిజం మీదనే ఆధారపడి జీవిస్తున్నారు. కానీ, ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రవాద దాడి కాశ్మీర్ లోయలోని పర్యాటక రంగాన్ని తీవ్రంగా దెబ్బతీసింది. గతంలో మాదిరిగా ప్రస్తుతం పర్యాటకుల రావడంలేదని స్థానికులు చెబుతున్నారు. ఈనెల 17 నుంచి మూసీవున్న ప్రాంతాలను తిరిగి పర్యాటకుల సందర్శనార్థం అనుమతిస్తే కొంత మేర పరిస్థితి మెరుగవుతుందని అక్కడి స్థానికులు, చిరు వ్యాపారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# మళ్లీ ఐ ప్యాక్ టీమ్ తోనే...




**విజయవాడ, జూన్ 17, ( వెలుతురు)**

వైసీపీ అధినేత వైఎస్ జగన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. మరొకసారి ఐప్యాక్ పై ఆధారపడుతున్నారా? అంటే అవుననే అనిపిస్తుంది. ఈసారి కూడా ఐ ప్యాక్ టీంతో నే ఎన్నికలకు వెళ్లాలని ఆయన నిర్ణయించినట్లు తెలిసింది. క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసుకుని తనకు అప్పగించడమే కాకుండా ఎప్పటికప్పుడు నివేదికలను అందించడానికి ఐ ప్యాక్ టీం ను తిరిగి యాక్టివ్ చేయాలని వైఎస్ జగన్ నిర్ణయించారు. ఈ మేరకు గత ఎన్నికల్లో పనిచేసిన వారిని ఈసారి కూడా వినియోగించుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది. మరోసారి సర్వేలకు రెడీ అవ్వాలని ఐ ప్యాక్ టీంను ఆదేశించినట్లు తెలిసింది. మొన్నటి ఎన్నికల్లో ఓటమి చెందిన తర్వాత ఐప్యాక్ కార్యాలయాన్ని కూడా తీసి వేశారు. అయితే తిరిగి ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. జనంలో మంచి ఊపు ఉందని, అయితే ఫీల్డ్ లెవెల్ లో తనకు ఖచ్చితమైన సమాచారం తెలియాలంటే ఐ ప్యాక్ టీం అవసరాన్ని గుర్తించిన జగన్ మరోసారి దానిని రంగంలోకి దించాలని నిర్ణయించారని తెలిసింది. త్వరలోనే ఐ ప్యాక్ టీం తిరిగి ఆంధ్రప్రదేశ్ లో కార్యక్రమాలను ప్రారంభిస్తుందని కూడా పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. వైసీపీ అధినేత వైఎస్ జగన్ కు 2019లో అధికారాన్ని తెచ్చిపెట్టిన ఐ ప్యాక్ సంస్థ మొన్నటి ఎన్నికల్లో ఓటమి తర్వాత దుకాణం మూసివేసింది. ఈ సంస్థ బీహార్ కు చెందిన ప్రశాంత్ కిషోర్ దే అయినప్పటికీ ఆయన 2019 ఎన్నికల ఫలితాల తర్వాత ఆయన బీహార్ రాజకీయాలకు పరిమితమయ్యారు. దీంతో ఐప్యాక్ సంస్థలో పనిచేసిన వారు దానిని నిర్వహిస్తున్నారు. 2024 ఎన్నికలకు కూడా వైఎస్ జగన్ మరోసారి గెలిచేందుకు ఐప్యాక్ సంస్థను కొనసాగించారు. ఐప్యాక్ సంస్థకు రుషిరాజ్ నేతృత్వం వహించారువారి ఖాతాల్లో మరికొంత నగదు మళ్లీ రుషిరాజ్ నేతృత్వంలోనే? తిరిగి రుషిరాజ్ నేతృత్వంలోనే ఐ ప్యాక్ సంస్థ పనిచేసేందుకు సిద్ధమవుతున్నారని తెలిసింది. జనాభా గణన మొదలు కానుండటంతో పాటు 2027లో ఎన్నికలు జరుగుతాయన్న ప్రచారంతో జమిలి ఎన్నికల నేపథ్యంలో ఐ ప్యాక్ ను త్వరగానే రంగంలోకి దించాలని వైఎస్ జగన్ భావిస్తున్నార. ఎప్పటి లాగానే ఐ ప్యాక్ సంస్థ అభ్యర్థుల ఎంపిక నుంచి ప్రచారం వరకూ, సోషల్ మీడియాలో ప్రచారం వరకూ అంతా తానే చేసుకునేలా ఒప్పందం కుదుర్చుకునే అవకాశాలున్నాయని పార్టీ సీనియర్ నేత ఒకరు తెలిపారు. ఒక్కోసారి వైఫల్యాలు ఉంటాయని, అది జనం మనసులను అంచనా వేయడంలో తప్పు అయినా, దాని అవసరం తమకు ఉందని గుర్తించిన జగన్ తిరిగి ఐ ప్యాక్ ను రెడీ చేస్తున్నట్లు తెలిసింది.

## ప్రభుత్వ పాఠశాలలో అసాంఘిక కార్యకలాపాలకు నిలయం

**హైదరాబాద్, జూన్ 17, ( వెలుతురు)**

అసాంఘిక కార్యకలాపాలకు ప్రభుత్వ పాఠశాలలు నిలయాలుగా మారుతున్నాయి. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న జిల్లెలగూడ చల్లా లింగారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శిర్లాయిల్స్‌లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, లెనిన్ నగర్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలలో గంజాయి రాయుళ్లు స్వైర విహారం చేస్తున్నారని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డ్రగ్స్, గంజాయి సేవించిన మత్తులో ఏం చేస్తున్నారో వారికే తెలియడం లేదు. పాఠశాలలో ఉన్న లైట్లు, ఫ్యాన్లు, స్విచ్ బోర్డులు ధ్వంసం చేస్తున్నట్లు ఉపాధ్యాయుల పేర్కొంటున్నారు. ఇలా ఎందుకు చేస్తున్నారని అడిగేందుకు ప్రయత్నం చేస్తున్న తమపై గంజాయి రాయుళ్లు ఎదురుదాడికి పాల్పడుతున్నారని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీసీ కెమెరాలను ధ్వంసం చేయడం, వాటర్ పైప్ లైన్లు, నల్లాలను సైతం ఎత్తుకుపోయినట్లు టీచర్లు పేర్కొంటున్నారు.జిల్లాలగూడ చల్లా లింగారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మూడు లక్షల వరకు నష్టం జరిగినట్లు మండల విద్యాధికారి కృష్ణయ్య పేర్కొన్నారు. గంజాయి రాయుళ్లు చేస్తున్న అరాచకాలపై మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా టీచర్లకు, విద్యార్థినులకు రక్షణ లేకుండా పోతుందని వాపోయారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శిర్లాహిల్స్ లో ఉన్న ప్రాథమిక పాఠశాలలో సైతం సైతం ఇలాంటి ఘటనలు పునరావృత్తం అవుతున్నట్లు టీచర్లు పేర్కొంటున్నారు. గంజాయి సేవిస్తున్న వారిని పట్టుకొని పోలీసులకు అప్పగించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాలకు రక్షణ లేకపోతే ఇక సుదూర ప్రాంతాలలో ఉన్న పాఠశాలల పరిస్థితి చెప్పనవసరం లేదు. ఉపాధ్యాయులు ఫిర్యాదులు చేస్తున్న పోలీసులు ఎందుకు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. గంజాయి రాయుళ్లు ప్రభుత్వ పాఠశాలలలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతుంటే పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరించడం పట్ల విమర్శలు వెలువెత్తుతున్నాయి.ప్రభుత్వం డ్రగ్స్, గంజాయి నిరోధించడానికి కఠిన చర్యలు తీసుకోవాలని పదేపదే చెప్తున్నప్పటికీ ఎక్కడ కూడా సత్ఫలితాలు వచ్చిన సందర్భాలు కనిపిస్తలేవు. ప్రభుత్వ పాఠశాలలే కాకుండ, చెరువుల సమీపంలోనూ గంజాయి రాయుళ్లు తిష్ట వేస్తున్నారని కాలనీవాసుల నుంచి సైతం పోలీసులకు ఫిర్యాదులు చేస్తున్నారు. ఎవరు ఎన్ని ఫిర్యాదులు చేసినా గంజాయి రాయుళ్లను నియంత్రించడంలో పోలీసులు విఫలం చెందుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఫిర్యాదులకు స్పందించి గంజాయి రాయుళ్లపై చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడంపై పలు అనుమానాలకు తావిస్తున్నట్లు ఫిర్యాదుదారులు పేర్కొంటున్నారు. జిల్లెల్లగూడ చల్లాలింగారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గంజాయి రాయుళ్లు ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. లైట్లు, సీసీ కెమెరాలు, పైపులు ధ్వంసం చేశారు. రెండు లక్షల వరకు నష్టం జరిగింది. మళ్లీ రూ. 1,50,000 పెట్టి అన్ని రిపేర్ చేయించాం. మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు కూడా చేశాం. ప్రభుత్వ పాఠశాలలకు రక్షణ కల్పించాలి. సాయంత్రం అయిందంటే గంజాయి రాయుళ్లు తిష్ట వేస్తున్నారు అని ఎంఈవో పేర్కొన్నారు.

### కొమ్మనపెంట ఆదివాసీ చెంచు గిరిజనుల అవస్థలు పట్టించుకునే నాధుడే లేడు.

# మాకు ప్రభుత్వ సాయం అందదా..!

- గత మూడేళ్ల గా ఐటీడీఏ ద్వారా ఎలాంటి సహకారం లేదు
- ఓట్ల కోసము వచ్చిన నేతలు.. అనంతరం పట్టించుకోరు
- రోడ్డు బాగుచేసి ఇందిరమ్మ ఇండ్లు కట్టించండి మహాప్రభో
- ప్రభుత్వ వైద్యం కొమ్మనపెంట గిరి జనులకు అందని ద్రాక్షనే
- ఐదేళ్ల లోపు పిల్లలకు అంగన్వాడి పౌష్టిక ఆహారం అందదు

**వెలుతురు న్యూస్, అమ్రాబాద్ జూన్ 18:**

నాగర్ కర్నూలు జిల్లా అమ్రాబాద్ మండలం నల్లమల్ల లోతట్టు ప్రాంతంలోని అమ్రాబాద్ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న కొమ్మనపెంట ఆదివాసి గిరిజన చెంచుగూడెం ఉంది. ఈ గూడెంలో 34 కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నాయి. గత మూడేళ్ల నుండి ఐటీడీఏ ద్వారా ఎలాంటి సహకారం వీరికి అందడం లేదు. ప్రభుత్వ పథకాలు అంతంత మాత్రమే.. వ్యవసాయం చేయాలని ఆసక్తి ఉన్నప్పటికీ కావలసిన కాడెద్దులు లేకపోవడం అందుకు ఐటిడిఏ ఆదివాసీల అభివృద్ధి కోసం దీర్ఘకాలిక ప్రణాళికలు చేయడంలో అలసత్వం చేయడం వలన ఆ కొమ్మనపెంట చెంచుగూడెంఇప్పటికీ అందమైన అడవి తల్లి ఒడిలో బొడ్డు గుడిసెలల్లో ఉంటూ అడవిలో కాస్తగా లభించే అటవీ పలసాయాలను సేకరిస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. మిగతా ఆదివాసి గుడాలల్లో ఆర్డిటి స్వచ్ఛంద సంస్థ ద్వారా లేదా ఐటీడీఏ ద్వారా పక్కా గృహాలు నిర్మించారు. ప్రభుత్వ వైద్య సదుపాయాలు, ఐదు సంవత్సరాల లోపు చిన్న పిల్లలకు అంగన్ వాడి కేంద్రం ద్వారా పౌష్టిక ఆహారము వారికి ఏడాదికి ఒక్కసారి కూడా సేవలు అందవు, కానీ కొమ్మనపెంటలో అటవీ శాఖ అధికారుల ఆటంకాల ,లేక ఏమైనా కారణాలా వారికి మాత్రం పక్కా గృహాలు నిర్మించడంలో ఐ టి డి ఏ అధికార యంత్రాంగం ఇతర అధికారులు పూర్తిగా విఫలం చెందారని విమర్శలు ఉన్నాయి. ఆ గూడెం లో ఉన్న 70 సం.ల ఉడతల లింగయ్యకు ఇంతవరకు పెన్షన్ లేదు. పది కుటుంబాలకు రెషన్ కార్డులు లేవు, త్రాగునీటి వసతికి సోలార్ బోర్ మోటార్ దిక్కు.. అది పనిచేయకపోతే ఆ గూడెం నుండి సుమారు 1.5 కీ మీ దూరం బండల రేవు వద్దకు వెళ్ళాలి. గడిచిన మూడేళ్లగా ఐటీడీఏ నుండి ఎలాంటి సాయం అందడం లేదని ఆ పెంటవాసులు వాపోతు... ఇక్కడ నుండి వెళతామని ఎప్పుడూ కూడా అటవీశాఖ అధికారులకు అంగీకారం తెలుపలేదని గూడెం వాసులు ముక్తకంఠంతో తెలుపుతున్నారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి మాచారం గ్రామంలో గత నెల 19న "సౌర జల గిరి వికాస పథకం ను" ప్రారంభించారు. ఆ పథకాన్ని మా వ్యవసాయ భూములలో అమలు చేయాలని కోరుతునారు. వారివి గొంతెమ్మ కోరికలు కావు గొంతు ఎండుతున్న కోరికలు ప్రభుత్వం ఆదివాసీల అభివృద్ధి కోసం ఏవైతే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారో.. ఆ పథకాలు మాకు వర్తిప్పాచేయాలనీ ఆ గూడెం ఆదివాసీలు కోరుతున్నారు. మా సమస్యలు బయట సమాజానికి, అధికార యంత్రంగానికి తెలియాలంటే మీడియా ద్వారానే సాధ్యమవుతుందని గమనించిన ఆదివాసీలు అక్కడ సిగ్నల్ లేకపోయినా.. గుడానికి కొద్ది దూరములో ఒక చెట్టునెక్కి మండ్లి గోపి అనే వ్యక్తి వెలుతురు దినపత్రికకు ఫోను చేసి తెలిపారు. ఉండడానికి పక్కా ఇందిరమ్మ నివాసం, రోడ్డు సౌకర్యం, వైద్య సదుపాయాలు, వ్యవసాయం చేసుకోవడానికి కాడెద్దులు, పోడు భూములకు అటవీ హక్కు పత్రాలు కల్పించాలని వారు కోరుతున్నారు.

**దారి పూర్తిగా అధ్వానం గా మారింది ఆపద వస్తే అంతే..**

శ్రీశైలం జాతీయ రహదారి నుండి కొల్లంపెంట



బేస్ క్యాంపు నుండి అటవీ శాఖ అధికారులు ఆ పెంటవరకు రహదారి కాస్త మరమ్మతులు చేశారు.. కొమ్మనపెంటవరకు రోడ్డు మార్గం అధ్వానంగా ఉంది. మరమ్మత్తులు చేయాలని ఆ గూడెం వాసులు అటవీశాఖ అధికారులకు వేడుకున్న నిధులు లేవు అని వదిలేశారన్నారు. దాదాపు 6 కిలోమీటర్ల దూరం అతి కష్టంగా ప్రయాణం చేయాల్సి ఉంటుంది. వర్షాకాలంలో ఆ రహదారి మరింత అధ్వానంగా మార్గం మధ్యలో మూతుల వాగు, మషమ్మ మడుగు వద్ద వాగు పెద్ద మొత్తంలో పారుతుంది. ఈ క్రమంలో కొమ్మనపెంట ఆదివాసీలకు ఏదైనా అనారోగ్య సమస్య, ఆపద వస్తే ఎటు వెళ్లడానికి అవకాశం ఉండదు.. అంతే సంగతులు.. ప్రాణాలు గాల్లో కలవాల్సిందే నని ఆదివాసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఓట్ల సమయం లో నేతలు వస్తారు,ఆ తర్వాత మళ్లీ రారు**

ఓట్ల సమయంలో నాయకులు ఎంత ఇబ్బంది అయినా కూడా పెద్ద పెద్ద కార్లు వేసుకొని మా అడవి బిడ్డలని వస్తారు అది చేస్తాం ఇది చేస్తాం అని మీకు ఆపద వస్తే ఈ నెంబర్లకు ఫోన్ చేయాలని ఇచ్చి పోతారు.. ఓట్లు అయిపోయినంక ఆ తర్వాత మమ్ములను మా బాధలను పట్టించుకునే నాధుడే ఉండరు మా బ్రతుకు ఇక్కడే మాకు ఇక్కడే ఇందిరమ్మ ఇండ్లు కట్టించాలి, ఆర్ డి టి సంస్థ లేకపోతే మా ఆరోగ్యాలకు ఆ దేవుడే దిక్కని చిగుర్ల నాగమ్మ మాట్లాడుతూ అన్నారు.

ప్రభుత్వ వైద్యులు ఏనాడు ఈ పెంట వైపు కన్నెత్తి చూడరు. ఆర్డిటి అపోలో వైద్యులు వచ్చి అప్పుడప్పుడు చూసి పోతుంటారని, ప్రభుత్వ వైద్యులు ఏడాదికి ఒక్కసారి వచ్చిన గోలి మందులు ఇచ్చి పోతారు సూది మందు ఇవ్వరని,అన్నారు. ఈ కొమ్మనపెంట గ్రామంలో 60 కుటుంబాలకు ఆర్ఓఆర్ భూములు ఉంటే ఆరుగురికి మాత్రమే ఆర్ ఓ ఎఫ్ ఆర్ భూమి హక్కు పత్రాలు ఉన్నాయని మిగతా వారికి కూడా అటవీ శాఖ వారు ఇస్తానని ఇవ్వలేదని అన్నారు. ఉడతల వెంకటయ్య మాట్లాడుతూ జ్వరంతో బాధపడుతూ నెల క్రితం లింగమ్మ ( 50 )అనే మహిళ చనిపోయిందని తెలిపారు.

**వేసవిలో నీటి కోసం ఇబ్బంది పడ్డాం...**

మా గుడెంలో ఉన్న సోలార్ బోరు వేసవిలో చెడిపోయిందని ఈ క్రమంలో నీటి కోసం చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. దాదాపు రెండు కిలోమీటర్లు కాలినడకన అడవిలో వెళ్లి బండలరేవు వద్ద నీళ్లు తెచ్చుకున్నాము. నాకు ముగ్గురు సంతానం ఏనాడు కూడా టీకా మందులు వేసిన సందర్భం లేదని, పిల్లలకు అంగన్వాడి భోజనం అందించలేదు రెండుమూడు నెలలకు ఒకసారి అమ్రాబాద్ కు వెళితే అక్కడ ఉంటే తెచ్చుకుంటాం లేకపోతే అంతే.

**స్థానికంగా వసతులు కల్పించాలి..**

స్థానికంగా మా గుడిలోనే కనీస వసతులు కల్పించాలి ఇక్కడే ఆకు అలం తిని బ్రతుకుతాం ప్రభుత్వ సహాయం ఏ మాత్రం అందడం లేదు ఉండడానికి పక్కా గృహాలు నిర్మించాలని అధికారులకు దండం పెట్టి వేడుకుంటున్నాం. అని శీలం వెంకటయ్య విజ్ఞప్తి చేశారు.

**ఐటీడీఏ అధికారి జాఫర్**

కొమ్మనపెంట ఆదివాసి గిరిజనులకు ఏమైనా పక్కా గృహాలు మంజూరు చేశారా అని సీనియర్ అధికారి అయిన జాఫర్ ను వెలుతురు దినపత్రిక వివరణ కోరగా ఆయన మాట్లాడుతూ.. సి సి డి పి ద్వారా కొమ్మనపెంటకు 31 గృహాలు మంజూరు అయ్యాయని, గతంలో వారు రీ లోకేషన్ కోసం సానుకూలత తెలపడం వలన నిర్మాణాలను చేపట్టలేక పోయామని, అలాగే ఆదివాసి ఐదు సంవత్సరాల లోపు ఉన్న బాల బాలికలకు గతంలో మాదిరిగా న్యూట్రిషన్ ఫుడ్ అందించేందుకు సమాలోచన జరుగుతుందన్నారు.

# వరంగల్ అండ, కొండాపై కొందరి కుట్రలు


- కుట్రదారులకే వంతపాడుతున్న పోలీసులు
- రెడ్డిలకు ఒక విధంగా... పోలీసులకు మరొక విధంగా పోలీసుల ప్రవర్తనపై విమర్శలు
- ఢిల్లీలో రాహల్ గాంధీ బీసీ నినాదం రాష్ట్రంలో బీసీ నేతలపైనే కాంగ్రెస్ అగ్రవర్ణ నేతల కుట్రలు
- బీసీలపై దాడి చేస్తే ఊరుకేనేది లేదంటున్న బీసీ సంఘాలు

**వరంగల్ వెలుతురు జూన్ 18:**

కొండా మురళి... ఉమ్మడి వరంగల్ జిల్లాకి ఒక అండా... దండా. యావత్ తెలంగాణ ప్రజానీకానికి కొండా ఫ్యామిలీ గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. అణగారినవర్గాల ఆశాజ్యోతి, బడుగు, బలహీనవర్గాలకు కొండా మురళీనే కాదు.. ఆయన ఫ్యామిలీ కూడా ఒక భరోసా. ఓరుగల్లు ప్రాంతంలో అన్నివర్గాలకి నిత్యం అండగా ఉండే కొద్ది మంది నాయకుల్లో ముందు వరసలో ఉండే వారిలో కొండా మురళీ ఒకరు. మొదటి నుంచి నిరు పేదల కోసం మురళీ అహర్నిశలు పోరాటం చేస్తుంటాడు. అప్పట్లో మావోయిస్టులు, పోలీసుల మధ్య సంఘర్షణ పూరిత వాతావరణాన్ని తగ్గించేందుకు తన ప్రాణాలను కూడా లెక్క చేయకుండా అలుపెరగకుండా కృషి చేసి నేత కొండా మురళీ. దొరతనం, పటేల్ తనం పేద ప్రజలకు ఒక శాపంగా మారిందని, అందుకే... పటేల్, పట్వారి వ్యవస్థను పూర్తిగా రద్దు చేయాలని ప్రాణాలకు ఎదురొడ్డి మరీ పోరాడిన ధీరుడు కొండా మురళి. చివరకు తన పేరులో కూడా పటేల్, రావు అనే ట్యాగ్ లైన్స్ ను త్యజించిన గొప్ప నాయకుడు. ఇప్పటి రాజకీయ వ్యవస్థలో ఎవరైనా ఉన్నార%శీ%టే అది కేవలం కొండా మురళి మాత్రమే. పోలీసు, మావోయిస్టుల సంఘర్షణలో కొండా మురళీపై ఆనాడు మావోయిస్టులు కూడా ఫైరింగ్ చేశారు. ఆ కాల్పులను ఎదుర్కొంటూ... తన శరీరం మొత్తం బుల్లెట్ల గాయాల పాలైనా, మొక్కవోని సంకల్పంతో తాను ఎంచుకున్న లక్ష్యం కోసం పేద ప్రజలకి న్యాయం చేయాలన్న ఒకే ఒక సిద్ధాంతంతో ముందుకు వెళ్తున్న మహా నాయకుడు కొండా మురళీ. ఈ మధ్య కొండా మురళీ ప్రతిష్టతను దెబ్బతీయాలని కొంతమంది కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈ మధ్య జరిగిన ఒక ఇన్సిడెంట్ సర్వత్రా తెలిసిందే. వాస్తవానికి కొండా మురళీకి గన్ మెన్లు ఉండడం ఈరోజు కొత్తేమీ కాదు. ఎన్నో ఏళ్లుగా ఆయనకు గన్ మెన్లు ఉంటున్నారు. ఈ విషయాన్ని కొంతమంది రాజకీయం చేసి, బురదజల్లే ప్రయత్నం చేసి, అభాసుపాలవుతూ... వారి కురుచ బుద్ధిని బయటపెట్టుకుంటు న్నారు. ఆకాశం మీద ఉమ్మి వేయాలనుకుంటే... అది తమపైనే పడుతుందన్న కనీస స్పృహను మరిచి ప్రవర్తిస్తున్నారు. 1993 నుంచే కొండా మురళీకి గన్ మెన్లు ఉన్నారు. అంటే.. సుమారు 25 ఏండ్ల నుంచి మురళీకి గన్ మెన్లు ఉంటున్నారు. కొన్ని సందర్భాల్లో గత పాలకులు మురళీకి ఉన్న గన్ మెన్లను తీసేసి, ఆయన ప్రాణానికి హాని తలపెట్టాలని చూశారు. ఆ సమయంలో కొండా మురళీ న్యాయస్థానాలను ఆశ్రయించి... గన్ మెన్లను కేటాయించాలని గత ప్రభుత్వానికి గుర్తు చేయించారు. కోర్టు ఆదేశంతో ప్రభుత్వం కూడా గన్ మెన్లను కొనసాగించిన పరిస్థితి. అప్పటికీ, ఇప్పటికీ వరంగల్ గడ్డమీద పెద్ద మాస్ లీడర్ ఎవరైనా



ఉన్నారంటే... అది కొండా మురళీనే. అంతటి మాస్ లీడర్ ఎక్కడకు వెళ్లినా... వరంగల్ లో ఆయన చూసేందుకు జనం పెద్ద సంఖ్యలో తరలివచ్చి... వారి అప్యాయతను, అభిమానాన్ని చాటుకుంటుంటారు. కొండా మురళీ కూడా అంతేస్థాయిలో తన వద్దకు వచ్చే ప్రజానీకాన్ని అక్కున చేర్చుకుని... వారి కష్టసుఖాలను వింటుంటారు. ఏమైనా సమస్యలు ఉంటే అక్కడికక్కడే పరిష్కరిస్తుంటారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొండా మురళీ ఏ ప్రాంతానికి వెళ్లినా... కనీసం 1000 నుంచి 1500 మంది స్వచ్ఛందంగా ఆయన అభిమానులు ఆయన్ను చూసేందుకు, కలిసేందుకు వస్తుంటారు. అటువంటి సందర్భాల్లోనే ఈ మధ్య వరంగల్ లోని ఒక ప్రదేశానికి వెళ్తే... జనం భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఆ సందర్భంలో అక్కడ లా అండ్ ఆర్డర్ సమస్య రాకుండా ఉండాలని... స్థానిక పోలీసులు కొండా మురళికి ఎస్కార్ట్ ఏర్పాటు చేశారు. దీన్ని అగ్రకులానికి చెందిన సోషల్ మీడియా, మొతెబరి నాయకులుగా చెప్పుకునే వాళ్లు... దీన్ని ఒక ఇష్యూ చేయడం బీసీలపై కుట్రగానే భావిస్తున్నారు పలువురు.


MEMO
Office of the Commissioner of Police, Warangal
Commissioner of Police, Warangal

**అక్కడ అలా ఇక్కడ ఇలా ఇలాగైతే ఎలా పోలీసులన్న?**

ఇక నిత్యం రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులు తిరుపతిరెడ్డి, కొండల్ రెడ్డిలకు ఏ హోదాలో... మరే విధంగా పోలీసు అధికారులు ఎస్కార్ట్ ఇస్తున్నారని ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. ఆయా జిల్లా కలెక్టర్లు పెద్ద ఎత్తున ఎందుకు సీఎం సోదరులకు స్వాగతాలు ఇస్తున్నారని ఇటు అధికారపక్షం, అటు ప్రతిపక్షంలో చర్చనీయాంశం అవుతున్నది. ఈ విషయంపై స్వయంగా సీఎం సమాధానం చెప్పగలరా? ఎమ్మెల్యే కడియం శ్రీహరి అల్లుడికి ఉమ్మడి వరంగల్ జిల్లాలో పోలీసులు ఎందుకు ఎస్కార్ట్ ఇస్తున్నారనే ప్రశ్నలు ఎదురవుతున్నాయి. ఇదే వరంగల్ లో వేం నరేందర్ రెడ్డికి, ఆయన కుటుంబ సభ్యులకు ఎందుకు పోలీసులు ఎస్కార్ట్ ఇస్తున్నారని పబ్లిక్ చర్చించుకుంటున్నారు. వాళ్లందరికీ పోలీసులు ఎస్కార్ట్ ఇస్తున్నప్పుడు.. వారికి అక్కడి పోలీసులకు ఎటువంటి మెమోలు జారీ చేయనప్పుడు... కేవలం కొండా మురళీకి ఎస్కార్ట్ ఇచ్చారనే ఒక కారణంతో పోలీసులకు మెమో జారీ చేస్తున్నారంటే దీన్ని ఏమని అర్థం చేసుకోవాలి. అంటే... ప్రభుత్వానికి, పోలీసులకు బీసీలు అంటే అంత చిన్న చూపా? ఇదే విషయంపై బీసీ సంఘాలు చర్చించుకుంటున్నాయి. పోలీసులు, ప్రభుత్వం బీసీ వ్యతిరేకమా? బీసీలు అంటే గిట్టడం లేదా..? కాంగ్రెస్ ప్రభుత్వం అంటే రెడ్డి రాజ్యమా? కాంగ్రెస్ ప్రభుత్వం అంటే అగ్రకులాల రాజ్యం అనే ప్రశ్నలు ప్రధానంగా అందరిని మెదళ్ళను తొలుస్తున్నాయి. ఒకవేళ వరంగల్ లో పోలీసులు కొండా మురళీకి ఎస్కార్ట్ ఇచ్చిన వారికి మెమోలు ఇచ్చారంటే? వేరే ప్రాంతాల్లో కూడా అధికారంలో లేని వారికి ఎస్కార్ట్ ఇచ్చినపుడు వారికి కూడా పోలీసులు మెమో ఇవ్వాలి కదా! పోలీసు ఉన్నతాధికారులు నిజంగా పారదర్శకంగా వ్యవహరించి ఉంటే... కేవలం కొండా మురళీ ఇష్యూను రాజకీయం చేయడం ఎంతవరకు సరైంది? ఈ పద్ధతి కాంగ్రెసులో ఉన్న రెడ్డిల ద్వంద విధానం కాదా? కపటనీతి కాదా?

**రాహుల్ బీసీ నినాదం, రాష్ట్రంలో కాంగ్రెస్ బీసీ లీడర్లపై కుట్రలు**

ఒకవైపు కాంగ్రెస్ పార్టీ జాతీయ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ.. "బీసీ సిద్ధాంతం, బీసీ నినాదం, బీసీల హక్కులను కాపాడాలి, బీసీలు వెనుకబడ్డ వాళ్ళు, బీసీల కోసం ప్రయత్నం చేస్తుంది మా పార్టే" అంటారు. మరి ఇక్కడ తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం... ఒక బీసీ బిడ్డ కొండా సురేఖ, బీసీ నాయకుడు కొండా మురళీ పోలీసులు చిన్నపాటి రక్షణ ఏర్పాటు చేస్తే? దాన్ని సహించలేకపోతున్నారు కొందరు రెడ్డి రాజకీయ నాయకులు. వారికి సంబంధించిన నాయకులు. పోలీస్ డిపార్ట్ మెంట్ ఇచ్చే మెమోలు కావాలని బయట పెట్టింది ఎవరు? దీనికి వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ సమాధానం చెప్పాల్సిన అవసరం కూడా ఉంది. కావాలని బీసీ బిడ్డలైన కొండా మురళీ, కొండా సురేఖ మీద ఉద్దేశపూరితంగా దాడి జరగడం, కుట్రలు, కుతంత్రాలు చేయడం ఎంతవరకు సరైంది? దీన్ని ఖండించేందుకు ఈరోజు బీసీ సమాజమంతా ఏకమైంది. అసలు సిసలైన కాంగ్రెస్ కార్యకర్త కొండా మురళీ మీద టీడీపీ నుంచి వలసొచ్చిన కొందరు నాయకులు కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ.. సొంత పార్టీ నేతలపై దాడి చేస్తే సహించేది లేదంటోంది బీసీ సమాజం. చివరిగా చెప్పేదేమిటంటే... కొండా మురళీ మీద కుట్ర చేయడం... ఆకాశం ఉమ్మివేయాలనుకోవడం రెండు ఒకటేనని... వారిపైనే పడుతుందన్న... వారు చేస్తున్న కుట్రలు కూడా వికటిస్తాయన్న విషయం గుర్తుంచుకోవాలని వరంగల్ ప్రజలు బహిరంగంగా చర్చించుకోవడం కొసమెరుపు.

# ఎనిమిదేళ్ల నుంచి నరకం




హైదరాబాద్, జూన్ 17, ( వెలుతురు)

నగరంలో ట్రాఫిక్ తగ్గించే చర్యల్లో భాగంగా అంబర్‌పేట ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టారు. 8 ఏండ్లుగా ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు సాగడంతో అంబర్ పేట ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎట్ట కేలకు ఇటీవలే ఫ్లై ఓవర్ అందుబాటులోకి వచ్చినా.. పక్కా ప్రణాళిక కుండా ఏర్పాటు చేసిన ఫ్లై ఓవర్ నిర్మాణంతో స్థానిక ప్రజలు నిత్యం నరకం అనుభవిస్తున్నారు.కనీసం సర్వీసు రోడ్లు వేయకుండానే ఫ్లై ఓవర్‌ను కేంద్ర, రాష్ట్ర మంత్రులు అధికారికంగా ప్రారంభించి చేతులు దులుపేసుకున్నారు. ప్రధానంగా అంబర్ పేట చే నంబరు చౌరస్తా నుంచి గోల్నాక వెళ్లే సర్వీసు రోడ్డు అందుబాటులోకి రాకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారు.అంబర్ పేట ఫ్లై ఓవర్ నిర్మాణానికి మొత్తం రూ.415 కోట్ల ఖర్చు కాగా, అందులో భూ నిర్వాసితుల కోసం జీహెచ్‌ఎంసీ నిధులు రూ.192 కోట్ల వాటాగా ఉంటే.. దాదాపు రూ.323 కోట్ల నిధులు నేషనల్ హైవే అథారిటీ వెచ్చించింది. 8 ఏండ్లుగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న అంబర్ పేట వాసులకు ఇటీవల ఫ్లై ఓవర్ అందుబాటులోకి వచ్చినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. ఇదిలా ఉంటే అంబర్ పేట చే నంబరు చౌరస్తా నుంచి గోల్నాక చౌరస్తా వరకు ప్రతి నిత్యం వేలాదిగా వాహన దారులు ప్రయాణిస్తుంటారు.ఫ్లై ఓవర్ నిర్మాణంలో భాగంగా ఈ సర్వీసు రోడ్డు కొన్నేండ్లుగా మూసి వేశారు. దీంతో చే నంబరు చౌరస్తా నుంచి జిందా తిలస్మాత్ మీదుగా గోల్నాక చౌరస్తా వరకు దాదాపు కిలో మీటరు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. దీంతో స్థానికులతో పాటు సర్వీసు రోడ్డు వైపు మీదుగా ఉన్న షాపుల్లో వ్యాపారాలు లేక వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారు.

# నార్త్ రింగరోడ్డుకు మహర్ధశ

హైదరాబాద్, జూన్ 17, ( వెలుతురు)



తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సంగతి తెలిసిందే. ఉత్తర, దక్షిణ రెండు భాగాలుగా ప్రస్తుతం ఉన్న ఔటర్ రింగు రోడ్డు నుంచి సుమారు 40 కి.మీ దూరంతో ఈ ప్రాజెక్టుని నిర్మిస్తున్నారు. అయితే ఉత్తర భాగం పనుల టెండర్లపై ప్రస్తుతం ఉత్కంఠ కొనసాగుతోంది. బిడ్లు సమర్పించడానికి జూన్ 18 వరకు మాత్రమే గడువు ఉండగా.. 19న టెండర్లను తెరవాల్సి ఉంటుంది. గతేడాది డిసెంబరు 27న భారత జాతీయ రహదారుల అధికార సంస్థ ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగం పనుల కోసం ఐదు ప్యాకేజీలుగా టెండర్లను ఆహ్వానించింది. కానీ ఆరు నెలలుగా ప్రతి నెలా టెండర్ల గడువును పొడిగిస్తూ వస్తోందిఇక ఉత్తర భాగాన్ని ముందుగా నాలుగు వరుసల రహదారిగా నిర్మించాలనుకున్నా.. ఆరు వరుసల రహదారిగా విస్తరించే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. అయితే ఆరు వరుసల విస్తరణకు కేంద్ర మంత్రివర్గం నుండి ఇంకా ఆమోదం లభించలేదు. ఆరు వరుసల రహదారికి మార్చాల్సి వస్తే.. ఎన్‌హెచ్‌ఏఐ మళ్లీ టెండర్లను పిలవాల్సి ఉంటుంది. ఇందుకోసం ఇప్పటికే ట్రాఫిక్ సర్వేతో పాటు మరోసారి డీపీఆర్‌పై అధ్యయనం చేసింది. రెండు రోజుల్లో బిడ్ల దాఖలు గడువు ముగియనుండటంతో ఎన్‌హెచ్‌ఏఐ గడువును మళ్లీ పొడిగిస్తుందా? లేక కొత్త ప్యాకేజీలతో ఆరు వరుసల రహదారికి టెండర్లను పిలుస్తుందా? అనే సందిగ్ధత కొనసాగుతోంది.ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగం పనులను వేగవంతం చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. ఇవాళ మంత్రులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం నిర్వహించనున్నారు. ఇందులో ఆర్‌ఆర్‌ఆర్ పనులపై ప్రధానంగా చర్చించే అవకాశం ఉంది. తెలంగాణ ప్రభుత్వం ఉత్తర భాగంతో పాటు దక్షిణ భాగం పనులను కూడా చేపట్టాలని కేంద్రాన్ని తరచుగా కోరుతోంది. ఒకవేళ కేంద్రం ఆమోదించకపోతే రాష్ట్ర ప్రభుత్వమే ఈ పనులను ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు సమాచారం.హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు ప్రాజెక్టు విషయానికొస్తే.. మ్నొత్తం పొడవు సుమారు 340 కిలోమీటర్లు. ఉత్తర భాగం సుమారు 161 కిలోమీటర్లు (సంగారెడ్డి - నర్సాపూర్ - తూప్రాన్ - గజ్వేల్ - ప్రజ్ఞాపూర్ - యాదాద్రి - భువనగిరి - చౌటుప్పల్) వరకు దక్షిణ భాగం పనులు సుమారు 182 కిలోమీటర్లు (చౌటుప్పల్ - శివన్నగూడెం - కందుకూరు - ఆమన్‌గల్ - చేవెళ్ల - శంకర్‌పల్లి - సంగారెడ్డి) వరకు నిర్మించనున్నారు. మొత్తం ప్రాజెక్టుకు సుమారు రూ.17 వేల కోట్ల నుంచి రూ.21 వేల కోట్లు. 2026 నాటికి ఉత్తర భాగం, 2027-2028 నాటికి దక్షిణ భాగం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే హైదరాబాద్ నగరం చుట్టూ కనెక్టివిటీ మెరుగుపడి, ట్రాఫిక్ రద్దీ తగ్గుతుంది. అంతేకాకుండా హైదరాబాద్ చుట్టూ స్థిరాస్థి రంగం పుంజుకుంటుంది.

## తెలంగాణలో పోస్టుల భర్తీకి జాప్యం దేనికి..

నల్గొండ జూన్ 17, ( వెలుతురు)

తెలంగాణ కాంగ్రెస్ విషయంలో ఏఐసీసీ పెద్దలకు క్లారిటీ లేకుండా పోయిందా? తొమ్మిది నెలల నుంచి పోస్టల భర్తీలో ఎందుకు కన్ఫ్యూజ్ అవుతోంది? అరకొర కమిటీతో ఇంకెన్నాళ్ళు బండి లాగిస్తారు? అత్యంత కీలకమైన పదవుల భర్తీకి ఇంకెన్నేళ్ళు పడుతుంది? పార్టీ పెద్దల మధ్య ఏకాభిప్రాయం కుదరడం లేదా? లెట్స్ వాచ్. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా..మహేష్ గౌడ్‌ను నియమించిన ఏఐసీసీ ఆయనకి టీంని సమకూర్చడానికి తొమ్మిది నెలలు పట్టింది. అయినాసరే ఇప్పటికీ పూర్తి స్థాయిలో పీసీసీ కమిటీ నియామకం జరగలేదు. కేవలం ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను మాత్రమే నియమించి చేతులు దులుపుకుంది పార్టీ అధిష్టానం. ఇంకా సీనియర్ వైస్ ప్రెసిడెంట్స్, వర్కింగ్ ప్రెసిడెంట్స్, కార్యదర్శుల్ని నియమించాల్సి ఉంది. ప్రచార కమిటీ ఛైర్మన్‌ని కూడా నియమిస్తారని చెప్పుకున్నా అదికూడా పెండింగ్‌లోనే ఉంది. ఈ పోస్టలన్నిటినీ ఎప్పుడు భర్తీ చేస్తారో కూడా ఇప్పటికీ క్లారిటీ లేదు. అటు అతి ముఖ్యమైన వర్కింగ్ ప్రెసిడెంట్స్ ఎంపిక కూడా పేచీలతో ఎప్పటికప్పుడు వాయిదా పడుతూనే ఉంది. పార్టీ నాయకత్వానికి, సీనియర్ లీడర్స్‌కు మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో .వర్కింగ్ ప్రెసిడెంట్స్ నియామకం కొలిక్కి రావడం లేదట.పార్టీ రాష్ట్ర నాయకత్వం సూచించిన ఓ పేరును ఆమోదించేందుకు ఇన్చార్జ్ ససేమిరా అంటున్నట్టు సమాచారం. అటు పార్టీ వర్కింగ్ ప్రెసిడింగ్ పోస్టుల్లో కూడా సామాజిక న్యాయం కోసం ప్రయత్నిస్తోందట అధిష్టానం. ఈ క్రమంలో ఎస్టీల నుంచి ఎంపీ బలరాం నాయక్, మరోనేత బెల్లయ్య నాయక్ పేర్లు పరిశీలనలో ఉన్నట్టు సమాచారం. మాదిగ సామాజిక వర్గం నుంచి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ పేర్లు పరిశీలనలో ఉన్నాయట. ఇక రెడ్ల నుంచి రోహిణ్ రెడ్డి పేరు దాదాపు ఖరారైనట్టు సమాచారం. ఇప్పుడు పేచీ అంతా మైనార్టీ విభాగం నుంచి ఎవరిని తీసుకోవాలన్న దగ్గరేనట. అట్నుంచి ఫయీం, ఫిరోజ్ ఖాన్‌తో పాటు మరో ఇద్దరి పేర్లు పరిశీలనలో ఉన్నట్టు తెలుస్తోంది. వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టుల్ని వీలైనంత త్వరగా భర్తీ చేసి ప్రజల్లోకి వెళితేనే పార్టీకైనా, ప్రభుత్వానికైనా ఉపయోగమని, ఇక ఎంత ఆలస్యం అయితే అంత నష్టం జరిగినట్టేనని అంటున్నాయి తెలంగాణ కాంగ్రెస్ శ్రేణులు.

# ఆసిఫాబాద్ జిల్లాలో భారీగా నకిలీ విత్తనాలు

అదిలాబాద్, జూన్ 17, ( వెలుతురు)

వర్షాకాలం మొదలైంది. రైతులు పంటలు వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కానీ నకిలీ విత్తనాల సమస్య అన్నదాతలను వెంటాడుతోంది. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో నకిలీ విత్తనాల దందా యథేచ్ఛగా కోనసాగుతోంది. కొందరు అక్రమార్కులు అమాయక రైతులకు మాయమాటలు చెప్పి నిండా ముంచుతున్నారు. నకిలీ విత్తనాల విక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు జిల్లా పోలీసులు అక్కడక్కడా మాటు వేసి పట్టుకుంటున్నా మోసాలు మాత్రం ఆగడంలేదుకుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఏటా వానాకాలంలో అత్యధికంగా 3.35 లక్షలకు పైగా ఎకరాల్లో రైతులు పత్తి పంట సాగు చేస్తుంటారు. దీనిని ఆసరా చేసుకున్న దళారులు జిల్లాలో కొన్నేళ్లుగా పత్తి విత్తనాల నకిలీ దందాను మొదలుపెట్టారు. ఈ దందా జిల్లాలోని సరిహద్దు మండలాల్లో మూడు పూవులు ఆరు కాయలుగా కోనసాగుతోంది. జిల్లాలో గత రెండు నెలల్లో సుమారు రూ.కోటి విలువైన దాదాపుగా 3 వేల కిలోలకు పైగా నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నారు. దీంతో జిల్లాలో ఏస్థాయిలో నకిలీ విత్తనాల దందా సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని చింతలమానెపల్లి మండలంలో ఎల్,బిక్షపతి వద్ద రూ.10.50 లక్షల విలువైన మూడు క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు గత నెలలో పోలీసులు పట్టుకున్నారు. బెజ్జూర్ కు చెందిన కె.చంద్రశేఖర్ విజయవాడ నుంచి కాగజ్ నగర్ కు నకిలీ విత్తనాలు తరలించారు. ఏప్రిల్ 4న కాగజ్ నగర్ పట్టణంలో నవతా ట్రాన్స్ పోర్ట్ లో రూ.1.57 లక్షల విలువైన 45 కిలోల నకిలీ విత్తనాలు పట్టుకున్నారు. అందవెల్లి బోదపల్లి గ్రామాల్లో రూ.3.50 లక్షల విలువైన 100 కిలోల నకిలీ బీటీ పత్తి విత్తనాలను పట్టుకున్నారు. మే 7న పెంచికల్ పేట్ మండలంలో రెండు వాహనాల్లో తరలిస్తున్న రూ.12 లక్షల విలువైన 4 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు పట్టుకుని



నలుగురిని అరెస్టు చేశారు.మే 24న కాగజ్ నగర్ మండలం పెద్దవాగు సమీపంలో ఐచర్ వాహనంలో తరలిస్తున్న రూ.60 లక్షల విలువైన 20 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నారు. మే 25న బెజ్జూర్ మండలం సుశ్మీర్ లో రూ.6 లక్షల విలువైన 170 కిలోల నకిలీ పత్తి విత్తనాలను పోలీసులు పట్టుకున్నారు. జిల్లాలో ఈసారి మొత్తం రూ.కోటి విలువ చేసే నకిలీ పత్తి విత్తనాలు పట్టుకున్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని చింతలమానెపల్లి, బెజ్జూర్, కౌటాల, సిర్పూర్(టీ), సరిహద్దు మండలాల కేంద్రంగా ఈ దందా జోరుగా సాగుతుందని ఆరోపణలున్నాయి. ఆంధ్రప్రదేశ్, గుజరాత్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన దళారులు ఖరీఫ్ సీజన్ కు ముందే నకిలీ విత్తనాలను జిల్లాకు సరఫరా చేస్తున్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని మారుమూల మండలాలైన కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, పెంచికల్పేట్, సిర్పూర్(టి), తదితర మండలాల్లో సబ్ ఏజెంట్లను నియమించుకుంటున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి నకిలీ పత్తి విత్తనాలు నిషేధిత గడ్డిమందును పలు ప్రైవేట్ ట్రాన్స్పోర్టులు, లారీల్లో జిల్లాకు చేరవేస్తున్నారు.మరోవైపు మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో పలువురు దళారులు గోదాంలను ఏర్పాటు చేసుకుని నకిలీ విత్తనాలు నిల్వ చేస్తున్నారు. అక్కడి నుంచి కౌటాల మండలాల సరిహద్దులోని వార్ధా ప్రాణహిత నదుల మార్గాన నాటు పడవల్లో మండలాల్లోని సబ్ ఏజెంట్లకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం. ఈ దందా ఏటా జిల్లాలో కొనసాగుతున్నప్పటికీ కేవలం చిన్న మొత్తంలో కొనుగోలు చేసి విక్రయిస్తున్న వారిని మినహా అసలు సూత్రధారులను పట్టుకున్న దాఖలాలు లేవు. ఆయా శాఖల అధికారులకు దందా చేసే అసలు వ్యక్తులు తెలిసినప్పటికీ మామూలుగానే వదిలేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో నకిలీ విత్తనాల వ్యాపారం రైతులను కలవర పెడుతోంది. వానాకాలం సీజన్ ప్రారంభం కానుండటంతో అన్నదాతలు పోలాలను సాగుకు సిద్ధం చేసుకుంటున్నారు. భూసారం దెబ్బతినడంతో పాటు వాతావరణ కాలుష్యానికి కారణమవుతుందన్న శాస్త్రవేత్తల సూచనల మేరకు దేశంలో బీజీ 3 రకాలను నిషేధించారు. నాణ్యమైన బీటి2 విత్తనాలే నాటాలని ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలని, నాసిరకం విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

# సెహోభాష్... సరిత

నల్గొండ జూన్ 17, ( వెలుతురు)






ఒకప్పుడు ఇంటికే పరిమితమైన మహిళలు నేడు అన్ని రంగాల్లోనూ రాణించి చరిత్ర సృష్టిస్తున్నారు. తాజాగా.. సరిత అనే తెలంగాణ ఆర్టీసీ తొలి మహిళా బస్ డ్రైవర్‌గా రికార్డు సృష్టించారు. జూన్ 14న డ్యూటీలో చేరిన ఆమె.. మొదటి రోజు హైదరాబాద్ నుంచి నల్గొండ జిల్లా మిర్యాలగూడకు ఆర్టీసీ బస్సు నడిపారు. ఢిల్లీలో డ్రైవర్‌గా విధులు నిర్వర్తించిన సరిత.. ప్రత్యేక అనుమతితో తెలంగాణ ఆర్టీసీలో చేరారు. ఒకప్పుడు ఇంటికే పరిమితమైన మహిళలు ఇప్పుడు సరికొత్త చరిత్రను లిఖిస్తున్నారు. అన్ని రంగాల్లోనూ తమదైన ముద్రవేస్తున్నారు. తమ నైపుణ్యాలు, ప్రతిభతో గొప్ప విజయాలు సాధిస్తున్నారు. తాజాగా.. తెలంగాణ ఆర్టీసీలో తొలి మహిళా బస్ డ్రైవర్‌గా సరిత అనే మహిళ విధుల్లో చేరి రికార్డు సృష్టించింది. డ్యూటీలో చేరిన ఆమె.. మ్నొదటి రోజు హైదరాబాద్ నుంచి మిర్యాలగూడకు ఆర్టీసీ బస్ నడిపారు. ఇన్నిరోజులు దేశ రాజధాని ఢిల్లీలో డ్రైవర్‌గా విధులు నిర్వర్తించిన సరిత ప్రత్యేక అనుమతితో తెలంగాణ ఆర్టీసీలో చేరారు. పురుషాధిక్య రంగంగా భావించే రవాణా రంగంలో సరిత లాంటి మహిళలు అడుగుపెట్టి సమర్థవంతంగా విధులు నిర్వర్తించడం స్త్రీ సాధికారతకు నిలువెత్తు నిదర్శనం.యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం సీత్య తండాకు చెందిన వాంకుడోతు సరిత జీవితం ఎన్నో కష్టాలు, సవాళ్లతో కూడుకున్నది. వాంకుడోతు రాంకోటి, రుక్కా దంపతులకు ఆరుగురు సంతానంలో ఐదో అమ్మాయి సరిత. నలుగురు అక్కల పెళ్లి కోసం తన తండ్రి ఉన్న మూడెకరాల భూమిని అమ్మివేయడంతో కుటుంబ పోషణ భారమైంది. దీంతో పదో తరగతి మధ్యలోనే చదువు ఆపేసి తండ్రికి చేదోడు వాదోడుగా నిలిచింది. వేసవి సెలవుల్లో దేవరకొండలోని అక్క ఇంటికి వెళ్లిన సరిత తన బావ వద్ద ఆటో నడపడం నేర్చుకుంది. దురదృష్టవశాత్తు కొన్నాళ్లకే బావ అనారోగ్యంతో మరణించడంతో తల్లిదండ్రులు, తమ్ముడితో పాటు అక్క బాధ్యతను కూడా సరిత తన భుజాలపై వేసుకుంది. దేవరకొండ ప్రాంతంలో ఆటో నడపడం మొదలుపెట్టింది.ఆటో నడుపుతున్నప్పుడు ఆకతాయిల అల్లరి ఎక్కువ కావడంతో సరిత తన ఆహార్యాన్ని మార్చుకుంది. జుట్టు కత్తిరించుకుని, ప్యాంటు, షర్టు ధరించి పురుషుడిలా తయారైంది. ఆత్మస్థైర్యంతో ముందడుగు వేస్తూ.. ప్రైవేట్‌గా పదో తరగతి పాసై హెవీ మోటార్ డ్రైవింగ్ లైసెన్స్ కూడా పొందింది. 2010లో నల్లగొండ ఆర్టీసీ డిపోలో డ్రైవర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల కాగా.. సరిత దరఖాస్తు చేసుకుంది. మహిళల నుంచి వచ్చిన ఏకైక దరఖాస్తు ఆమెదే. అయితే ఆ సమయంలో అధికారులు ఆడవారిని డ్రైవర్లుగా తీసుకోలేమని ఆమె దరఖాస్తును తిరస్కరించారు. అయినా సరిత వెనకడుగు వేయలేదు. ఆమె పట్టుదల, ఆత్మవిశ్వాసంతో తన కలను నిజం చేసుకోవడానికి మరింత దృఢంగా ప్రయత్నించింది.కొన్ని సంవత్సరాల పాటు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాల బస్సును కూడా నడిపారు. 2014లో ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ లో డ్రైవర్‌గా ఎంపికయ్యారు. దేశంలోనే ప్రభుత్వ రంగంలో బస్సు నడిపిన మొదటి మహిళా డ్రైవర్‌గా ఆమె గుర్తింపు పొందారు. ఆమె సరోజిని నగర్ డిపోలో పనిచేస్తూ రోజుకు సుమారు 135 కి.మీ బస్సు నడిపేవారు. ఢిల్లీలో ఆమె సేవలకు మంచి గుర్తింపు లభించింది. ఆమె అనేక అవార్డులు, రివార్డులు అందుకున్నారు. 2018లో రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ చేతుల మీదుగా ప్రత్యేక పురస్కారం, కిరణ్ బేడీ వంటి ప్రముఖుల చేతుల మీదుగా 'ఉమెన్ అచీవర్స్' అవార్డును అందుకున్నారు.ఢిల్లీలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా ఉండటం, ఖర్చులు ఎక్కువగా ఉండటంతో సరిత తెలంగాణకు తిరిగి రావాలని భావించారు. ఉమ్మడి నల్గొండ జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని కలిసి తనకు ఆర్టీసీలో ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఆయన రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌లతో మాట్లాడి.. స్పెషల్ రిక్రూట్‌మెంట్ కింద ఆమెకు ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఆమె విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన తెలంగాణ ప్రభుత్వం టీఎస్‌ఆర్టీసీలో అవకాశం కల్పించింది.తాజాగా.. హైదరాబాద్ నుంచి మిర్యాలగూడకు బస్సును నడిపి ఆర్టీసీలో తొలి మహిళా డ్రైవర్‌గా రికార్డు సృష్టించారు. మహిళలు కూడా పురుషులతో సమానంగా సవాళ్లతో కూడిన రంగంలో రాణించగలరని నిరూపించి అనేక మందికి స్ఫూర్తిగా నిలిచారు. సరిత ప్రయాణం మహిళా సాధికారతకు ఒక ఉదాహరణ. ఆమె సాహసం, సంకల్పం అనేక మందికి ఆదర్శంగా నిలిచాయి.

# సొంత సామాజిక వర్గంలో అసంతృప్తులు

హైదరాబాద్, జూన్ 17, ( వెలుతురు)

కాంగ్రెస్ పార్టీ నాయకత్వం మీద ఆ సామాజికవర్గం అలకబూనిందా? ఎప్పుడూ పైచేయిగా ఉండే . మమ్మల్ని ఇప్పుడు పట్టించుకోవడం లేదంటూ నారాజ్ అవుతున్నారా? ఇటీవల జరిగిన పరిణామాలను ఆ కుల పెద్దలు అస్సలు జీర్ణించుకోలేకపోతున్నారా? అధికార పార్టీ మీద కోపంగా ఉన్న ఆ సామాజికవర్గం ఏది? ఎక్కడ తేడా కొట్టింది? తెలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ అంటేనే . రెడ్ల పార్టీ అని ఓ ముద్ర ఉంది. రాజకీయ వర్గాల్లో కూడా ఇదే విస్తృతాభిప్రాయం. లెక్కల ప్రకారం చూసుకున్నా కూడా ఆ సామాజిక వర్గం ఓటు బ్యాంక్ ఎప్పుడూ కాంగ్రెస్ పార్టీకే అండగా ఉంటుంది. అలాగే . పార్టీలో కూడా రెడ్డి నాయకులదే పైచేయిగా నడుస్తూ ఉంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అయినా విభజన తర్వాత తెలంగాణలో అయినా ఇది అనాదిగా వస్తున్నదే. తెలంగాణలో కూడా ఇప్పటిదాకా జరిగిన అన్ని పరిణామాల్లో రెడ్డి నేతలదే పైచేయి అయిందిగానీ ఇటీవల జరుగుతున్న పరిణామాలతో ఆ సామాజిక వర్గానికి ప్రాధాన్యత తగ్గుతోందా అన్న అనుమానాలు వస్తున్నాయట. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేసిన తర్వాత సామాజిక న్యాయానికి కట్టుబడి ఉండాలన్న అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఎవరి జనాభా ఎంతో వారికి అంత వాటా ఇవ్వాలని డిసైడ్ అయినట్టు చెప్పుకుంటున్నారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ విస్తరణలో కూడా మాల, మాదిగ, బీసీ సామాజిక వర్గాలకు పెద్దపీట వేసింది ప్రభుత్వం. కాంగ్రెస్ పార్టీ చరిత్రలో ఏ పదవుల భర్తీ అయినా . అందులో కచ్చితంగా రెడ్డి సామాజిక వర్గానికి ప్రాధాన్యత ఉండేది. కానీ తాజాగా జరిగిన మంత్రివర్గ విస్తరణలో రెడ్లకు చోటు లేకుండా పోయింది. దీంతో ఆ సామాజికవర్గం అసంతృప్తిగా ఉన్నట్టు తెలుస్తోంది.



పైగా ఆశావహుల్లో రెడ్డి నాయకులే ఎక్కువగా ఉండటంతో అసంతృప్త స్థాయి కూడా ఎక్కువగా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇది రోజురోజుకూ పెరిగిపోతున్న క్రమంలో మరో కొత్త వాదన వినిపిస్తోంది పార్టీ వర్గాల్లో. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత జరిగే విస్తరణలో రెడ్లకు ప్రాధాన్యత దక్కే అవకాశం ఉందని అంటున్నారు.ఇటీవల కాంగ్రెస్ పార్టీలో పదవుల భర్తీ కూడా జరిగింది. ఉపాధ్యక్షులు, పార్టీ ప్రధాన కార్యదర్శి పదవుల భర్తీలో కూడా జనాభఆ ప్రాతిపదికన తీసుకున్నారు. ఇందులో 68 శాతం బీసీ, ఎస్సీ, మైనార్టీలకు కేటాయించారు. అంతవరకు బాగానే ఉందిగానీ . అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు కొందరు పార్టీ నాయకులు. సామాజిక న్యాయం చేయాలన్న ఆలోచన మంచిదే గానీ పార్టీకి వెన్నెముకగా ఉన్న సామాజిక వర్గాలను దూరం చేసుకోవడం కూడా మంచిది కాదంటూ సలహాలిస్తున్నారట. అటు సోషల్ జస్టిస్ పేరుతో కనీసం ప్రభుత్వం కానీ పార్టీ నాయకత్వం గానీ జనంలోకి వెళ్లి చర్చించే ప్రయత్నం చేయడం లేదు. తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ప్రభుత్వం పనులు చేసుకుంటూ పోతోందిగానీ . ఆ విషయాన్ని ఆయా వర్గాలకు చేర్చాల్సిన పార్టీ మాత్రం . ఇప్పటి వరకు ఎలాంటి కార్యాచరణ తీసుకోలేదు. దీంతో కొత్తగా అమలు చేస్తున్న సామాజిక న్యాయం కారణంగా . ఏయే వర్గాలు ఎంత బెనిఫిట్ అవుతాయన్న వివరాలు కనీసం ఆ కులాలకు కూడా చేరడం లేదు. ఇలాంటి వాటిని పూర్తిస్థాయిలో చెప్పుకోగలిగినప్పుడే ఇటు పార్టీకి, అటు ప్రభుత్వానికి ఉపయోగం అన్నది నేతల అభిప్రాయం. కానీ అంతా అలా మాట్లాడుకునే వాళ్ళేగానీ . క్షేత్ర స్థాయిలో చెప్పే ప్రయత్నం మాత్రం ఎవ్వరూ చేయడం లేదన్న అసంతృప్తి పెరుగుతోంది. పార్టీకి వెన్నంటి ఉన్న సామాజిక వర్గాలకు దగ్గరవడం ఒక ఎత్తయితే మారుతున్న పరిస్థితుల్లో అనుసరించే వ్యూహాలను జనంలోకి విస్తృతంగా తీసుకుపోవడం మరో ఎత్తు. కానీ%ా% ఆ పని మాత్రం జరగడం లేదని చెప్పుకుంటున్నారు. పార్టీ నాయకత్వం ఆ దిశగా ఆలోచిస్తేనే ఉపయోగం అన్న అభిప్రాయం బలపడుతోంది. సామాజిక న్యాయం పరంగా మెజార్టీ జనాభాకు మెజార్టీ పదవులన్న సూత్రాన్ని పాటిస్తూ పార్టీకి వెన్నుదన్నుగా ఉండే కులాలను సంతృప్తి పరచడం కత్తిమీద సామే అయినా చాలా జాగ్రత్తగా చెయ్యక తప్పదని అంటున్నారు పరిశీలకులు. దీంతో ప్రస్తుతం నారాజ్‌గా ఉన్న రెడ్లను కాంగ్రెస్ అధిష్టానం ఎలా సంతృప్తి పరుస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

https://epaper.velthuru.com

# వెలుతురు

## cinema

## చిరును డ్రిల్ మాస్టర్ చేసిన అనిల్ రావిపూడి

అనిల్ రావిపూడి దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి హీరోగా ఓ సినిమా రూపొందుతున్నది. సంక్రాంతికి వస్తున్నాం మూవీ తర్వాత అనిల్ రావిపూడి కాంబోలో వస్తున్నా ఈ సినిమాపై ఇప్పటి నుండే భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాను భారీ చిత్రాల నిర్మాణ సంస్థ షైన్ స్క్రీన్స్ బ్యానర్ పై సాహు గారపాటి,సుష్మిత కొణిదెల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. చిరు సరసన నయనతార హీరోయిన్ గా నటిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ముస్సోరీలో జరుగుతోంది. చిరంజీవి, కేథరీన్ మరియు నయనతార కాంబినేషన్‌లో ముఖ్యమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నాడు దర్శకుడు అనిల్ రావిపూడి. అయితే ఈ సినిమాలో మెగాస్టార్ చిరు స్కూల్ లో పిల్లలకు ఆటలు నేర్పించే డ్రిల్ మాస్టర్ పాత్రలో కనిపించబోతున్నాడు. బాలయ్యను కేర్ టేకర్ గా వెంకీ ని కాప్ రోల్ లో చూపించి మెప్పించిన ఈ యంగ్ డైరెక్టర్ ఇప్పుడు చిరును డ్రిల్ మాస్టర్ గా చూపిస్తున్నారు. ఈ సినిమాతో వింటేజ్ చిరు మరోసారి ప్రేక్షకులను అలరిస్తాడని మెగా ఫ్యాన్స్ భావిస్తున్నారు. మాస్ మ్యూజిక్ స్పెషలిస్ట్ భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్న చిరు అనిల్ సినిమాను 2026 సంక్రాంతి కానుకగా రిలీజ్ చేస్తామని ఇదివరకే ప్రకటించారు మేకర్స్. అందుకు అనుగుణంగానే షూట్ ను చక చక ఫినిష్ చేస్తున్నారు. భారీ అంచనాల మధ్య వస్తున్న చిరు ? అనిల్ కాంబో ఎంతటి సంచలనం సృష్టిస్తుందో చూడాలి.



## కన్నప్ప విడుదలకు ఏపీ హైకోర్టు గ్రీన్ సిగ్నల్



మంచు విష్ణు కథానాయకుడిగా.. మంచు మోహన్ బాబు నిర్మాణంలో వస్తున్న కన్నప్ప సినిమాపై వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో కొన్ని సన్నివేశాలు బ్రాహ్మణ సామాజిక వర్గాన్ని కించపరిచేలా ఉన్నాయని ఆరోపిస్తూ సినిమా విడుదలను ఆపివేయాలని బ్రాహ్మణ చైతన్య వేదిక అధ్యక్షుడు సిరిపురపు వెంకట శ్రీధర్ ఏపీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఈ పిటిషన్ మంగళవారం విచారణకు రాగా.. సినిమా విడుదలను ఆపివేయాలనే పిటిషనర్ అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. అలాగే ఈ వివాదంకి సంబంధించి కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ సీఈఓ, ప్రాంతీయ కార్యాలయ అధికారి, ఏపీ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, దర్శకుడు ముఖేష్ కుమార్, అలాగే నటులు మోహన్ బాబు, విష్ణు, కన్నెగంటి బ్రహ్మానందం, పి. వెంకట ప్రభుప్రసాద్, సప్తగిరిలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఆగస్టు 1కి వాయిదా వేసింది. అలాగే సినిమా విడుదలైన తర్వాత అభ్యంతరకర విషయాలు ఏమైనా ఉంటే, వాటిని తొలగించేలా ఆదేశిస్తామని న్యాయమూర్తి స్పష్టం చేశారు. దీంతో, 'కన్నప్ప' చిత్రం విడుదలకు హైకోర్టు నుంచి పరోక్షంగా గ్రీన్ సిగ్నల్ లభించినట్టయింది.

## తమిళ నటుడు ఆర్య నివాసంలో ఐటీ దాడులు

ప్రముఖ తమిళ నటుడు ఆర్య నివాసంతో పాటు.. ఆయనకు సంబంధమున్న వ్యాపార సంస్థలపై ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ నేడు ఆకస్మిక దాడులు నిర్వహిస్తుంది. ముఖ్యంగా చెన్నైలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న 'సీ షెల్' రెస్టారెంట్ల శాఖల్లో ఈ సోదాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. పన్ను ఎగవేత ఆరోపణల నేపథ్యంలో ఈ దాడులు జరిగాయని సమాచారం. ఆర్య తన ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారని, సక్రమంగా పన్నులు చెల్లించలేదని ఆరోపణలు ఉన్నాయి. చెన్నైలోని అన్నా నగర్, వేలచెరి, కొట్టివాకం, కిల్పాక్ వంటి ప్రముఖ ప్రాంతాల్లో ఉన్న 'సీ షెల్' రెస్టారెంట్ల కార్యాలయాలు, శాఖల్లో బుధవారం ఉదయం నుంచే తనిఖీలు కొనసాగుతున్నాయి. ఈ 'సీ షెల్' రెస్టారెంట్ చైన్‌ను ఆర్య గతంలో కేరళకు చెందిన వ్యాపారి కున్హి మూసాకు విక్రయించినట్లు వార్తలు వచ్చాయి. అయితే, ఆ కేరళ వ్యాపారి ఆస్తులపై ఇప్పటికే ఐటీ శాఖ నిఘా పెట్టిందని, ఈ విచారణలో భాగంగానే చెన్నైలోని ఈ రెస్టారెంట్లు, ఆర్య నివాసంపై దాడులు జరుగుతున్నాయని భావిస్తున్నారు. ఈ లావాదేవీలపై ఐటీ అధికారులు దృష్టి సారించినట్లు సమాచారం. అయితే, తనిఖీలు జరుగుతున్న 'సీ షెల్' రెస్టారెంట్లు తన స్వంతం కాదని ఆర్య పేర్కొన్నట్లు కొన్ని నివేదికలు చెబుతున్నాయి. దీనిపై ఐటీ శాఖ అధికారికంగా స్పందించాల్సి ఉంది.

## జూలై 25కు కింగ్‌డమ్ లాక్ అయ్యిందా?

విజయ్ దేవరకొండ కెరీర్‌లో తెరకెక్కుతున్న అత్యంత కీలకమైన చిత్రం 'కింగ్‌డమ్'. తాజా సమాచారం ప్రకారం, 'కింగ్‌డమ్' సినిమా జూలై 25న, శుక్రవారం విడుదల కానుందని ఓ వార్త వైరల్ అవుతుంది. అధికారికంగా ఈ విషయంపై మేకర్స్ ప్రకటించనప్పటికీ, ఆ డేట్‌కే సినిమాను ప్లాన్ చేశారని ప్రచారం సాగుతోంది. పాన్ ఇండియా స్థాయిలో విడుదలవుతున్న ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో భారీగా అంచనాలు ఉన్నాయి. గతంలో లైగర్, ఫ్యామిలీ స్టార్ వంటి ఫ్లాప్స్ కారణంగా.. విజయ్ మార్కెట్ మీద చాలా ప్రభావం పడింది. ఈ నేపథ్యంలో 'కింగ్‌డమ్' ద్వారా తన కెరీర్‌ను మళ్లీ పైకి తీసుకెళ్లాలన్న నమ్మకంతో విజయ్ అడుగులు వేస్తున్నాడు. ఇక ఈ చిత్రానికి జెర్సీ వంటి హిట్‌ను అందించిన గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్నారు.విజయ్ దేవరకొండ కెరీర్‌లోనే ఇది అత్యధిక బ్జడెట్ కలిగిన పాన్ ఇండియా చిత్రం. ఇక ఇప్పటికే విడుదలైన టీజర్ సినిమాపై భారీ హైప్‌ను క్రియేట్ చేయగా. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, విజయ్ లుక్ అన్నీ కలిసి సినిమాపై పాజిటివ్ బజ్ తెచ్చాయి. అయితే, టీజర్ తర్వాత ఎలాంటి ప్రమోషనల్ మెటీరియల్ విడుదల కాలేదు. పాటలు, ట్రైలర్ లేదా మీడియా ఈవెంట్లపై ఎటువంటి అప్‌డేట్లు లేకపోవడం కొన్ని అనుమానాలు మొదలయ్యాయి. సాధారణంగా ఇలాంటి భారీ చిత్రాలు విడుదలకు రెండు నెలల ముందే సాంగ్స్, ఈవెంట్లు మొదలవుతాయి. కానీ 'కింగ్‌డమ్' మేకర్స్ ఇప్పటికీ ప్రమోషనల్ కార్యక్రమాలపై మౌనమే పాటిస్తున్నారు. ఫ్యాన్స్ మాత్రం చిత్రయూనిట్ నుంచి అధికారిక ప్రకటన కోసం ఆతురతగా ఎదురుచూస్తున్నారు. తన కెరీర్‌ను మళ్లీ నిలబెట్టుకోవాలనుకునే విజయ్ దేవరకొండకు ఈ సినిమా ఎంతో ముఖ్యం. మరి ఏం జరుగుతుందో చూడాలి.





## కియారా కోసం యష్ త్యాగం

కేజీఎఫ్' సిరీస్ ద్వారా దేశవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న కన్నడ స్టార్ యష్.. తన కొత్త ప్రాజెక్ట్ 'టాక్సిక్' కోసం మరింత ఆసక్తికరంగా ప్రిపేర్ అవుతున్నారు. జాతీయ అవార్డు గ్రహీత గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తుండగా, ఇప్పటికే యష్ బర్త్‌డే స్పెషల్‌గా విడుదలైన గ్లింప్స్‌కు మంచి రెస్పాన్స్ లభించింది.ఈ సినిమాలో హీరోయిన్‌గా బాలీవుడ్ స్టార్ కియారా అద్వానీ కూడా నటిస్తున్నారు. అయితే చిత్ర షూటింగ్ మొదలైన కొద్దికాలానికే కియారా గర్భవతిగా మారిన విషయం తెలిసిందే. అయితే గర్భవతిగా ఉన్న కియారాకు షూటింగ్ షెడ్యూల్ సులభంగా ఉండాలనే ఉద్దేశంతో, యష్ తన భాగమైన కొన్ని ముఖ్యమైన సన్నివేశాల షూటింగ్‌ను, బెంగళూరులో కాకుండా, ముంబైకి మార్చాలని నిర్ణయించారట. దీంతో ఆమెకు ప్రయాణ బాధ్యత తగ్గింది. ముంబైలోనే యష్, కియారాల మధ్య సన్నివేశాలను, త్వరగా షూట్ చేసి పూర్తి చేశారట. ఈ విషయం బయటకు వచ్చాక, యష్ సెన్సిటివిటీ, సహనభావం చూసిన ప్రేక్షకులు, అభిమానులు ఆయన పై ప్రశంసలు కురిపిస్తున్నారు. ఒక నటీమణి ఆరోగ్యాన్ని పరిగణనలోకి తీసుకుని, షూటింగ్ లొకేషన్ మార్చడం నిజంగా అరుదైన విషయం అని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇక ఈ భారీ పాన్-ఇండియా ప్రాజెక్ట్ కన్నడతో పాటు తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో కూడా విడుదల కానుంది.




## విశ్వంభరలో సాంగ్ మ్యూజిక్ భీమ్స్‌కు అప్పగింత

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్నసినిమాలలో విశ్వంభర ఒకటి. బింబిసారా దర్శకుడు వసిష్ఠ మల్లిడి డైరెక్షన్ లో వస్తున్న ఈ సినిమా సోషియో ఫాంటాషి నేపథ్యంలో తెరకెక్కుతుంది. చిరు సరసన కోలీవుడ్ స్టార్ బ్యూటీ త్రిష హీరోయిన్ గా నటిస్తోంది. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ కు మంచి స్పందన లభించింది. చాలా కాలంగా

సెట్స్ పై ఉన్న విశ్వంభర ఎప్పుడో విడుదల కావాల్సి ఉంది. కానీ కొంత రీషూట్స్ మరికొంత రీ వర్క్ చేస్తున్నారు. ఈ సినిమాకు ఆస్కార్ విన్నర్ ఎం ఎం కీరవాణి ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. విశ్వంభర ఫస్ట్ లిరికల్ ' రామ రామ' అనే సాంగ్ ను కూడా రిలీజ్ చేసారు. అయితే ఇప్పుడు ఈ సినిమా కోసం కీరవాణిని కాదని మరొక యంగ్ మ్యూజిక్ డైరెక్టర్ వర్క్ చేయబోతున్నాడు. సంక్రాంతికి వస్తున్నాం, ధమాకా వంటి సూపర్ హిట్ ఆల్బమ్స్ ఇచ్చిన భీమ్స్ సిసిరోలియో విశ్వంభరకు సంగీతం అందిస్తున్నాడు. ఈ సినిమాలో ఓ స్పెషల్ మాస్ సాంగ్ ను కంపోజ్ చేసే భాద్యతలు భీమ్స్ కు అప్పగించింది టీమ్. అందుకోసం వర్క్ కూడా స్టార్ట్ చేసాడు భీమ్స్. మిగిలిన సినిమా మొత్తం షూటింగ్ ఫినిష్ చేసారు. భీమ్స్ చేసే సాంగ్ షూట్ ఒక్కటే బ్యాలెన్స్ ఉంది. మరి చిరు కోసం భీమ్స్ ఎటువంటి సాంగ్ ఇస్తాడో చూడాలి.సోషియో ఫాంటాసి కథ నేపథ్యంలో సాగే ఈ సినిమా రిలీజ్ డేట్ ఎప్పుడు అనేది క్లారిటీ లేదు.

## ది రాజాసాబ్ ..ఓ ఎమోషనల్ స్టోరీ

### చిత్రకథపై దర్శకుడు మారుతి

ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ది రాజాసాబ్' బిగ్గెస్ట్ హారర్ ఫాంటసీ ఫిల్మ్‌గా సిద్ధమవుతోంది. ఈ సినిమా కథను ఉద్దేశించి దర్శకుడు మారుతి జాతీయ మీడియాతో మాట్లాడారు. ఇదొక ఎమోషనల్ స్టోరీ అని చెప్పారు. ప్రేక్షకులు తప్పకుండా కనెక్ట్ అవుతారన్నారు. ఇలాంటి కాన్సెప్ట్ ఇండియన్ స్క్రీన్స్‌పై ఇప్పటివరకూ రాలేదన్నారు. 'ఇదొక ఎమోషనల్ ఫిల్మ్. ఎన్నో భావోద్వేగాలు ఇందులో ఉంటాయి. తాతయ్య, నానమ్మ, మనవడి కథను ఇందులో చూపించనున్నాం. స్క్రీన్‌పై చూసిన తర్వాత ప్రేక్షకులు తప్పకుండా కనెక్ట్ అవుతారు' అని మారుతి తెలిపారు. 'హవేలి రాజ్‌మహల్' సెట్, వీఎఫ్‌ఎక్స్ వర్క్‌ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. 'ప్రభాస్ చిత్రాలకు ఉన్న క్రేజ్‌ను దృష్టిలో ఉంచుకుని, కథకు అనుగుణంగా భారీ సెట్స్ ఏర్పాటుచేశాం. వీఎఫ్‌ఎక్స్ విషయానికి వస్తే.. ప్రభాస్ సినిమాపై ప్రేక్షకుల్లో ఒక అంచనా ఉంటుంది. దానికి తగ్గట్టుగా వీఎఫ్‌ఎక్స్ వర్క్‌పై దృష్టిపెట్టాను. అద్భుతంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నాం. నిర్మాణ సంస్థ కూడా బడ్జెట్ విషయంలో ఎక్కడా వెనుకాడలేదు. ప్రేక్షకులను మేము మోసం చేయాలనుకోవడం లేదు. వాస్తవికతకు వీఎఫ్‌ఎక్స్‌ను జోడించాలనేదే మా ఉద్దేశం. పూర్తిస్థాయిలో ఒక అబద్ధపు ప్రపంచాన్ని సృష్టించడం వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదు' అని ఆయన చెప్పారు. సినిమా కోసం ప్రభాస్ ఎంతో శ్రమించారన్నారు. ప్రేక్షకులకు అద్భుతమైన చిత్రాన్ని అందించేందుకు ఆయన అన్నివిధాలుగా కష్టపడుతుంటారని వివరించారు. డిసెంబర్ 5న పాన్‌ఇండియా స్థాయిలో ఈ సినిమా విడుదల కానుంది. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ కథానాయికలు. సంజయ్‌దత్ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఇటీవల ఈ సినిమా టీజర్ విడుదలైంది. ప్రభాస్ వింటేజ్ లుక్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సుమారు 3 గంటల నిడివితో ఇది విడుదల కానుందని టీజర్ రిలీజ్ ఈవెంట్‌లో మారుతి తెలిపారు. 'రాజాసాబ్' కోసం నిర్మించిన హవేలి రాజ్‌మహల్ సెట్‌ను టీమ్ ఇప్పటికే మీడియాకు చూపించింది. దాదాపు రూ.7 కోట్లకు పైగా ఖర్చుతో ప్రొడక్షన్ డిజైనర్ రాజీవన్ నిర్మించిన ఆ సెట్ సినిమాకి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి.





# లీడర్ అంటున్న కవిత



**హైదరాబాద్, జూన్ 17, ( వెలుతురు)**

బీఆర్ ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవిత నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. –లీడర్– పేరుతో ఆమె యువతకు ఆహ్వానం పలుకుతున్నారు. రాష్ట్ర స్తాయిలో యువతను రాజకీయాల్లోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. దీనిలో భాగంగా తాజాగా తెలంగాణ యువత, మహిళలకు రాజకీయ శిక్షణ అందించేందుకు తెలంగాణ జాగృతి 'లీడర్' కార్యక్రమాన్ని ఆమె ప్రారంభిం చారు. ఇప్పటి వరకు లేని ఈ కార్యక్రమానికి యువత నుంచి మహిళల నుంచి ఎలాంటి స్పందన వస్తుందనేది చూడాలి. అయితే.. ఈ కార్యక్రమం వెనుక చాలా పెద్ద వ్యూహామే కవిత రచించి ఉంటారని తెలుస్తోంది.ప్రస్తుతం రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో ఆమె ప్రారంభించారు. అయితే..త్వరలోనే దీనిని జిల్లాల స్థాయికి కూడా తీసుకువెళ్లనున్నట్టు కవిత చెప్పుకొచ్చారు. ఈ శిక్షణలో భాగంగా ప్రశ్నించే తత్వాన్ని, రాజకీయాలను కూడా యువతకు నేర్పనున్నారు. వాస్తవానికి బీఆర్ ఎస్ తరఫున ఈ కార్యక్రమాన్ని చేపట్టడం లేదు. కేవలం కవిత నేతృత్వంలోని జాగృతి తరఫునే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇటీవల కాలంలో ఆమె బీఆర్ ఎస్ నాయకత్వంపై ఎదురు దాడి చేస్తుండడం.. ఆమె తండ్రి మాజీ సీఎం కేసీఆర్ ను దేవుడు అనడం.. ఆయన చుట్టూ దెయ్యాలు ఉన్నాయని చెప్పడం తెలిసిందే.ఈ క్రమంలో ఆమె బీఆర్ ఎస్ జెండాను పక్కన పెట్టి జాగృతి పతకాన్ని ధరిస్తుండడం.. కార్యకర్తలు, నాయకులను కలిసినప్పుడు కూడా ఇదే పంథాలో ముందుకు సాగుతుండడం వంటివి ఆమె కొత్త అజెండాకు ఏదో పునాదులు వేస్తున్నారన్న చర్చకు బలాన్నిచేకూరుస్తున్నాయి. అయితే.. దీనిపై స్పష్టత లేకపోయినా.. ప్రస్తుతం చేపట్టిన %–%లీడర్%–% కార్యక్రమం ద్వారా తన సైన్యాన్ని ఆమె స్వయంగా తీర్చిదిద్దుకుంటున్నారన్న చర్చ అయితే రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ఇలా చేయడం ద్వారా కవిత భవితను రూపొందించుకుంటున్నారని కూడా పరిశీలకులు చెబుతున్నారు. మరి ఇది నిజంగానే ఆమెకు బలాన్ని చేకూరుస్తుందా? లేక.. వ్యూహం ఏంటి? అనేది చూడాలి. ఏదేమైనా.. కవిత ప్రారంభించిన లీడర్ కార్యక్రమం ఏమేరకు సక్సెస్ అవుతుందో కూడా చూడాలి.

# ఏడాది సంబురాల్లో కనిపించని కమలం




**విజయవాడ, జూన్ 17, ( వెలుతురు)**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయింది. ఈ ఏడాది కాలంలో జరిగిన పాలనపై రాష్ట్ర ప్రభుత్వం సంబరాలకు సిద్ధమైంది. ప్రధానంగా ప్రజలను కలుసుకోవడం ప్రజల సంతృప్తిని లెక్క వేసుకోవడం వారికి అనుకూలంగా మళ్లీ కార్యక్రమాలు నిర్వహించడం అనేది రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం. అయితే కూటమి పార్టీలుగా విజయం దక్కించుకున్న వాటిలో బీజేపీ కీలకమైంది. కేంద్రంలో ఈరోజు మోడీ ప్రభుత్వం ఏర్పడడానికి రాష్ట్రంలో ఏర్పడిన చంద్రబాబు ప్రభుత్వం అత్యంత ముఖ్యమైనది. ఇది అందరికీ తెలిసిందే.ఇలాంటి సమయంలో కేంద్రంలో కూటమి ప్రభుత్వాన్ని బలపరుస్తున్న చంద్రబాబుకు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాన్ని బలపరచాలన్నటువంటి ఆలోచన బిజెపికి రాకపోవడం చాలా శోచనీయం. ఎందుకంటే రాష్ట్రంలో ప్రభుత్వం ఏడాదిపాలనపై కార్యక్రమాలను నిర్వహిస్తున్నా.. బిజెపి నాయకులు ఎక్కడా కనిపించడం లేదు. ముఖ్యంగా తల్లికి వందనం వంటి పథకాన్ని అమలు చేసినప్పుడు కూడా దీనిపై ఒక్కరంటే ఒక్కరు కూడా స్పందించలేదు. దీనివల్ల అనేకమంది మహిళలకు లబ్ధి జరుగుతోందని ఒక ప్రెస్ మీట్ గాని ఒక ప్రకటన గాని విడుదల చేయలేదు.అలాగే పింఛన్ల పెంపు, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం వంటి వాటిపై కూటమీ పాలకులు ఒకవైపు ప్రకటనలు చేస్తున్న బిజెపి పక్షాన ఎవరు నోరు ఎత్తటం లేదు. మరి దీన్ని ఎలా చూడాలి? ఏ విధంగా అర్థం చేసుకోవాలి అంటే రేపు ఏదైనా ప్రజల్లో అసంతృప్తి రగిలి అసంతృప్తి కారణంగా విమర్శలు చేస్తే మా తప్పులేదు అని తప్పించుకునే దారి బిజెపిలో కనిపిస్తోందా? లేకపోతే రేపు రాష్ట్ర ప్రభుత్వం అప్పులు చేస్తే దానికి మాకు సంబంధం లేదు మేము నిమిత్త మాత్రులం అని తప్పించుకునే దారి కనిపిస్తోందా అంటే అవునని అంటున్నారు పరిశీలకులు.కూటమి ప్రభుత్వంలో ఏం చేసినా అది మూడు పార్టీలకు వర్తిస్తుంది. రేపు ఓట్లు అడిగే విధానాన్ని పరిశీలిస్తే మూడు పార్టీల పరంగానే ప్రజల్లోకి వెళ్లాలి. మూడు పార్టీల పరంగానే ప్రజలను ఓట్లు అభ్యర్థించాలి. ఈ విషయంలో బిజెపి నాయకులు అనుసరిస్తున్న ధోరణి ప్రధానంగా చర్చగా మారింది. ఇది సరికాదని ప్రజల్లోకి రావాలనేది కూటమి పార్టీలకు చెందిన సీనియర్ నాయకులు సూచిస్తున్నారు. నిజానికి గత ఎన్నికల్లో విజయం ఎలా ఉన్నా వచ్చే ఎన్నికల నాటికి ఈ ఐదేళ్ల పాలనను చూసి మాత్రమే ప్రజలు ఓటేస్తారు తప్ప జగన్ పై విమర్శలు చేయడం ద్వారా ఓట్లు ఎంతవరకు పడతాయి అనేది చూడాలి.కాబట్టి మళ్ళీ ఎన్నికల్లో విజయం దక్కించుకోవాలన్నా.. మళ్లీ ఎన్నికల్లో మెజారిటీ ఓట్లు సాధించాలన్నా కూడా అందరూ కలిసికట్టుగా సంయుక్తంగా ప్రజల మధ్య ఉండడం ప్రజల సమస్యలు పట్టించుకోవడం ముఖ్యం. సంతృప్తిని కూడా అంచనా వేసుకోవడం వంటివి బిజెపి నాయకులు కూడా చేయాల్సిన అవసరం ఉందనేది పరిశీలకులు చెబుతున్న మాట. మరి కమల నాథులు ఏమంటారో చూడాలి.

# ఇజ్రాయిల్‌లో జగిత్యాల వాసి మృతి

**జగిత్యాల, జూన్ 17, ( వెలుతురు)**

ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య భీకర యుద్ధం జరుగుతున్న విషయం తెలిసిందే. ఇరు దేశాలు మధ్య జరుగుతున్న దాడుల్లో వందలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ యుద్ధం వల్ల జగిత్యాలకు చెందిన రవీందర్ అనే వ్యక్తి మృతి చెందాడు. బతుకుదెరువు కోసం రెండు సంవత్సరాల క్రితం రవీందర్ ఇజ్రాయెల్‌కు వెళ్లాడు. అయితే యుద్ధం జరుగుతుండగా.. బాంబు శబ్దం వల్ల రవీందర్ గుండెపోటుతో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న రవీందర్ కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. యుద్ధం కారణంగా విమాన రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. దీంతో రవీందర్ మృతదేహాన్ని ఎలాగైనా స్వదేశానికి రప్పించాలని కుటుంబసభ్యులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

# టీడీపీకి కోవర్టుగా వాసుపల్లి

**విశాఖపట్టణం, జూన్ 17, ( వెలుతురు)**

మాజీ ఎమ్మెల్యే కదలికలు అనుమానాస్పదంగా ఉన్నాయా? ఆయన మాటలు ఇప్పుడే ఎందుకు తేడాగా వినిపిస్తున్నాయి? మామీద మీ పెత్తనం ఏంటి? ఎక్కువ చేస్తే పార్టీ ఆఫీస్ మెట్లు కూడా ఎక్కబోమని ఎందుకు అంటున్నారు? చచ్చేదాకా వైసీపీలోనే ఉంటానని ఒకవైపు చెబుతూం మరోవైపు స్వరం మారుస్తున్న ఆ మాజీ ఎవరు? ఆయనకు వచ్చిన ఇబ్బంది ఏంటి? ఉత్తరాంధ్ర వైసీపీలో ఒక్కొక్కటిగా అసమ్మతి స్వరాలు పెరుగుతున్నాయా అంటే అవును, అలాగే కనిపిస్తోందంటున్నారు పొలిటికల్ పండిట్స్. అందుకు తాజా ఉదాహరణగా విశాఖ దక్షిణ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌ని చూపిస్తున్నారు. అంతకు ముందు సంగతి ఎలా ఉన్నా . ఇటీవల వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణ వేదికగా ఆయన అన్న మాటలు, లేవనెత్తిన ప్రశ్నలు చర్చనీయాంశం అవుతున్నాయి. ఉత్తరాంధ్ర కో ఆర్డినేటర్ వ్యవస్థ పార్టీ అధినేతకు, తమకు మధ్య అడ్డుగోడగా మారిందన్న మాటల చుట్టూ రకరకాల విశ్లేషణలు పెరుగుతున్నాయి. గతంలో ఆ పోస్ట్‌లో ఉన్న విజయసాయిరెడ్డి చర్యలవల్ల ఒక్కో నియోజకవర్గంలో కనీసం 10వేల ఓట్లు కోల్పోయామన్న రాజకీయ సూత్రీకరణను తెరపైకి తెచ్చారు వాసుపల్లి. అలాంటి వ్యవస్థ ఇప్పటికీ అవసరమా ? అన్న అభిప్రాయంతో . ప్రస్తుత కో ఆర్డినేటర్ కన్నబాబును కోట్ చేస్తూ మాట్లాడ్డాన్ని కాస్త తేడాగానే చూస్తున్నాయట వైసీపీ వర్గాలు. ఇప్పుడు కూడా పాత పద్ధతులనే కొనసాగిస్తామని చెబితే పార్టీ ఆఫీసులోకి కూడా అడుగు పెట్టబోనంటూ . తీవ్రమైన వ్యాఖ్యలే చేశారు మాజీ ఎమ్మెల్యే. దీంతో వాసుపల్లి ఆలోచన ధోరణి వైసీపీ లో విస్తృత చర్చ జరుగుతోందట. ఓవైపు కూటమి ప్రభుత్వం ఏడాది వైఫల్యాలపై పోరాటానికి సమాయత్తం అవుతున్న టైంలో . వాసుపల్లి లాంటి వాళ్ళు పాత చేదు జ్ఞాపకాలతోనే సహవాసం చేయడం ఏంటని మాట్లాడుకుంటున్నాయట పార్టీ వర్గాలు. ఇక్కడ టీడీపీతో పోలిక తీసుకురావడం మరింత ఇబ్బంది మారిందట వైసీపీ నాయకత్వానికి. వాసుపల్లి గణేష్



రాజకీయంగా ఎదిగింది, రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచింది టీడీపీలోనే. 2014, 2019లో విశాఖ దక్షిణ స్థానం నుంచి గెలిచారాయన. ఆ సమయంలో నేరుగా చంద్రబాబుతో మాట్లాడే అవకాశం ఉండేదని కానీ వైసీపీ అధికారంలో ఉన్నా ప్రతిపక్షం లో కూర్చున్నా . నియోజకవర్గ సమస్యల గురించి పార్టీ అధ్యక్షుడు జగన్‌కు నేరుగా రిపోర్ట్ చేసే అవకాశం లేకుండా పోయిందని, అదే అతిపెద్ద సమస్య అంటున్నారట ఈ మాజీ.వాస్తవానికి 2024 ఎన్నికల ఫలితాలు మిగిలిన నియోజకర్గాలతో పోలిస్తే వాసుపల్లికి అతిపెద్ద షాక్. జనసేన పోటీ చేయడం, ప్రత్యర్థి వంశీకృష్ణ పొరుగు నియోజకవర్గం నుంచి రావడం, రెండు సార్లు గెలిచిన తన అనుభవం అన్నీ కలిసొచ్చి స్వల్ప మెజారిటీతో అయినా.. బయటపడతానని అనుకున్నారట ఆయనకానీ ఆ అంచనాలను తల్లకిందులు చేస్తూ ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్ 64వేలకు పైగా మెజార్టీతో గెలవడం చూసి వాసుపల్లి నిజంగానే షాకయ్యారన్నది లోకల్ వాయిస్. ఆ తర్వాతనే ఆయన పార్టీలోని అత్యంత కీలకమైన వ్యవస్థని టార్గెట్ చేస్తూ మాట్లాడటం యాధృచ్చికం కాకపోవచ్చని అంచనా వేస్తున్నారు విశ్లేషకులు. 2019లో టీడీపీ నుంచి గెలిచి ఏడాది కాలానికే జెండా పీకేశారు ఈ మత్స్యకార నేత. వైసీపీ అధినాయకత్వం సాదరంగా స్వాగతించినప్పటికీ నియోజకవర్గ రాజకీయాలు కంట్లో నలుసుగా మారాయట. అప్పటి వైసీపీ నేత, బ్రాహ్మణ కార్పొరే షన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్ వర్సెస్ వాసుపల్లిగా వ్యవహారం నడిచేది. అప్పటి పార్టీ ముఖ్యనేత విజయ సాయిరెడ్డి ప్రమేయంతోనే తాను ఇబ్బంది పడాల్సి వచ్చిందన్న అభిప్రాయం ఆయనలో ఉందట. ఇక ఎన్నికలకు ముందు సుధాకర్ పార్టీ మారిపోయి దక్షిణ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ అయ్యారు. ఇక దక్షిణ నియోజకవర్గం వైసీపీలో తనకు ఇబ్బంది లేదనుకుంటున్న టైంలో చేసిన తాజా వ్యాఖ్యలు ఇప్పుడు పార్టీలో కలకలం రేపుతున్నాయి. ఇప్పుడు ఆయన స్వరం ఎందుకు మారిందన్న చర్చలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో అధికారం మారిన వెంటనే ఆయన తిరిగి కూటమికి దగ్గరవుతారని అనుకున్నారు అంతా. గణేష్ కుమార్ మాత్రం ప్రాణం వున్నంత వరకు వైసీపీలోనేనని తేల్చేశారు. అలాంటప్పుడు ఈ అసంతృప్త స్వరం ఎందుకంటే అందుకు వేరే బలమైన కారణాలున్నాయన్న విశ్లేషణలు నడుస్తున్నాయి. విశాఖ దక్షిణంలో బలపడేందుకు మాజీ ఎమ్మెల్యే ద్రోణంరాజు శ్రీనివాస్ కుటుంబం ప్రయత్నం చేస్తోందట. అలాగే ఒకరిద్దరు మాజీ ఎమ్మెల్యేలు కూడా యాక్టివేట్ అవుతున్నట్టు సమాచారం. వాళ్ళకు పార్టీలోని సీనియర్లు సహకరిస్తున్నారన్న అనుమానమే ఆయన అసహనానికి కారణం కావచ్చంటున్నారు. అందుకే కో ఆర్డినేటర్ వ్యవస్థను కూడా ప్రశ్నిస్తుండవచ్చన్నది ఓ వాదన. మొత్తం మీద వైసీపీలోని అత్యంత కీలకమైన వ్యవస్థ టార్గెట్‌గా వాసుపల్లి సంధించిన అసంతృప్తి అస్త్రం ఎన్ని మలుపులు తిరుగుతుందో చూడాలి.

# అక్కా చెల్లెళ్ల మధ్య పెరిగిన దూరం

**కర్నూలు, జూన్ 17, ( వెలుతురు)**

ప్రముఖ రాజకీయ కుటుంబానికి చెందిన ఆ అక్కచెల్లెళ్ళ మధ్య ఏదో జరుగుతోందా? ఇబ్బంది వచ్చినప్పుడు కూడా కనీసం ఒకర్ని ఒకరు పరామర్శించుకోలేనంత అగాధం పెరిగిపోయిందా? సినిమా, రాజకీయం కలగలిసిపోయినట్టుగా ఉండే ఆ సిస్టర్స్ ఎవరు? వాళ్ళ మధ్య సఖ్యత లేదన్న అనుమానాలు ఇప్పుడెందుకు వచ్చాయి? నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ ఎమ్మెల్యే, మాజీ మంత్రి భూమా అఖిలప్రియను వివాదాలు చుట్టుముడతాయో లేక ఆమే వివాదాలను వెతుక్కుంటూ వెళ్తారో తెలీదుగానీ ఎప్పుడూ ఏదోఒక వివాదాస్పద టాపిక్‌తో చర్చల్లో వుంటున్నారు ఆమె. ఆ పరంపరలోనే తాజాగా వివాదం ఆమె ఖాతాలో పడింది. కాకుంటే ఈసారి ఇది మరింత తీవ్రమైనది, రక్త సంబంధానికి సంబంధించినదని చెప్పుకుంటున్నారు నియోజకవర్గంలో. దొర్నిపాడు మండలం డబ్ల్యూ గోవిందిన్నెలో జరిగిన ఓ కార్యక్రమానికి వెళ్ళారు అఖిల. అక్కడే అనుకోకుండా స్పృహ తప్పి పడిపోయారామె. గోవిందిన్నెలో మూలపెద్దమ్మ దేవర గండ దీపం మోశాక స్పృహ తప్పి పడిపోయారు ఎమ్మెల్యే. ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స చేసి నంద్యాల ఆసుపత్రికి తరలించారు. మరుసటి రోజు వరకు అన్ని పరీక్షలు చేయించుకొని ఎలాంటి అనారోగ్యం లేదని నిర్ధారించుకున్న తర్వాత డిశ్చార్జ్ అయ్యారామె. అటు మూల పెద్దమ్మ దేవర ఉత్సవాలకు అఖిలప్రియ సొంత చెల్లెలు మౌనిక, ఆమె భర్త మంచు మనోజ్ కూడా వచ్చారు. అఖిల పెదనాన్న భూమా బ్రహ్మనంద రెడ్డి ఆహ్వానం మేరకు వాళ్ళు కూడా ఉత్సవాలకు హాజరయ్యారట. కానీ బ్రహ్మానంద రెడ్డి ఇంటికి అఖిలప్రియ వెళ్ళలేదు. అది వేరే సంగతి. ఇక అఖిల స్పృహ తప్పి పడిపోయిన సమయంలో మౌనిక దంపతులు కూడా అదే ఊళ్ళో ఉన్నారట. కానీ వాళ్ళు అదేమీ పట్టించుకోకుండా



అమ్మవారి దర్శనం చేసుకొని వెళ్లిపోయారు. అఖిల స్పృహ తప్పి పడిపోయి ఒక రోజంతా ఆసుపత్రిలో వున్నా సొంత చెల్లి దంపతులు పరామర్శించక పోవడం చర్చనీయాంశమైంది. ఎమ్మెల్యే అఖిలను మంత్రి ఫరూక్, ఇతర ముఖ్య నేతలు, ఆళ్లగడ్డ టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. అయినాసరే . ఘటన జరిగినప్పుడు అక్కడికి దగ్గర్లోనే ఉన్న సొంత చెల్లి మౌనిక పరామర్శించకపోవడం ఏంటన్నది ప్రస్తుతం నంద్యాల పొలిటికల్ సర్కిల్స్‌లో బిగ్ క్వశ్చన్.ఆ మధ్య జరిగిన దివంగత భూమా శోభానాగిరెడ్డి వర్ధంతి కార్యక్రమానికి మౌనిక, మంచు మనోజ్ వెళ్లిన సందర్భంలోనూ అక్కచెల్లెళ్ళ మధ్య మాటలు లేవు. కేవలం భూమా ఘాట్ కు వెళ్లి నివాళులు అర్పించి అటు నుంచి ఆటే వెళ్లిపోయారు మౌనిక దంపతులు. అప్పుడు అఖిలప్రియ ఇంటికి వెళ్ళలేదట. రెండేళ్ల క్రితం కూడా ఇలాగే భూమా ఘాట్‌కు వెళ్లి అఖిలను కలవకుండానే మౌనిక దంపతులు వెళ్లిపోయారు. వాటన్నిటిని ఇప్పుడు జరిగిన తాజా ఎపిసోడ్‌తో పోల్చి చూసుకుంటున్నవాళ్ళు . భూమా సిస్టర్స్ మధ్య సత్సంబంధాలు లేవా అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారట. కొన్నేళ్లుగా ఇద్దరూ కలిసిన సందర్భాలు కూడా లేవట. దీంతో గ్యాప్ గట్టిగా ఉందనే ప్రచారం ఊపందుకుంది. వాస్తవంగా భూమా కుటుంబానికి సంబంధించి ఇది వ్యక్తిగత విషయమే అయినా రాజకీయ, సినీ రంగంతో ఉన్న సంబంధాల కారణంగా చర్చనీయాంశం అవుతోంది. అటు తనను పరామర్శించకుండానే మౌనిక, మనోజ్ దంపతులు వెళ్లిపోవడంపై అఖిలప్రియ కూడా ఆసక్తికర వ్యాఖ్యలు కూడా చేశారు. నేను కళ్ళు తిరిగి పడిపోయి హాస్పిటల్ లో ఉంటే ఆ విషయం వదిలేసి పరామర్శలకు ఎవరు వచ్చారు, ఎవరు రాలేదని మాట్లాడుకోవడం కరెక్ట్ కాదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారామె. అంతవరకు ఓకే అనుకున్నా . చెల్లెలు తర్వాత ఫోన్లో అయినా పరామర్శించిందా అన్న విషయంలో మాత్రం క్లారిటీ ఇవ్వడంలేదు ఎమ్మెల్యే. ఈ విషయంలో మౌనిక వైపు వాదన మరోలా ఉందట. అఖిల ఆసుత్రిలో చేరే సమయానికి తాము అక్కడి నుంచి వచ్చేశామని, ఆమె పడిపోయిన విషయం తమకు తెలియదని మంచు మనోజ్ వ్యక్తిగత సిబ్బంది చెబుతున్నట్టు సమాచారం. మొత్తమ్మీద ఎమ్మెల్యే భూమా అఖిల అనారోగ్యం ప్రస్తుతం పొలిటికల్ కలర్ పులుముకుంటోంది. అక్క చెల్లెళ్ళ మధ్య ఏదో ఉందని ఊహాగానాలు పెరుగుతున్న క్రమంలో అలాంటిదేం లేదని ఇద్దరూ ఖండించకపోవడాన్ని ప్రత్యేకంగానే చూడాలంటున్నారు.

# అనవసర రాద్ధాంతంతో వైసీపీ

**విజయవాడ, జూన్ 17, ( వెలుతురు)**

ఇంటిలో తిరుగుతున్న ఫ్యాన్ కు బేరింగులు బాగుంటేనే దాని నుంచి నలుదిక్కులా గాలి వస్తుంది. శబ్దం లేకుండా ఫ్యాన్ ఆహ్లాదాన్ని అందిస్తుంది. రాత్రి వేళ సుఖమయ నిద్రను అందిస్తుంది. ఫ్యాన్ లొని ఇతరత్రా పరికరాల కంటే బేరింగులే కీలక భూమిక పోషిస్తాయి. అలాంటి ఫ్యాన్ ను పట్టుకుని ఎన్నికల ప్రచారంలో వైసీపీ అదినేత, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఫ్యాన్ ఇంటిలో ఉండాలి.. టీడీపీ గుర్తు సైకిల్ ఇంటి బయట ఉండాలి, ఇక జనసేన గుర్తు గ్లాసు సింకులో ఉండాలంటూ రిథమిక్ డైలాగులు చెప్పిన విషయం గుర్తుండే ఉంటుంది. అయితే ఇప్పుడు వైసీపీ పరిస్థితి చూస్తే ఆ పార్టీ గుర్తు ఫ్యాన్ కే బేరింగులు పూర్తిగా పాడైపోయాయని చెప్పక తప్పదు.ఇక అసలు విషయంలోకి వస్తే జగన్ అమలు చేసిన అమ్మ ఒడి మాదిరిగానే కూటమి సర్కారు ఇటీవలే తల్లికి వందనం పేరిట కార్యక్రమాన్ని ప్రారంబించింది. ఈ పథకంపై ఆది నుంచి కూడా తనదైన శైలి విమర్శలు గుప్పిస్తూ వస్తున్న వైసీపి ఎక్కడికక్కడ కూటమి పార్టీలను ప్రత్యేకించి టీడీపీని ఎద్దేవా చేసేందుకు వైసీపీ నేతలు చేయని యత్నం లేదంటే అతిశయోక్తి కాదు. ఈ విమర్శలన్నింటినీ తట్టుకుని మరీ కూటమి సర్కారు తల్లికి వందనాన్ని ఘనంగా ప్రారంభించింది. ముందుగా చెప్పినట్టుగా ఇంటిలో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తామన్న కూటమి మాట తప్పలేదు. ఫలితంగా ఒక్కో ఇంటిలో ఐదుగురు, ఆరుగురు, కొన్ని కుటుంబాల్లో అయితే ఏకంగా 12 మంది పిల్లలకూ ఈ పథకం అందింది.అయితే పథకం ప్రారంభం అయిన వెంటనే ఈ పథకం అమలు తీరుపై వైసీపీ తనదైన శైలి



విమర్శలు గుప్పించడం మొదలు పెట్టింది. తల్లికి వందనం రూ.15 వేల అని చెప్పి రూ.13 వేలు మాత్రమే ఇచ్చారన్న వైసీపీ మిగిలిన రూ.2 వేలు లోకేశ్ ట్యాక్స్ కింద లోకేశ్ ఖాతాలకు మళ్లాయని ఆరోపించింది. ఈ ఆరోపణలపై టీడీపీ చాలా వేగంగా రియాక్ట్ అయ్యింది. అమ్మ ఒడిలో మీరు కూడా రూ.2 వేలు కట్ చేశారు కదా..మరి నాడు జగన్ ఖాతాలోకి వెళ్లాయా? అని ప్రశ్నించిన టీడీపీ లోకేశ్ ఖాతాలోకి రూ.2 వేలు చేరినట్లుగా నిరూపించాలని డిమాండ్ చేసింది. ఈ విషయంలో స్వయంగా లోకేశే రంగంలోకి దిగి డెడ్ లైన్ విధించడంతో వైసీపీ సైలెంట్ అయిపోయింది. సారీ చెప్పాలని లోకేశ్ హెచ్చరించినా ఏదో మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ మిన్నకుండిపోయింది.ఇక ఆదివారం ఉదయం నుంచి వైసీపీ ఈ పథకంలో బారీ ఎత్తున అవినీతి జరిగిందంటూ ఊదరగొట్టింది. ఒక తల్లికి 360 మంది పిల్లలు ఉన్నారని, వారందరికీ తల్లికి వందనం కింద డబ్బులు వేశారని, అలాగే చాలా మంది పేర్ల కింద 150, 100.. ఇలా ఇష్టారాజ్యంగా పిల్లల పేర్లు రాసుకుని టీడీపీ నేతలు ఈ పథకం డబ్బులను కాజేశారంటూ ప్రచారం మొదలెట్టింది. అయితే ఈ ఆరోపణలపైనా టీడీపీ మరింత వేగంగా రియాక్ట్ అయ్యింది. తల్లికి వందనం పథకాన్ని తాము అనాథ శరణాలయాల పిల్లలకూ అమలు చేస్తున్నామని చెప్పిన టీడీపీ ఆ పెద్ద పెద్ద సంఖ్యలన్నీ రాష్ట్రంలోని ఆయా అనాథ శరణాలయాలకు చెందిన జాబితాలేనని తేల్చిచెప్పింది. అయినా ఏదో జాబితాల్లో దొరికింది కదా అని క్షేత్ర స్థాయి పరిశీలన లేకుండానే విమర్శలు చేస్తే ఇలానే ఉంటుంది మరీ.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com